అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
బుధవారం 17-4-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 107 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50

అదరగొట్టారు
- సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో మెరిసిన తెలుగు తేజాలు
- తెలంగాణా నుంచి అనన్యారెడ్డికి మూడో ర్యాంకు
- ఆలిండియా టాపర్‌గా ఆదిత్య శ్రీవాస్తవ
- టాప్ ఐదు ర్యాంకుల్లోని ముగ్గురు ఇప్పటికే ఐపీఎస్‌లు
- ఢిల్లీ జామియా వర్సిటీ నుంచి 31 మంది ఎంపిక


అనన్యా
ఆదిత్య
అన్వేష్ ప్రధాన్
సాయికిరణ్

వివరాలు 2లో

నేను ఉగ్రవాదిని కాదు
- జైలు నుంచి కేజ్రీవాల్ సందేశం



న్యూఢిల్లీ : తాను ఉగ్రవాదిని కాను అంటూ ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ జైలు నుండి ఓ సందేశాన్ని పంపారని ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. " నాపేరు అరవింద్ కేజ్రీవాల్. నేను ఉగ్రవాదిని కాదు. మూడు సార్లు ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఎన్నికైన నేను పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌ను జైలులో గ్లాసు ...5లో


చమురు మంట..!
- 90 డాలర్లు దాటిన బ్యారెల్ ధర
- పశ్చిమాసియాలో యుద్ధ ఆందోళనల ఎఫెక్ట్
- 100 కు చేరొచ్చని అంచనా

న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఆందోళనలు చమురు ధరలకు ఆజ్యం పోస్తోంది. ఈ ఉద్రిక్తతల ప్రభావం భారత్‌పై భారీగానే ఉండొచ్చని తెలుస్తోంది. ఫ్యూచర్ మార్కెట్‌లో మంగళవారం బ్యారెల్ చమురుపై 0.5 శాతం పెరిగి 90.58 డాలర్లకు ...13లో



రూపాయి విలవిల..
- డాలర్‌తో రూపాయి మారకం విలువ 8 పైసల మేర పతనం
- రూ.83.53కు చేరిక ...13లో


విద్వేషాలు రెచ్చగొడుతున్నారు
- మోడీపై చర్యలు తీసుకోండి : ఎన్నికల సంఘానికి ఏచూరి లేఖ



న్యూఢిల్లీ : దేశంలో విద్వేషాలు, వైషమ్యాలు రెచ్చగొట్టేలా ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నికల ప్రసంగాలు చేస్తున్నారని, ఇందుకుగాను ఆయనపై చర్య తీసుకోవాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఈ మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు రెండు రోజుల క్రితం ఒక లేఖ రాశారు. ప్రధాని మోడీ ఎన్నికల ప్రసంగాలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అయోధ్యలో రామాలయంలో జనవరి 22న జరిగిన ...5లో

నెత్తురోడిన బస్తర్

ఎన్నికల వేళ... ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్
- 29 మంది మావోయిస్టులు హతం
- మృతుల్లో అగ్రనేత శంకరరావు?
- ముగ్గురు బీఎస్ఎఫ్ జవాన్లకు గాయాలు


(ఫైల్)

దండకారణ్యం కాల్పులతో దద్దరిల్లుతోంది. ఛత్తీస్‌గఢ్‌లో ఎటు చూసినా భద్రత బలగాలే..కూంబింగ్ ఆపరేషన్లతో పచ్చని అడవుల్లో రక్తం ఏరులైపారుతోంది. సార్వత్రిక ఎన్నికలకు మూడు రోజులకు ముందు..ఏకంగా 29 మంది మావోయిస్టులు హతం కావటం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు అడవిలో ఎప్పుడు ఏం జరుగుతుందో..ఎక్కడ నుంచి తూటాలు వస్తాయో..తెలియక అడవి బిడ్డలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఎదురు కాల్పుల పేరిట నరమేధం జరుగుతోందని, ఈ రక్త చరిత్రను ఆపాలని పౌరసంఘాలు, మేధావి వర్గాలు ఆందోళనవ్యక్తం చేస్తున్నారు.



నవతెలంగాణ-చర్ల

లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు మూడు రోజుల ముందు ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఎదురు కాల్పుల్లో 29 మంది మావోయిస్టులు హతమయ్యారు. బీఎస్ఎఫ్ ఇన్స్‌పెక్టర్, ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. మావోయిస్టులకు గట్టి పట్టున్న బస్తర్ జిల్లాలో ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. మృతుల్లో మావోయిస్టు అగ్రనేత శంకరరావు కూడా ఉన్నారని తెలుస్తోంది. ఆయన తలపై రూ.25 లక్షల రివార్డు ఉంది. బస్తర్‌లో ఈ నెల 19న, కాంకర్‌లో 26న పోలింగ్ జరగాల్సి ఉంది. ఎన్నికల దృష్ట్యా బస్తర్ జిల్లాలో ఇటీవల 60 వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించారు.

ఇంటెలిజెన్స్ నివేదికల ఆధారంగా సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్), జిల్లా రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) బృందాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. గాలింపు కొనసాగుతుండగానే మావోయిస్టులు కాల్పులు జరిపారని, తమ దళాలు వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టాయని బీఎస్ఎఫ్ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఎన్‌కౌంటర్ అనంతరం ఇన్స్‌పెక్టర్ జనరల్ సుందర్‌రాజ్ పాత్రికేయులతో మాట్లాడుతూ సంఘటనా స్థలాన్ని పరిశీలించగా 29 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయని చెప్పారు. ఎన్‌కౌంటర్ స్థలంలో పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలు కూడా లభ్యమయ్యాయని ...5లో

గల్ఫ్ కార్మికులకు ప్రత్యేక బోర్డు

రైతు బీమా తరహాలో ప్రమాద బీమా
- ప్రజా భవన్‌లో సీనియర్ ఐఏఎస్ నేతృత్వంలో ప్రత్యేక సెల్
- సెప్టెంబర్ 17లోగా సమస్యల పరిష్కారానికి కృషి
- నిజామాబాద్‌లో కాంగ్రెస్‌కు పట్టంకట్టండి : గల్ఫ్ కార్మిక సంఘాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తాజ్ దక్కన్‌లో గల్ఫ్ కార్మిక సంఘాల నేతలతో ఆయన సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ గల్ఫ్ వెలుతున్న వారిలో ఏజెంట్ల బారిన పడి కొందరు, యాజమాన్యం చేతిలో మరికొందరు కార్మికులు మోసపోతున్న నేపథ్యంలో చట్టబద్ధంగా వారి హక్కులను కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గల్ఫ్‌తో పాటు ఇతర దేశాలకు వెళ్లే కార్మికుల కోసం సీనియర్ ఐఏఎస్ అధికారి ...13లో

రాజకీయ క్షేత్రంలో రాముడు

అయోధ్య పై ఉన్న భక్తి.. భద్రాద్రిపై లేదెందుకు?
- భద్రాచలం వైపు కన్నెత్తయినా చూడని మోడీ, షా
- అయోధ్య మందిర నిర్మాణానికి వేల కోట్లు
- రూ.100 కోట్లు వెచ్చిస్తే భద్రాచలంలో ఎంతో పురోగతి
- హెరిటేజ్ సిటీ కాదూ.. రైలుమార్గమూ రాదు..
- నేడు శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

అయోధ్య రామునిపై ఉన్న భక్తి ప్రపత్తులు.. భద్రాద్రి రామునిపై ప్రధాని మోడీకి ఎందుకు లేవని పలువురు భక్తులు ప్రశ్నిస్తున్నారు. భద్రాద్రి రాముడిని ఎందుకింత నిర్లక్ష్యానికి గురిచేస్తున్నారన్న చర్చ నడుస్తోంది. రాముని పేరుతో రాజకీయం చేసేందుకే బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శకుల మాట. ప్రతి ఎన్నికలకు ముందు రాముని పేరుతో రాజకీయం చేయడం.. తద్వారా ఓట్లు రాల్చుకోవడం బీజేపీకి ఆనవాయితీగా మారింది. నిజంగా రామునిపై భక్తి ఉంటే భద్రాచలాన్ని కూడా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మోడీ ప్రభుత్వంపై లేదా? అనే సందేహాలను రామ భక్తులు వెలిబుచ్చుతున్నారు. రామాయణ ఇతివృత్తంలోని ...13లో



దగ్ధమయ్యాయా.. తగలబెట్టారా..!
- కేంద్ర హోంశాఖ కార్యాలయంలో అగ్నిప్రమాదం.. పలు ఫైళ్లు దగ్ధం

న్యూఢిల్లీ: ఢిల్లీలోని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కార్యాలయంలో అగ్నిప్రమాదం సంభవించింది. అయితే వాటంతటవే దగ్ధమయ్యాయా..లేక ఎవరైనా తగులబెట్టారా..అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.నార్త్ బ్లాక్‌లోని ఐసీ డివిజన్ లోని రెండో అంతస్తులో మంగళవారం ఉదయం 9:20 గంటల సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది.

సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని ఏడు ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను అదుపు ...13లో

లిల్లీపుట్‌గాళ్ల సర్కార్

ఏడాదైన ఉంటదా..?
- అంబేద్కర్ విగ్రహానికి దండేసి దండం పెట్టరా
- కేసీఆర్ కట్టిన గుడికెందుకు పోతుండ్రు.. ఆఫీస్‌లో ఎట్ల కూసుంటుండ్రు
- బోనస్ బోగస్సైంది.. రుణమాఫీ దోకా చేసిండ్రు
- హామీల్ని ఎగబెట్టిన కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలి..?
- బీజేపీకి ఓటేస్తే మురికి కాల్వలేసినట్టే
- బీఆర్ఎస్‌ను గెలిపిస్తే ప్రజల తరపున కొట్లాడుతం : సుల్తాన్‌పూర్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

"లిల్లీపుట్‌గాళ్లకు కూడా అధికారమొస్తది. మంచి పనులు చేస్తరని అధికారం ఇస్తరు. కానీ..! ఏం జరుగుతుంది. అంబేద్కర్ రాసిన ఆర్టికల్ 3 పుణ్యాన తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నం. దేశం గర్వించేలా అంబేద్కర్ విగ్రహం పెట్టుకున్నాం. కానీ..! లిల్లీపుట్‌గాళ్ల ప్రభుత్వం అంబేద్కర్ విగ్రహానికి దండేసి దండం పెట్టలే. దేశం నలుమూలల నుంచి అంబేద్కరిస్టులొస్తే చూడనీయకుండా తాళ మేసిండ్రు. ఇది అహంకారమా..? అజ్ఞానమా..? కండ కావరమా..? నేను పెట్టినానని అంబేద్కర్‌ను అవమాన పరుస్తరా..? మరి సెక్రటేరియట్‌కు అంబేద్కర్ పేరు పెట్టినం. ఎందుకు సిగ్గులేకుండా అక్కడ కూర్చుంటున్నరు. యాగదిరిగుట్ట ...5లో

కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

22న పరిశీలిస్తామన్న రౌస్ అవెన్యూ కోర్టు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం మనీలాండరింగ్ కేసులో రెగ్యూలర్ బెయిల్ కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. ఈ కేసును విచారిస్తోన్న రౌస్ అవెన్యూ కోర్టు స్పెషల్ జడ్జి కావేరి బవేజా మంగళవారం సెలవులో ఉండడంతో ఈ పిటిషన్ విచారణను ఈనెల 22కు వాయిదా వేస్తున్నట్లు కోర్టు వెల్లడించింది. సీబీఐ కేసులో తాజాగా కవిత దాఖలు చేసిన రెగ్యూలర్ బెయిల్ పిటిషన్‌తో కలిపి ఈ పిటిషన్ ను విచారించనున్నట్టు స్పష్టం చేసింది.

టెంపరేచర్ @ 44.7 డిగ్రీలు
- మళ్లీ పెరుగుతున్న ఎండలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వారం పాటు కాస్త శాంతించి చల్లదనాన్ని పంచిన భానుడు మళ్లీ హీటెక్కిపోతున్నాడు. ఉక్కపోతతో అల్లాడిస్తున్నాడు. 45 డిగ్రీల ఉష్ణోగ్రతలతో భయపెడుతున్నాడు. రాష్ట్రంలో మంగళవారం అత్యధికంగా ...5లో

భద్రాచలం	44.7
వెల్గటూరు(జగిత్యాల)	44.6
మాడ్గులపల్లి(నల్లగొండ)	44.6
నాంపల్లి(నల్లగొండ)	44.6
గార్ల(మహబూబాబాద్)	44.5
మార్తాన్‌పేట(సిరిసిల్ల)	44.5

పతంజలికి వ్యవస్థ దాసోహం

చూసి చూడనట్టు వ్యవహరించిన ప్రభుత్వాలు
- మీడియా నుంచి బ్యూరోక్రసీ వరకు ఇదే దారి
- రెచ్చిపోయిన బాబా రాందేవ్ కంపెనీ
- తప్పుడు ప్రకటనలతో పబ్బం గడుపుకున్న తీరు
- ప్రజలు నమ్మేలా చేసి కోట్ల రూపాయల్లో వ్యాపారం
- ఎట్టకేలకు కొరదా ఝుళిపించిన సుప్రీంకోర్టు
- క్షమాపణలు చెప్తూ దిగొచ్చిన పతంజలి బాబా

పతంజలి ఆయుర్వేద ఉత్పత్తుల విషయంలో బాబా రాందేవ్ తనకు నచ్చినట్టుగా వ్యవహరించారు. తమ ఉత్పత్తులకు అనేక రోగాలను నయం చేసే సామర్థ్యం ఉన్నదని అధికారికంగా ప్రభుత్వ సంస్థల నుంచి ఎలాంటి సర్టిఫికెట్ లేకున్నా.. బాబా రాందేవ్ ప్రకటనలతో హోరెత్తించారు. స్థానిక పత్రికలు, ఛానెళ్లే కాదు.. ఏకంగా జాతీయ ఆంగ్ల వార్త పత్రికలు, మీడియా ఛానెళ్లలో ఈ ప్రకటనలు వచ్చాయి. అయితే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఈ అంశాన్ని చూసి చూడనట్టుగా వ్యవహరించాయి. మీడియా, బ్యూరోక్రసీ కూడా పతంజలి తప్పుడు ప్రకటనల విషయంలో ఉదాసీనంగా వ్యవహరించాయి. దీంతో ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకొని పతంజలి బాబా రెచ్చిపోయి, విపరీత ప్రకటనలు, కోట్ల రూపాయల్లో వ్యాపారం చేశాడని విశ్లేషకులు, మేధావులు అంటున్నారు.



న్యూఢిల్లీ : పతంజలి ఆయుర్వేద ఉత్పత్తుల విషయంలో యోగాబాబా ప్రజలను తప్పుదోవ పట్టించాడని చెప్తున్నారు. రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్, కాలేయ రుగ్మతల వంటి వివిధ రోగాలకు కు చికిత్స చేస్తామని పేర్కొంటూ దాదాపు రెండేండ్ల క్రితం పతంజలి తన ఆయుర్వేద ఉత్పత్తుల కోసం ఆంగ్ల భాషా వార్తాపత్రికలలో వరుస ప్రకటనలను ప్రచురించింది. ప్రజలను తప్పుదోవ పట్టించే ఇలాంటి ప్రకటనల విషయంలో ఎట్టకేలకు సుప్రీంకోర్టు పతంజలి సంస్థపై కొరడా ఝుళిపించింది. దీంతో క్షమాపణలు చెప్పటానికి బాబా రాందేవ్, పతంజలి హెడ్ బాలకృష్ణలు దిగిరావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ...13లో

సుప్రీం మళ్లీ మొట్టికాయలు
- మీరేమీ అమాయకులు కాదు : బాబా రాందేవ్‌పై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం

కోర్టు ధిక్కరణ కేసులో పతంజలి ఆయుర్వేద నిర్వాహకులు బాబా రాందేవ్, బాలకృష్ణలపై సుప్రీంకోర్టు మరోసారి ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. బాబా రాందేవ్ అంత అమాయకుడేం కాదనీ, ఆయనది బాధ్యత రాహిత్యమైన ప్రవర్తన అని ద్విసభ్య ధర్మాసనం తప్పుబట్టింది. పతంజలి ఆయుర్వేద ఔషధాలకు సంబంధించి తప్పుదోవ పట్టించే ప్రకటనల కేసును జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ ఎ. అమానుల్లాతో కూడిన సుప్రీకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. బాబా రాందేవ్, బాలకృష్ణ ఇద్దరూ సుప్రీకోర్టు విచారణకు ప్రత్యక్షంగా హాజరయ్యారు. "మేము చేసిన తప్పిదాలకు బేషరతుగా క్షమాపణలు తెలియజేస్తున్నాం. ఆ సమయంలో మేము చేసింది ...13లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

కార్పొరేట్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

- నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాలు తగదు
- తరగతులు నిర్వహిస్తే కఠినంగా వ్యవహరించాలి : ఇంటర్ బోర్డు కార్యదర్శికి ఎస్ఎఫ్ఐ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాలు చేపట్టడం తగదనీ, కార్పొరేట్ కాలేజీలు, అకాడమీలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కోచింగ్‌ల పేరుతో లక్షలాది రూపాయలు దండుకుంటూ ఇంటర్మీడియట్ తరగతులు నడుపుతున్నాయని విమర్శించింది. అలాంటి కార్పొరేట్ కాలేజీలు, అకాడమీలపై కఠినంగా వ్యవహరించాలని కోరింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజాను మంగళవారం హైదరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో పదో తరగతి పరీక్షల ఫలితాలు రాకుండానే పీఆర్వోలు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లను పెట్టి కార్పొరేట్ విద్యాసంస్థలు, అకాడమీలు ముందస్తు ప్రవేశాలు చేపడుతున్నాయని వారు తెలిపారు. ఇంటర్ పరీక్షలు పూర్తైన వెంటనే విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. నీట్, జేఈఈ, ఎప్‌సెట్ కోచింగ్ పేరుతో లక్షలాది రూపాయలు తీసుకుంటున్నాయని వివరించారు. బోర్డులు లేకుండా, అపార్ట్‌మెంట్లను అద్దెకు తీసుకుని నిర్బంధంగా తరగతులు నడుపుతున్నాయని తెలిపారు. ఇంటర్ బోర్డు అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రహస్యంగా తరగతులు నడుపుతున్న కార్పొరేట్ కాలేజీలు, అకాడమీలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నారాయణ, శ్రీచైతన్య, రెసోనెన్స్, అవినాష్, ఫిడ్జీ, ఆకాశ్ వంటి అకాడమీలు ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లు, సోషల్ మీడియాతోపాటు వారి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లను విద్యార్థుల పాఠశాలలు, ఇండ్ల వద్దకు తిప్పుతూ రూ.లక్షలు ఫీజులు తీసుకుంటున్నాయని విమర్శించారు. ఇంటర్ బోర్డు అధికారులు కనీసం పరిశీలించడం లేదనీ, ఏమీ పట్టించుకోకుండా కేవలం షోకాజ్ నోటీసులు మాత్రమే ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి స్పందించారనీ, స్క్వాడ్ టీమ్‌లను ఏర్పాటు చేసి కాలేజీలకు పంపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం మమత, రాష్ట్ర కమిటీ సభ్యులు జూనుగరి రమేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెనిన్ గువేరా, కార్యదర్శి అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు సీఎం శ్రీరామనవమి శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. భద్రాది సీతారాముల ఆశీస్సులతో దేశంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆయన కోరుకున్నారు. భద్రాద్రి క్షేత్ర ప్రాధాన్యాన్ని దేశమంత చాటేలా ఘనంగా వేడుకలు నిర్వహించాలని ముఖ్యమంత్రి అధికారుకు సూచించారు. భక్తులకు అసౌకర్యం తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

నవమి ప్రశాంతంగా జరుపుకోవాలి -మాజీ సీఎం కేసీఆర్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శ్రీరామనవమి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సీతారాముల కళ్యాణ మహోత్సవ పర్వదినమైన నవమిని ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాజ్యపాలన చేసిన శ్రీరాముడు ఆదర్శ పరిపాలకుడని పేర్కొన్నారు. అన్యోన్య దాంపత్యానికి పుణ్యదంపతులైన సీతారాములు ఆదర్శనీయులని తెలిపారు.

రణదీప్ సూర్జేవాలేపై 48 గంటల పాటు నిషేధం

న్యూఢిల్లీ : కాంగ్రెస్ నాయకుడు రణదీప్ సూర్జేవాలేపై 48 గంటల పాటు ప్రచారం చేయకుండా ఎన్నికల కమిషన్ మంగళవారం నిషేధం విధించింది. బీజేపీ ఎంపీ హేమా మాలినిపై అవమానకర వ్యాఖ్యలు చేసినందుకు ఇసి నిర్ణయం తీసుకుంది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఇలాంటి ప్రచార నిషేధం విధించడం ఇదే మొదటిసారి. హేమామాలినిపై వ్యాఖ్యలకు గాను ఈ నెల 9న రణదీప్ సూర్జేవాలేకు ఈసీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. అయితే రణదీప్ ఇచ్చిన ప్రత్యుత్తరం సంతృప్తికరంగా లేకపోవడంతో అతనిపై నిషేధం విధించింది.

ఎంపీ ఎన్నికల బరిలో నేరెళ్ల బాధితుడు

- స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్న కోల హరీష్
- మళ్లీ తెరపైకి నేరెళ్ల బాధితుల అంశం

నవతెలంగాణ - తంగళ్లపల్లి



పార్లమెంటు ఎన్నికల వేళ కరీంనగర్‌లో నేరెళ్ల బాధితుల అంశం మళ్లీ తెరపైకొచ్చింది. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా నేరెళ్ల బాధితుల పక్షాన కోల హరీష్ బరిలో ఉంటున్నట్టు తెలిపారు. తమకు జరిగిన అన్యాయానికి ప్రభుత్వాలు మారినా న్యాయం జరగడం లేదని, పార్లమెంటు వేదికగా తమ గొంతులు వినిపించడానికి పోటీ చేస్తున్నట్టు తెలిపారు. ఎనిమిదేండ్లుగా పోరాటం చేసినా.. తమపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన అధికారులపై చర్యలు తీసుకోకపోగా.. ప్రమోషన్లు వస్తున్నాయని, సర్వస్వం కోల్పోయిన తమకు మాత్రం న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము పెట్టిన కేసు ఇంతవరకు ఎఫ్ఐఆర్ కాలేదని, గతంలో అన్ని పార్టీలు హామీ ఇచ్చినా ఇప్పటివరకు అధికారులపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని అన్నారు. తమకు న్యాయం కావాలని జనంలోకి వెళ్లి అడుగుతామని, అందుకే పార్లమెంటు ఎన్నికల్లో బరిలో ఉంటున్నామని స్పష్టం చేశారు.

భద్రాద్రి వేడుకల ప్రత్యక్ష ప్రసారానికి ఈసీ అనుమతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భద్రాచలం సీతారాముల కళ్యాణ వేడుకల ప్రత్యక్ష ప్రసారానికి ఎన్నికల కమిషన్ అనుమతించింది. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరిగే కార్యక్రమాల లైవ్‌టెలికాస్ట్‌కు అనుమతివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం గత నెలలోనే ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసింది. ఈ అభ్యర్థనను ఈ నెల 4న ఎన్నికల కమిషన్ తిరస్కరించింది. 1987 నుంచి ప్రత్యక్ష ప్రసారం ఆనవాయితీగా వస్తోందనీ, తమ అభ్యర్థనను పున: పరిశీలించాలని ఈ నెల 6న దేవాదాయ శాఖ మరోసారి లేఖ రాసింది. రాజకీయ పార్టీలు సైతం ఈసీ వైఖరిని తప్పుపట్టడంతో ప్రత్యక్ష ప్రసారానికి అనుమతిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రాష్ట్రంలో హైఅలర్ట్

- ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌తో అప్రమత్తం
- సరిహద్దుల్లో గ్రేహౌండ్స్ గాలింపు చర్యలు ఉధృతం

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర సరిహద్దుల్లోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మంగళవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 29 మందికి పైగా మావోయిస్టులు మరణించటంతో రాష్ట్రంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగిన నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దుల్లో పరిస్థితిని పోలీసు ఉన్నతాధికారులతో డీజీపీ రవిగుప్తా అత్యవసరంగా సమీక్షించారు. ఇటీవలి కాలంలో స్తబ్దుగా ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌తో దాని పరిణామాలు ఏ విధంగా ఉంటాయనే కోణంలో అధికారులతో డీజీపీ చర్చించినట్టు తెలిసింది. ముఖ్యంగా, ఒకపక్క రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి వివిధ రాజకీయ పక్షాల ప్రచారం జోరుగా సాగుతున్న తరుణంలో ఈ ఎన్‌కౌంటర్ జరగటం, ఈ ఘటనలో భారీ ప్రాణ నష్టానికి మావోయిస్టులు గురికావటంతో దానికి ప్రతీకారాన్ని తీర్చుకునే ప్రమాదమున్నదని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించినట్టు తెలిసింది. ఈ పరిస్థితిలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని ఆనుకొని ఉన్న రాష్ట్ర సరిహద్దులో గ్రేహౌండ్స్‌తో పాటు సీఆర్పీఎఫ్, కోబ్రా బలగాలను పెద్ద సంఖ్యలో మోహరింపజేసి, మావోయిస్టుల కోసం గాలింపు చర్యలను ఉన్నతాధికారులు తీవ్రతరం చేసినట్టు తెలిసింది. ఎన్‌కౌంటర్ ప్రాంతం నుంచి పారిపోయిన దాదాపు 50 మంది మావోయిస్టులు రాష్ట్ర సరిహద్దుల్లోకి ప్రవేశించకుండా ముందస్తు జాగ్రత్తలను అధికారులు తీసుకున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో రాజకీయ ప్రముఖులు ప్రచారం జరిపేటప్పుడు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేయాలని ఆయా జిల్లాల ఎస్పీలను రాష్ట్ర డీజీపీ ఆదేశించారు.

ఏపీ సీఎస్, డీజీపీపై చర్యలు తీసుకోవాలి

- మరికొంత మంది అధికారులపై కూడా...
- ఈసీ ఎన్డీఏ కూటమి నేతల ఫిర్యాదు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

అధికార యంత్రాంగాన్ని ఏపీలోని వైసీపీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఎన్డీఏ కూటమి నేతలు ఆరోపించారు. మంగళవారం నాడిక్కడ కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్‌ను ఎన్డీఏ నేతలు అరుణ్ సింగ్, జీవీఎల్ నరసింహారావు (బీజేపీ), కనక మేడల రవీంద్రకుమార్ (టీడీపీ) నాదెండ్ల మనోహర్ (జనసేన) కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జవహర్ రెడ్డి, డీజీపీ రాజేంద్ర నాథ్ రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ ఆర్ ఆంజనేయులు, ఎస్పీ రిశాంత్ రెడ్డి, ఏపీ బేవరైజేషన్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవ రెడ్డి, టీటీడీ ఈవో ధర్మారెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. అనంతరం బీజేపీ నేత అరుణ్‌సింగ్ మీడియాతో మాట్లాడుతూ వైసీపీకి మద్దతుగా అధికారులు సహకరిస్తున్నారని, ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేస్తున్నారని విమర్శించారు. బోగస్ ఓట్లను తొలగించాలని కోరామన్నారు. ప్రతిపక్ష నేతల ర్యాలీలకు అనుమతించడం లేదని, హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అనుమతి ఇవ్వడం లేదని అన్నారు. రాష్ట్రంలో సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల్లో వెబ్ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. జనసేన నేత నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మీద కూడా రాళ్ల దాడులు జరుగుతున్నాయని అన్నారు. శాంతి భద్రతలు పరిరక్షించడంలో విఫలమవుతూ, వైసీపీకి అండగా నిలబడుతున్న డీజీపీ తదితర అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ప్రభుత్వాన్ని కోల్పోతామన్న భావనతో అధికారులను ఉపయోగించుకుని వైసీపీకి అనుకూలంగా పనిచేయిస్తున్నారని అన్నారు. ఎన్నికల నిర్వహణ, పర్యవేక్షణ మరింత మెరుగ్గా ఉండేలా చూడాలని కోరామన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని కోరినట్లు చెప్పారు. టీడీపీ నేత కనకమేడల రవీంద్ర కుమార్ మాట్లాడుతూ చాలా మంది ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

ఎన్నికల్లో అధికారులకు స్వయం ప్రతిపత్తి లేకుండా వ్యవహరిస్తున్న తీరుపై ఫిర్యాదు చేశామన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత టీడీపీ, జనసేన సహా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన ప్రతి ఒక్కరిపై దాడులకు దిగుతున్నారని అన్నారు. ఇంత జరుగుతున్నా డీజీపీ వైసీపీ అడుగులకు మడుగులొత్తుతున్నారని విమర్శించారు. ఓడిపోతామన్న భయంతో ఏదో ఒక విధంగా ప్రజల్ని రెచ్చగొట్టి అశాంతి సృష్టిస్తున్నారని విమర్శించారు. తాము చెప్పిన అధికారులను బదిలీ చేసి, నిష్పక్షపాతంగా వ్యవహరించే అధికారులను నియమించాలని కోరినట్లు చెప్పారు. బోగస్ ఓట్ల వ్యవహారంపై కూడా ఈసీ దృష్టికి తీసుకెళ్లామని, ఈసీ అధికారులు సానుకూలంగా స్పందించారని అన్నారు. బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హర్ ఘర్ గ్యారంటీ పేరుతో ప్రతి ఇంటికి కరపత్రాలు పంచుతోందని, ఇది ఎన్నికల నియమావళిని, చట్టాన్ని ఉల్లంఘించడమేనని అన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ ప్రభావితం చేసే చర్యగానే పరిగణించాలని తెలిపారు. దొంగ గ్యారంటీ కార్డులు పంచడాన్ని నిలువరించాలని ఈసీని కోరామన్నారు.

కాంగ్రెస్ గూటికి బీఆర్ఎస్, బీజేపీ నేతలు

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్‌కు చెందిన పలువురు సీనియర్ నేతలు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో వారు కాంగ్రెస్ గూటికి చేరారు. రేవంత్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ నేత, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల్ చారి, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావుతోపాటు సరూర్‌నగర్ మాజీ కార్పొరేటర్ అనిత, దయాకర్‌రెడ్డి దంపతులు కూడా పార్టీలో చేరారు. అంతకు ముందు కొంత మంది బీజేపీ నేతలు గాంధీభవన్‌లో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ చేరారు. కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జీ జేఎన్ వెంకట్, మాజీ జెడ్పీటీసీ జేఎన్ సునీత, ఇబ్రహీంపట్నం బీజేపీ నేత ఆకుల లింగారెడ్డి, మెట్‌పల్లి బీజేపీ నేత చెన్నమనేని శ్రీనివాసరావు, ఎంపీపీ నెరెళ్ల దేవేందర్, మాజీ జెడ్పీటీసీ కొక్కు పురుషోత్తం, బీఆర్ఎస్ సర్పంచులు, సింగిల్ విండో చైర్మెన్లు కూడా పెద్ద సంఖ్యలో హస్తం గూటికి చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎడ్మ బొజ్జు, పార్టీ నాయకుల ఈరవర్తి అనిల్, పటేల్ రమేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

టెట్‌కు 2.51 లక్షల దరఖాస్తులు

- ఇప్పటి వరకు 11,095 మంది అప్లికేషన్ల సవరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 2,51,646 దరఖాస్తులొచ్చాయి. ఈ మేరకు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్, టెట్ కన్వీనర్ ఎం రాధారెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్ పేపర్-1కు 90,789 మంది, పేపర్-2కు 1,60,857 మంది కలిపి 2,51,646 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. మంగళవారం ఒక్క రోజే పేపర్-1కు 487 మంది, పేపర్-2కు 1,398 మంది కలిపి మొత్తం 1,885 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. పేపర్-1కు 91,421 మంది, పేపర్-2కు 1,61,302 మంది కలిపి మొత్తం 2,52,723 మంది అభ్యర్థులు ఫీజు చెల్లించారని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణకు తుది గడువు ఈనెల 20వ తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 11,095 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సవరణ చేసుకున్నారని వివరించారు. ఇందులో పేపర్-1కు 4,123 మంది, పేపర్-2కు 6,972 మంది ఉన్నారని తెలిపారు. దరఖాస్తుల సవరణకు ఈనెల 20వ తేదీ వరకు అవకాశముందని పేర్కొన్నారు. వచ్చేనెల 20 నుంచి జూన్ మూడో తేదీ వరకు టెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. ఇతర వివరాల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

ఎల్పీసెట్ ఫీజు చెల్లింపు గడువు 26 వరకు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


రాష్ట్రంలో పాలిటెక్నిక్ కోర్సుల్లో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశాలకు నిర్వహించే పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎల్పీసెట్) ఫీజు చెల్లింపు గడువును ఈనెల 26వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఎస్బీటీఈటీ) కార్యదర్శి పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఏమైనా సందేహాలుంటే మాసబ్ ట్యాంక్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్/ఎల్పీసెట్ ఇన్ చార్జీని సంప్రదించాలని కోరారు.

అందరికీ సమానావకాశాలు కల్పించండి

- ఈసీకి మాజీ ఉన్నతాధికారులు వినతి
- ప్రతిపక్ష నేతలను అరెస్టులతో వేధింపులు
- పాత కేసులు తిరగదోడుతున్నారు
- కమిషన్ ప్రేక్షక పాత్రపై మండిపాటు



న్యూఢిల్లీ : రాబోయే సార్వత్రిక ఎన్నికలలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు అందరికీ సమానావకాశాలు కల్పించాలని పలువురు ప్రభుత్వ మాజీ ఉన్నతాధికారులు ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు, ఇతర కమిషనర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలంటే ఇది అవసరమని తెలిపారు. ఈ మేరకు సుమారు 90 మంది ప్రభుత్వ మాజీ ఉన్నతాధికారులు ఓ బహిరంగ లేఖ రాశారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టంలోని క్రూరమైన నిబంధనల కింద ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారని వారు ఆ లేఖలో ప్రస్తావించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ప్రతిపక్ష పార్టీలు, నేతలను వెంటాడి వేధించడం చూస్తుంటే దర్యాప్తు సంస్థల ఉద్దేశాన్ని ప్రశ్నించాల్సి వస్తోందని వారు విమర్శించారు.



ఈసీపై ఆగ్రహం

ఎన్నికల ప్రక్రియలో క్రియాశీలకంగా వ్యవహరించకుండా ప్రతిపక్షాల స్వేచ్ఛను హరిస్తున్నారని, ఈ కక్షపూరిత రాజకీయాలను చూస్తూ కూడా ఎన్నికల కమిషన్ ప్రేక్షక పాత్ర పోషిస్తోందని మాజీ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో కమిషన్ వ్యవహార శైలిపై ప్రజల్లో అనుమానాలు రేకెత్తుతున్నాయని, వీటికి అడ్డుకట్ట వేయాలంటే ఈసీ నిక్కచ్చిగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నదని గత నెల రోజులుగా జరుగుతున్న పరిణామాలు చాటిచెబుతున్నాయని అన్నారు. ఈవీఎంల సమగ్రత పైన, ఓట్ల నమోదులో కచ్చితత్వం కోసం వీవీపాట్ల వినియోగం పైన ప్రజలు, రాజకీయ పార్టీల్లో నెలకొన్న అనుమానాలను తీర్చేందుకు ఎన్నికల కమిషన్ చేసిందేమీ లేదని స్పష్టం చేశారు. పాలక పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సమర్థవంతంగా అమలు చేసే విషయంపై కూడా కమిషన్ శ్రద్ధ వహించడం లేదని వారు ఆరోపించారు. గత ఏడు దశాబ్దాలుగా ఎన్నికల కమిషన్‌కు నేతృత్వం వహించిన వారు అనుసరించిన మార్గాన్నే అనుసరించాలని కోరారు. ప్రపంచంలోనే అతి పెద్ద ఎన్నికలప్రక్రియ పవిత్రతను, గొప్పదనాన్ని కాపాడేందుకు నిష్పాక్షికంగా, దృఢచిత్తంతో వ్యవహరిస్తారన్న ఆశతో దేశ ప్రజలంతా ఎదురు చూస్తున్నారని తెలిపారు.

కేజ్రీవాల్ అరెస్టుపై నిలదీత

ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన సమయాన్ని వారు ఆ లేఖలో ప్రశ్నించారు. లిక్కర్ పాలసీ కేసును పద మూడు నెలలుగా విచారిస్తున్నారని, ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన ఇద్దరు ప్రముఖ నేతలు నెలల తరబడి జైలులో ఉన్నారని, వీరిలో సంజయ్ సింగ్ బెయిలుపై విడుదల కాగా ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ఇప్పటికీ నిర్బంధంలోనే ఉన్నారని వివరించారు. కేజ్రీవాల్ విచారణకు హాజరు కావడం లేదని, అందుకే అరెస్ట్ చేశామని చెబుతున్నారని, అయితే ఆయనను ప్రశ్నించకుండా ఎవరూ అడ్డుకోలేదని స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికలను ప్రకటించి, ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత ఇలాంటి చర్యకు దిగడం ఉద్దేశపూర్వకంగానే, ప్రేరణతో జరిగిందని తాము భావిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలకు సంబంధించిన పాత కేసులను ఆదాయపన్ను శాఖ తిరగదోడుతోందని మాజీ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తృణమూల్ కాంగ్రెస్ నేత మహువా మొయిత్రా నివాసంలో జరిగిన సోదాలను వారు గుర్తు చేశారు.



బీజేపీ గెలిస్తే రిజర్వేషన్లు ఉండవు

- ఇప్పటికే ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మింది
- ఏమీ చేయని మోడీ దేవుడు ఎలా అవుతారు
- రాష్ట్ర సర్కారును కూలగొట్టే కర్మ మాకు లేదు
- ఎన్నికలు ముగియగానే పెనుమార్పులు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఆదిలాబాద్ గడ్డపై గులాబీ జెండా ఎగరేయాలని పిలుపు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

"దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన బీజేపీ ఎంపీలు, ఇతర కీలక నాయకులు తాము మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని, రిజర్వేషన్లు తొలగిస్తామని చెబుతున్నారు. బీజేపీ ఇప్పటికే ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మింది. దీన్ని బట్టి బీజేపీ మరోసారి గెలిస్తే దేశంలో రిజర్వేషన్లు అనేవి ఉండకుండా పోతాయి" అని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. బీజేపీ నేత బండి సంజయ్ మోడీ దేవుడని చెబుతున్నారు... ఆయన్ను దేవుడు అని ఎందుకు అనాలి..? అని ప్రశ్నించారు. ఆదిలాబాద్‌లో సీసీఐ పరిశ్రమను పునరుద్ధరించలేదని, ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్ నిర్మాణం చేపట్టడం లేదని, బయ్యారం ఉక్కు కర్మాగారం ఇవ్వలేదని ఇలాంటి బీజేపీకి ఎందుకు ఓటేయాలని అన్నారు. 2026లో నియోజకవర్గాల పునర్విభజన జరుగుతాయని, జనాభా ప్రాతిపదికన చేపట్టే ఈ విభజన కారణంగా రాష్ట్రంలో పార్లమెంటు నియోజకవర్గాలు తగ్గే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

లోక్‌సభ ఎన్నికలు ముగియగానే రాష్ట్రంలో పెను మార్పులు చోటుచేసుకుంటాయని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలో చేరుతారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటు వేసినా బీజేపీకి వేసినట్లేననే విషయం గుర్తించుకోవాలని సూచించారు. సీఎం జేబులో కత్తి పెట్టుకొని తిరుగుతున్నానని.. పేగులు మెడలో వేసుకుంటానని, మానవ బాంబులుగా మారుతామని అంటున్నారని, సీఎం లాంటి వ్యక్తులు మాట్లాడే భాషేనా ఇది అని ప్రశ్నించారు. రాష్ట్ర సర్కారును కూలగొట్టే కర్మ మాకు పట్టలేదని, రాబోయే ఐదేండ్లు నడపండి.. 420హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేరాలంటే.. బీఆర్ఎస్‌కు ఓటేయాలని పిలుపునిచ్చారు. పదేండ్లలో చేసిన అభివృద్ధి పనులను మనం చెప్పుకోలేకనే ఓటమి చెందామని గుర్తుచేశారు. 2లక్షల ఉద్యోగాలు కల్పించామని.. ఉద్యోగులకు రెండు సార్లు పీఆర్సీ అమలు చేశామని.. ఆర్థిక సంక్షోభం కారణంగా జీతం సరిగా వేయలేకనే ఉద్యోగుల అసంతృప్తికి కారణమైందని తెలిపారు. ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ తాము వేస్తే.. 32 వేల ఉద్యోగాలు ఇచ్చామని రేవంత్‌రెడ్డి చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్, బీజేపీ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని.. బీఆర్ఎస్ శ్రేణులు గట్టిగా పోరాడి లోక్‌సభ సీట్లలో విజయం సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ పార్లమెంటు స్థానంలో ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు.

ఇటీవల బీజేపీలో చేరిన ఆదిలాబాద్ జడ్పీ చైర్మెన్ జనార్దన్‌రాథోడ్ తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. కేటీఆర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, నిర్మల్ జడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, నాయకులు జాన్సన్ నాయక్, రమాదేవి, లోలం శ్యాంసుందర్, కిరణ్ కొమ్రెవార్, యూనిస్ అక్బానీ, అలాల్ అజయ్ పాల్గొన్నారు.



హక్కులను కాలరాస్తూ అభివృద్ధికి హామీ

ప్రధానిపై కేరళ సీఎం ఆగ్రహం

- రాష్ట్రాన్ని ఉక్కిరిబిక్కిరి చేసేందుకు ప్రయత్నించారన్న విజయన్

ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని రక్షించుకోవాలని ప్రజలకు పిలుపు

తిరువనంతపురం : కేరళ విషయంలో ప్రధాని మోడీ వ్యవహరిస్తున్న ద్వంద్వ వైఖరిని ఆ రాష్ట్ర సీఎం పినరయి విజయన్ తప్పుబట్టారు. కేరళను ఆర్థికంగా ఉక్కిరిబిక్కిరి చేసి, అర్హత ఉన్న హక్కులను కాలరాస్తూ కేంద్రంలోని మోడీ సర్కారు ఎన్నికల సమయంలో రాష్ట్రానికి అభివృద్ధి ప్యాకేజీలు ఇస్తామని హామీ ఇస్తున్నదని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని ఇచ్చిన హామీలపై ముఖ్యమంత్రి స్పందించారు. త్రిసూర్ లోక్‌సభ నియోజకవర్గంలో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) అభ్యర్థి వి.ఎస్ సునీల్ కుమార్ ప్రచార సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం పట్ల కేంద్రం వైఖరి ఏమిటో రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. "వరదలు, కరోనా, నిపా వ్యాప్తి, ఓఖీ దయనీయ పరిస్థితులను రాష్ట్రం ఎదుర్కొన్నది. మేము మద్దతు కోసం పోరాడుతున్నాము. అర్హత ఉన్న ప్రత్యేక ప్యాకేజీని కూడా కేంద్రం నిరాకరించింది. ఇది మద్దతును తిరస్కరించడమే కాకుండా, మాకు మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న ఇతర దేశాల నుంచి సహాయం తీసుకోకుండా మమ్మల్ని ఆపింది. ప్రవాస కేరళీయుల నుంచి సాయం సేకరించేందుకు మంత్రులు విదేశాలకు వెళ్లేందుకు కూడా కేంద్రం అనుమతి ఇవ్వలేదు" అని ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

'మేం బతికాం'

తాము చాలా క్లిష్ట సమయాల్లో బయటపడ్డామని విజయన్ చెప్పారు. "ప్రపంచం మొత్తం మనవైపు ఆశ్చర్యంగా చూసింది. దీన్ని ఇక్కడి ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని అన్నారు. కేరళపై బీజేపీ ప్రతీకారం తీర్చుకున్నది. ఎందుకంటే కేరళ బీజేపీని రాష్ట్రం నుంచి గెలవడానికి ఎప్పుడూ అనుమతించలేదు" అని ఆయన అన్నారు. "గత ఐదేండ్లలో జాతీయ రహదారి అభివృద్ధికి భూమిని సేకరించినందుకు రాష్ట్రం రూ.5,600 కోట్లు చెల్లించవలసి వచ్చింది. దేశంలో ఇలాంటి ఏ చిన్న రాష్ట్రం ఇంత భారీ మొత్తంలో ఇవ్వలేదు. రాష్ట్రానికి మోడీ హైస్పీడ్ రైలు నెట్‌వర్క్‌ను అందిస్తున్నారు. అయితే, అది కే-రైలు ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి నిరాకరించినదేనని గుర్తుంచుకోవాలి. మన రాష్ట్రాన్ని ప్రపంచ దృష్టికి తీసుకెళ్తామని ప్రధాని హామీ ఇచ్చారు. కేరళ ఇప్పటికే విద్య, ఆరోగ్యం, ఇతర రంగాలలో అభివృద్ధి చెందినందుకు ప్రపంచం గుర్తించింది. ఇవి అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా ఉన్నాయి" అని విజయన్ చెప్పారు. తీరప్రాంత అభివృద్ధికి ప్యాకేజీ ఇవ్వాలని రాష్ట్రం ఎన్నో ఏండ్లుగా డిమాండ్ చేస్తున్నదనీ, మనుషుల కంటే వన్యప్రాణులకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేస్తున్నామని ఆయన తెలిపారు. మన దేశం ప్రమాదంలో ఉన్నదనీ, దేశ రాజ్యాంగంలోని సారాంశమైన ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని మనం రక్షించుకోవాలని విజయన్ పిలుపునిచ్చారు.

సీపీఐ(ఎం)ను గెలిపిస్తే

ప్రాజెక్టుల నిర్మాణానికి కృషి

మత విద్వేషాన్ని రెచ్చగొడుతున్న బీజేపీని ఓడించాలి : సీపీఐ(ఎం) భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్



లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వాలు

నవతెలంగాణ-యాచారం

పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఐ(ఎం)ను గెలిపిస్తే నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణానికి కృషి చేస్తామని ఆ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ తెలిపారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం గున్‌గల్ ఎస్సార్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన పార్టీ ఎన్నికల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో శివన్నగూడ లిఫ్ట్ ఇరిగేషన్ 25 ఏండ్లుగా నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని అన్నారు. నల్లగొండ జిల్లాలోని నార్కట్‌పల్లి, చిట్యాల, కట్టంగూర్, తదితర మండలాలకు సాగు నీరు ఎంత ఇచ్చారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పదవులను పాలకవర్గాలు ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించ కుండా తమ స్వార్థ రాజకీయాల కోసం వాడుతున్నారని ఆరోపిం చారు. గతంలో ఎంపీగా పనిచేసిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ ప్రాంతాన్ని ఎంతవరకు అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టి సంక్షేమాన్ని విస్మరించారని తెలిపారు. అందుకే దేశంలో బీజేపీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలంతా సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగడాల యాదయ్య, డి.జగదీష్, మండల కార్యదర్శి అలంపల్లి నరసింహ, మండల కమిటీ సభ్యులు పి.అంజయ్య, పెండ్యాల బ్రహ్మయ్య, చందు నాయక్, ఏ.జంగయ్య, అమీర్‌పేట మల్లేష్, తావునాయక్, ఎంజే వినోద్ కుమార్, పిరాటి వెంకటయ్య, ఉడుతల జంగయ్య, శాఖా కార్యదర్శులు, పార్టీ సభ్యులు, పాల్గొన్నారు.

మోడీ ఓ 'వసూల్ రాజ్'

- బాండ్ల ద్వారా కోట్లాది రూపాయలు దండుకున్నారు
- దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తున్నారు
- ఆ పార్టీ మ్యానిఫెస్టో పౌరుల పాలిట విలన్
- శానిటరీ నాప్‌కిన్స్‌పై కూడా జీఎస్టీ వేస్తున్నారు: తమిళనాడు సీఎం స్టాలిన్ ఆగ్రహం



చెన్నయ్ : ప్రధాని నరేంద్ర మోడీ ఓ 'వసూల్ రాజ్' అని తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ఆరోపించారు. ఎన్నికల బాండ్ల ద్వారా ఆయన కోట్లాది రూపాయలు దోచుకున్నారని మండిపడ్డారు. బీజేపీ ప్రయోజనాల కోసం కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెన్నయ్‌లో సోమవారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో స్టాలిన్ ప్రసంగిస్తూ దేశం అనేకమంది ప్రధానులను చూసిందని, అయితే రాజకీయ పార్టీలను చీల్చేందుకు, ఎమ్మెల్యేలు, ఎంపీలను కొనుగోలు చేసేందుకు, ముఖ్యమంత్రులను అరెస్ట్ చేసేందుకు నరేంద్ర మోడీ మాత్రమే ఈడీ, సీబీఐ, ఆదాయపన్ను వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

వ్యాపార సంస్థలను బెదిరించడానికి దర్యాప్తు సంస్థలను మోడీ వాడుకుంటున్నారని, ఎన్నికల బాండ్ల ద్వారా డబ్బు దండుకున్నారని, పీఎం కేర్స్ ఫండ్ ద్వారా డబ్బు పొందేందుకు ప్రత్యేకంగా ఓ ట్రస్టును ఏర్పాటు చేశారని స్టాలిన్ దుయ్యబట్టారు. బీజేపీ ఎన్నికల ప్రణాళికపై కూడా ఆయన విమర్శనాస్త్రాలు సంధిస్తూ అది దేశం, పౌరుల పాలిట 'విలన్' అని వ్యాఖ్యానించారు. బీజేపీ మ్యానిఫెస్టోలో వాస్తవికత లేదని ఆయన చెప్పారు. 'అది కేవలం ప్రజలను విభజించేది మాత్రమే కాదు. వారిని వెర్రివాళ్లను చేసేందుకు ప్రయత్నించింది. 2019లో మాదిరిగా ఇప్పుడు కూడా తన హామీలను పునరుద్ఘాటించింది. రూపాయికే శానిటరీ నాప్‌కిన్స్‌ను అందజేస్తానని అప్పుడు చెప్పింది.

అయితే వాస్తవమేమంటే వాటి పైన కూడా జీఎస్టీ విధించింది' అని ఎద్దేవా చేశారు. జీఎస్టీని పేదలను దోచుకునే సాధనంగా అంతకుముందు స్టాలిన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో అభివర్ణించారు. రాబోయే కాలంలో సెల్ఫీ తీసుకున్నా జీఎస్టీ విధిస్తారని వ్యంగ్యంగా అన్నారు. ద్విచక్ర వాహనానికి మరమ్మతు చేసే సమయంలో హోటల్ నుండి తెచ్చుకునే ఆహార పదార్థాలపై సైతం పన్ను వడ్డిస్తారేమోనని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'రెస్టారెంట్లలో ఆహార బిల్లుల్లో జీఎస్టీని చూస్తున్న మధ్యతరగతి కుటుంబాలు

లౌకిక విలువలకు పాతర

- బీజేపీని ఎన్నికల్లో సాగనంపాలి
- ప్రజాస్వామిక హక్కులపై మోడీ ఉక్కుపాదం
- ప్రశ్నించే గొంతుకలను నొక్కుతున్న కాషాయ దళం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్

నవతెలంగాణ -మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

రాజ్యాంగ హక్కులను హరిస్తూ... లౌకిక విలువలకు పాతరేస్తున్న బీజేపీని మళ్లీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్ అన్నారు. బీజేపీని ఓడించాలని కోరుతూ.. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సాయికృష్ణ ఫంక్షన్‌హాల్‌లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పద్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశ్నించే గొంతుకలను నొక్కుతూ.. అప్రజాస్వామికంగా పరిపాలన సాగిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని ఈ ఎన్నికల్లో సాగనంపాలన్నారు. మను ధర్మశాస్త్రాన్ని అమలు చేసేందుకు రాజ్యాంగాన్ని మార్చడానికి కూడా బీజేపీ వెనుకాడబోదని తెలిపారు. ఈ దేశంలో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా.. ప్రజల దృష్టిని రామ మందిరం వైపు మళ్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వామపక్ష ఉద్యమాల వల్ల వచ్చిన ఉపాధి హామీ చట్టానికి నిధుల్లో కోతలు పెట్టి నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు.

సాగు పెట్టుబడికి 50 శాతం అదనంగా ఉండేలా పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్న స్వామినాథన్ కమిషన్ సిఫారసులను తుంగలో తొక్కుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల దేశంలో ప్రతి రోజూ ఎంతో మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ నిత్యం బేటీ పడావో బేటీ బచావో అన్న నినాదం



చేస్తున్నారు కానీ, మహిళలపై లైంగికదాడులు, హత్యలు చేసిన దుండగులను జైలు నుంచి బయటకు ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించారు. ప్రశ్నిస్తున్న ప్రజా మేధావులు వరవరరావు, సాయిబాబు లాంటి వారిని జైలులో పెట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడానికి.. కార్పొరేటు శక్తులకు అప్పగించడానికే యూనివర్సిటీలను ప్రయివేటు పరం చేస్తున్నారని విమర్శించారు. మతతత్వ విధానాలను పాఠ్యాంశాల్లో చేర్చి.. లౌకికవాదానికి చిచ్చు పెడుతున్నారన్నారు.

అదేవిధంగా, రాష్ట్రంలో గడువులోగా కాంగ్రెస్ హామీలను నెరవేర్చకపోతే ఎర్రజెండా ఉద్యమాలకు సిద్ధంగా ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎ.రాములు, కార్యదర్శివర్గ సభ్యులు కిల్లె గోపాల్, చంద్రకాంత్, కురుమయ్య, కడియాల మోహన్, మాణిక్యరాజు, నాయకులు రాజ్‌కుమార్, లక్ష్మయ్య, నర్సింహ, వేణుగోపాల్, ప్రశాంత్, భరత్, జగన్ సత్యం, నర్సింహ పాల్గొన్నారు.

మోడీ వైఫల్యాలను గుర్తించిన ప్రజలు

భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు బీజేపీ యత్నం

- కాషాయపార్టీకి వ్యతిరేకంగా మరింత మెరుగైన ప్రచారం అవసరం : ప్రొఫెసర్ నాగేశ్వర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీవనోపాధి, ధరల పెరుగుదల తదితర ఆర్థిక రంగంలో మోడీ వైఫల్యాలను ప్రజలు గుర్తించారని ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ తెలిపారు. మంగళవారం సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అధ్యక్షతన 'పార్లమెంటు ఎన్నికలు - కార్మికవర్గ కర్తవ్యం' అనే అంశంపై హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో నాగేశ్వర్ ప్రధాన వక్తగా విచ్చేసి ప్రస్తుతం దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, బీజేపీ ఎత్తుగడలు, వాటిని తిప్పికొట్టేందుకు అనుసరించాల్సిన ప్రచార వ్యూహం తదితర విషయాలను వివరించారు. ఈ సందర్భంగా విశ్వసనీయత కలిగిన పలు సంస్థలు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ, అధ్యయన ఫలితాలను విశ్లేషించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అధికారంలోకి రావాలని కోరుకునే వారు ఎందుకు కోరుకుంటున్నారనే విషయంలో అంత స్పష్టతనివ్వలేదని తెలిపారు. అదే పీఎం మోడీ మరోసారి అధికారంలోకి రావద్దనే వారు స్పష్టంగా జీవనోపాధి దెబ్బతింటున్నదనీ, నిరుద్యోగం పెరిగిందనీ, ధరలు పెరిగాయంటూ స్పష్టత నిచ్చారని చెప్పారు. సీఎస్‌డీఎస్ - లోక్ నీతి, ది హిందూ కలిసి చేసిన సర్వే, కన్జంప్షన్ ఎక్స్‌పెండిచర్ సర్వే తదితర సర్వేలను ఆయన వివరించారు. నిరుద్యోగం, నిరక్షరాస్యత, పేదరికం పెరగటం తదితర అంశాల్ని ముందుబెట్టి కార్మికోద్యమం సాగాల్సిన అసరమున్నదని అభిప్రాయపడ్డారు.

పేదరికాన్ని తగ్గించకపోయినా నిటిఅయోగ్ పేదరికం తగ్గిందని చెబుతున్నదని తెలిపారు. పేదరికం నిర్వచనాన్ని మార్చి పేదరికం తగ్గినట్టుగా బీజేపీ ప్రచారం చేసుకుంటున్నదని ఎద్దేవా చేశారు. కొత్త నిర్వచనం ప్రకారం... దేశంలో బిచ్చగాళ్లు కూడా దారిద్ర్య రేఖకు ఎగువన ఉంటారని తెలిపారు. నిజంగా పేదరికాన్నే తగ్గిస్తే 80 కోట్ల మందికి ఉచిత రేషన్ సరకుల అవసరమెందుకు ఏర్పడిందని ఆయన ప్రశ్నించారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గినా ప్రజల నుంచి 2022-23 ఒక్క ఏడాదిలో రూ. ఏడున్నర లక్షల కోట్లను ప్రజల నుంచి వసూలు చేశారని తెలిపారు. అయితే మోడీ ఆర్థిక వైఫల్యాలు ఉన్నప్పటికీ హిందూ మత ఆధిపత్యాన్ని నిలబెట్టే పాలకుడిగా ప్రజలు ఆయన్నే ఒప్పుకునేలా బీజేపీ ప్రచారం పారుతున్నదని తెలిపారు.

ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక వైఫల్యాలే 2019లోనూ ఉన్నాయనీ, అయితే బీజేపీ పుల్వామా, బాలాకోట్ వంటి భావోద్వేగ అంశాలతో గట్టెక్కిందని గుర్తుచేశారు. పుల్వామా ఘటనకు బీజేపీ వైఫల్యమే కారణమైనా, దాన్ని తమకు అనుకూలంగా మార్చుకుందని చెప్పారు. మరోసారి పాకిస్తాన్, చైనా అంటూ రెచ్చగొడుతున్నా తగిన స్పందన ప్రజల నుంచి రాకపోవడంతో కచ్చీతీవుల అంశాన్ని తెరమీదికి తెచ్చిందని తెలిపారు. బీజేపీ తెస్తున్న యునిఫాం సివిల్ కోడ్ తదితర అంశాలపై మాట్లాడేటప్పుడు మరింత స్పష్టంగా ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు.

ఇలాంటి అంశాలను అడ్డుపెట్టుకుని మిగిలిన పార్టీలు మైనార్టీలకు అనుకూలమనీ, మెజార్టీ హిందువులకు వ్యతిరేకమని చిత్రీకరిస్తున్నా యని హెచ్చరించారు. ఇప్పటికీ దేశంలో 11 శాతం మంది మాత్రమే హిందూ రాజ్య భావనకు అనుకూలంగా ఉండగా, మెజారిటీ ప్రజలు బహుళత్వ భారతదేశాన్నే ఇష్టపడు తున్నారని తెలిపారు. ఎస్.వీరయ్య మాట్లా డుతూ తమ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు పోరాడుతుంటే దానికి రామున్ని మొక్కితే చాలన్నట్టు మోడీ సర్కారు చెబు తున్నది. వేతనాలు పెరగాలన్నా, నిరుద్యోగ సమస్య పరిష్కారం కావాలన్నా ఎక్కడికక్కడ పోరాడితే తప్ప మరో మార్గం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య, ఎస్.రమ, పి.జయలక్ష్మి, నవతెలంగాణ సంపాదకులు సుధాభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల విధులకు హాజరుకాకుంటే ఎఫ్ఐఆర్


- జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఎన్నికల విధులకు హాజరుకాని సిబ్బందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని పన్వర్ హాల్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారులతో కలిసి మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 23,500 మంది సిబ్బందిని నియమించామని తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి పీఓ, ఏపీవోలు 1700 మంది, మైక్రో అబ్జర్వర్లు 120 మంది, ఇతర పోలింగ్ సిబ్బంది రెండు వేల మంది శిక్షణకు హాజరు కాలేదన్నారు. వారిలో అనారోగ్యంతో బాధపడేవారు, గర్భిణులను మినహాయించి మిగిలిన వారికి రెండు సార్లు నోటీసులు ఇచ్చామన్నారు. త్వరలో వారిపై ఎఫ్ఐఆర్ బుక్ చేయడంతోపాటు ఇతర చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానాలతోపాటు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి ఎన్నికలు జరుగుతున్నాయని గుర్తుచేశారు.

సంపాదకీయం

సుప్రీం..!



అత్యున్నత న్యాయస్థానాన్ని సైతం లెక్క చేయరాయన! ఎన్నికల బాండ్లు అవినీతికరమైనవని, వెంటనే రద్దు చేయాలని ఐదుగురు సభ్యులతో కూడిన సుప్రీం ధర్మాసనం తీర్పు ఇచ్చింది. అటువంటి తీర్పునే తప్పుపడుతున్నారు మన అధినేత. పైగా ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని పదే పదే సమర్థించుకుంటూనే ఉన్నారు. సుప్రీం ధర్మాసనం ఇచ్చిన ఏకగ్రీవ తీర్పును దేశాధినేతే టిష్యూ పేపర్‌లా వాడటం ఎంత దుర్మార్గం! సుప్రీం కోర్టుపై ఈయన 'సుప్రీం' నేతేమో!

ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నాయని ధర్మాసనం తీర్పు

> 'మోడీనే భారత్, భారత్ అంటే మోడీనే' అంటూ తన కాషాయ దళంతో ఇంటింటి ప్రచారాలు చేయించేందుకు కోట్లు ఖర్చుపెడుతున్నాడు. యువతతో సెల్ఫీలు దిగి ఓట్లకై గాలం వేస్తున్నాడు. తనని తాను భారతమాత ముద్దుబిడ్డగా కితాబిచ్చుకుంటున్నాడు. అవినీతిని అంతం చేయడమే బీజేపీ లక్ష్యమని పదే పదే చెప్పుకుంటున్న మోడీకి మించిన అవినీతిపరుడు లేడని చెప్పడానికి ఎన్నికల బాండ్ల ఉదాహరణ ఒక్కటి చాలు.

ఇచ్చింది. అంతే కాదు రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వడం క్విడ్ ప్రో కో(నీకింత, నాకింత)కు దారితీస్తుందని కూడా పేర్కొంది. నల్లధనాన్ని అరికట్టేందుకు ఎన్నికల బాండ్లొక్కటే మార్గం కాదని, దీనికి ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని కూడా గుర్తు చేసింది. అయినా 'ఎన్నికల బాండ్ల వల్ల రాజకీయ పార్టీలకు విరాళాల్లో పారదర్శక వచ్చింది, వీటి రద్దు వల్ల దేశంలో మళ్లీ నల్లధనం ప్రవహిస్తుంది, దాని వల్ల అందరూ బాధపడతారు' అంటూ పాచి పాటే పాడుతున్నారు. అంటే కార్పొరేట్లకు దోచిపెడుతూ దేశాన్ని దివాళా తీయించాల్సింది ఇంకా ఉందని చెప్పకనే చెబుతున్నారు. 'దేశంలో ప్రజాస్వామ్యం ఉంది, సుప్రీం లీడర్ ఎవరూ ఆవిర్భవించలేరు' అంటూ తన సుపీరియారిటీని సుస్థిరం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పెద్దనోట్ల రద్దుతో నల్లధనాన్ని వెలికి తీయిస్తానని చెప్పి, కార్పొరేట్ల బ్లాక్ మనీని వైట్‌మనీ చేయించిన పెద్ద మనిషి, ఎన్నికల బాండ్లతో నల్లధనాన్ని ఎలా మాయం చేస్తారో మరి!

ఇక అత్యున్నత న్యాయస్థానం తీర్పుతో బీజేపీ విరాళాలు పొందడం కోసం ఎలాంటి వినాశకర పద్ధతులను అనుసరించిందో దేశానికి తెలిసిపోయింది. ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రకృతి సంపదను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతున్నది. రాజ్యాంగబద్ధ సంస్థలైన ఈడీ, సీబీఐ, ఆదాయ పన్ను శాఖలను దుర్వినియోగం చేస్తూ చందా దందాలకు పాల్పడింది. ఈ అక్రమంగా వచ్చిన డబ్బుతో ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టడానికి, ఎన్నికైన ప్రత్యర్థి పార్టీల ప్రభుత్వాలను కూల్చడానికి వినియోగించిందని ఈ పదేండ్ల బీజేపీ చరిత్రను పరిశీలిస్తే ఎవరికైనా అర్థమవుతుంది. మతం, ధర్మం పేరుతో ప్రజల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి రూ.వేల కోట్లను విచ్చలవిడిగా ఖర్చు చేయగలుగుతున్నది. నీతి, జాతి, దేశభక్తి, దైవభక్తి లాంటి మాటల గారడీతో జరిపిన కుతంత్రాలు కోర్టు తీర్పుతో వెలుగులోకి వచ్చాయి.

అయితే అవినీతి అంతానికి తనకు ఈడీ, సీబీఐ ఎంతగానో సహకరించిందని ఇంటర్వ్యూలో పొగడ్తలతో ముంచెత్తారు. కానీ నల్లడబ్బు వెలికితీత, అవినీతి అంతం అనే పదాలకు ఈడీ, ఐటీ దాడులకు, సోదాలకు అర్థాలు వేరులే అని రుజువైంది. దేశ ప్రజలకు వేల ధర్మోపదేశాలు చేసిన స్వయం ప్రకటిత విశ్వగురువు ఏలుబడిలో ప్రజాస్వామ్యానికి ఎంత భయంకరమైన చీడ పట్టిందో తేటతెల్లమైంది. ఎన్నికల బాండ్ల ద్వారా అందిన మొత్తం విరాళాలలో సగానికి పైగా బీజేపీ ఖాతాల్లో చేరిందని అధికారిక లెక్కలు స్పష్టంగా ఉన్నాయి.

పార్లమెంటు ఎన్నికల తర్వాత ఇంకా పెద్ద నిర్ణయాలు తీసుకోబోతున్నట్టు కూడా ప్రకటించాడు. 'ఇదంతా దేశాన్ని అగ్రదేశంగా మార్చేందుకే', ఎవ్వరూ భయపడాల్సింది లేదు' అని కల్లబొల్లి కబుర్లు చెబుతున్నాడు. అదే రోజు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పార్లమెంటు ఎన్నికల తర్వాత దేశాన్ని రామరాజ్యంగా మార్చేస్తామన్నాడు. అంతేనా యూనిఫామ్ సివిల్ కోడ్‌ను తప్పక అమలు చేస్తామని సూటిగానే చెప్పాడు. ఒక పక్క 400 సీట్లొస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని తన కాషాయ ఎంపీల నోటి వెంట చిలకపలుకు పలికిస్తూ మరోపక్క అదంతా దుష్ప్రచారమని కొట్టిపడేస్తున్నాడు. బహుశా ఇవేనేమో మన అధినేత తీసుకోబోయే ఆ పెద్ద పెద్ద నిర్ణయాలు.

'మోడీనే భారత్, భారత్ అంటే మోడీనే' అంటూ తన కాషాయ దళంతో ఇంటింటి ప్రచారాలు చేయించేందుకు కోట్లు ఖర్చుపెడుతున్నాడు. యువతతో సెల్ఫీలు దిగి ఓట్లకై గాలం వేస్తున్నాడు. తనని తాను భారతమాత ముద్దుబిడ్డగా కితాబిచ్చుకుం టున్నాడు. అవినీతిని అంతం చేయడమే బీజేపీ లక్ష్యమని పదే పదే చెప్పుకుంటున్న మోడీకి మించిన అవినీతి పరుడు లేడని చెప్పడానికి ఎన్నికల బాండ్ల ఉదాహరణ ఒక్కటి చాలు. పార్లమెంటు ఎన్నికలు ముగియక ముందే ఐఏఎస్ అధికారులను పిలిచి రాబోయే తన వంద రోజుల పాలన ఎలా ఉండాలో, దానికి సంబంధించిన లెక్కలు అడిగాడంటే ఇంత కంటే నియంతృత్వం ఇంకేముంటుంది!

కనుక 'మోడీ ఎంత శక్తివంతమైతే దేశంలో ప్రజాస్వామ్యానికి అంత ప్రమాదం' అని ఏఎన్ఐ అడిగిన ప్రశ్న వందశాతం సరైనదే. ఇలా తన పాలనలో జరిగిన అంతులేని అవినీతికి ప్రజలకు క్షమాపణ చెప్పాల్సింది పోయి మూడోసారి అధికారం కోసం తహతహలాడుతున్నాడు. పదేండ్ల పాలనలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న బీజేపీని ఓడించి మోడీని గద్దె దింపడమే ఆ పార్టీకి ప్రజలు విధించాల్సిన అసలైన శిక్ష.



కరిగిపోతున్న కాలం వెంట
పరుగులు పెడుతున్నాడు
గిట్టుబాటు లేని గింజల మధ్య
బిక్కుబిక్కుమంటూ కూర్చున్నాడు
చేయూత లేక విధి వెక్కిరిస్తే
సాగిలపడి మొక్కుతున్నాడు
అసలు రైతున్నాడా..!!

రైతున్నాడా?

వెలసిపోయిన ఆకాశం వైపు
మసకబారిన బతుకు వైపు
కండ్లు తేలేస్తూ చూస్తున్నాడు
పుచ్చిపోయిన కంకి మొదళ్ల నుంచి
రాలిపడుతున్న పిందెలా
ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు
చినుకు రాని చింత తలపైనెత్తుకుని
కునుకు లేని రాత్రుల్ని గడుపుతున్నాడు
పచ్చగుండాల్సిన సెలకల్లో
గులక రాళ్ల శబ్దం చేస్తుంటే
చెవులు మూసిపట్టి కూర్చున్నాడు
ఇంతకూ రైతున్నాడా..!!

రెక్కల కష్టం కేవలం
రెక్కలిరుసుకునే వరకే అని తెలిసి
పెదరెక్కలేసిన కోడిలా
చితికిలపడి పడుకుండిపోయాడు
ఏవీ ఆనాటి ఆనవాళ్లు
ఏవీ అలనాటి జ్ఞాపకాలు
రైతు ఊసే లేని ఏలికలో
గాలి వాటానికి తట్టుకుంటూ
జీవచ్ఛవంలా బతికేస్తున్నాడు
అవును ఇంతకూ రైతున్నాడా

విరిగిన నాగళ్ల చెంత కూర్చుని
మొద్దుబారిన కొడవళ్లతో
ఎండమావుల్ని నరుకుతున్నాడు
ఆపన్నహస్తం మడుచుకున్నాక
హస్తవాసి కొండెక్కిన దీపమైనాక
ఏ దారీ లేని ఒంటరి గమ్యంలో
ఒక్కడే తరలిపోతున్నాడు
ఇంతకూ రైతున్నాడా..!!

రైతుంటే ఆచూకీ తెలపండని
నేలకొరిగిన కంకి
పదే పదే అడుగుతోంది
చెదిరిపోయిన ధాన్యరాశి
అన్ని దిక్కులా వెతుకుతోంది
పంట మోహం ఎరుగని భూమి
కన్నీటి పర్యంతమైంది
ఇంతకూ రైతున్నాడా..!!

- నరెద్దుల రాజారెడ్డి
9666016636

మధ్య ప్రాచ్యానికి యుద్ధ ముప్పు!

సామ్రాజ్యవాదుల కుట్రల కారణంగా మధ్యప్రాచ్యంలో ఎప్పుడేం జరుగుతుందో తెలియని స్థితి. గిల్లికజ్జాలు పెట్టుకొని ఇరాన్‌ను రెచ్చగొట్టి యుద్ధంలోకి లాగాలని చూస్తున్నారు. దానిలో భాగమే సిరియా రాజధాని డమాస్కస్‌లో ఉన్న ఇరాన్ రాయబార కార్యాలయంపై ఏప్రిల్ ఒకటిన జరిపిన ఆకస్మికదాడి. ఇజ్రాయిల్ అక్కడ ఉన్న ఏడుగురు ఇరాన్ మిలిటరీ అధికారులను హత్యచేసింది.దానికి ప్రతీకారం తీర్చుకుంటామని ప్రకటించిన ఇరాన్ ఏప్రిల్ 13 శనివారం రాత్రి మూడు వందల క్షిపణులు, డ్రోన్లతో దాడిచేసింది. దీనికి తగు సమయంలో స్పందిస్తామని, తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని సోమవారం నాడు ఇజ్రాయిల్ ప్రకటించింది. అలాంటి దాడులే జరిపితే క్షణాల్లో ప్రతిదాడులకు తెగబడతామని, గతంలో ఎన్నడూ ఉపయోగించని ఆయుధాలను రంగంలోకి తెస్తామని ఇరాన్ హెచ్చరించింది. ఒకవేళ యూదు దురహంకారులకు మద్దతుగా అమెరికా ప్రత్యక్ష పోరులో పాల్గొంటే తాము కూడా దిగుతామని రష్యా హెచ్చరించింది. ఇరాన్ దౌత్య కార్యాలయంపై దాడి గురించి అసలు తమకు తెలియదని, దానితో సంబంధం లేదని ప్రకటించిన అమెరికా ఇజ్రాయిల్ దాడి గురించి భిన్నవైఖరి తీసుకుంది. ఇరాన్ ముందుగా ఎలాంటి హెచ్చరిక చేయలేదని, తాము ఇజ్రాయిల్‌కు మద్దతుగా నిలుస్తామని జో బైడెన్ వెంటనే ప్రకటించాడు. అయితే తాము నేరుగా దాడుల్లో పాల్గొన బోమని చెప్పినట్లు వార్తలు.అవునంటే కాదనిలే కాదంటే అవుననిలే అన్నట్లుగా అమెరికా, ఇతర పశ్చిమదేశాల మాటలను నమ్మలేము. ఇజ్రాయిల్-ఇరాన్ దాడులను చూసినపుడు రాజకీయ కోణంతో పాటు ఆయుధపాటవాన్ని పరీక్షించుకోవటం కూడా కనిపిస్తున్నది.

దాడులు, ప్రతిదాడుల వెనుక ఉన్న కారణాలు తెలిసినప్పటికీ ఇతర అంశాల మీద కూడా విశ్లేషణలు వెలువడుతున్నాయి. రెండు దేశాలు ఆత్మరక్షణ, ఎదురుదాడుల బలాబలాలను సరిచూసుకుం టున్నట్లు చెప్పటం వాటిలో ఒకటి. ఇటు ఇరాన్ అటు అమెరికా కూడా పూర్తిస్థాయి పోరుకు సిద్ధంగా లేవని, అయితే అమెరికా, ఇతర పశ్చిమ దేశాల నుంచి మరింత సాయం పొందేందుకు ఇజ్రాయిల్ వివాదాన్ని రెచ్చగొడుతున్నదని, నివారించలేని స్థితిలో అమెరికా ఉందని చెబుతున్నారు. తన సత్తాను చూపేందుకు ఇరాన్ గరిష్టంగా ఆయుధ ప్రయోగం చేయగా, వాటిని తట్టుకొనేందుకు పశ్చిమదేశాలు తనకు కల్పించిన రక్షణ వ్యవస్థ ఎలా ఉందో ఇజ్రాయిల్ పరీక్షించుకుంది. రెండు దేశాలకూ ఉన్న పరిమితులను వెల్లడించాయి. మా దెబ్బేమిటో చూడండని కేవలం రుచిచూపేందుకు మాత్రమే ఇరాన్ దాడి పరిమితం కాలేదు.

> ఉక్రెయిన్ సంక్షోభం నుంచి గౌరవప్రదంగా ఎలా బయటపడాలో తెలియని పశ్చిమ దేశాలు 193 రోజుల గాజా మారణకాండ తరువాత తదుపరి ఏమిటన్నదానిపై మల్లగుల్లాలుపడుతున్నాయి.ఇరాన్ దాడులు జరిపిన వెంటనే ఇజ్రాయిల్ వైమానిక దళం దక్షిణ లెబనాన్‌లోని హిజబుల్లా స్థావరాలపై ప్రతిదాడులు జరిపింది. ఇజ్రాయిల్‌కు మద్దతు ఇస్తున్న జోర్డాన్ పాలకులకు వ్యతిరేకంగా అక్కడ ప్రదర్శనలు జరుగుతున్నట్లు వార్తలు. మొత్తంగా చూసినపుడు రెండు దేశాలూ ఎలా ప్రతీకారం తీర్చుకుంటాయి, వాటికి మద్దతుగా ఉన్న దేశాల పాత్ర ఎలా ఉంటుంది అనే అంశాలు ప్రపంచాన్ని భయపెడుతున్నాయి. ఐరోపా దేశాలు కూడా ప్రతిదాడులు వద్దని ఇజ్రాయిల్‌ను కోరాయి. ఈ వారంలో ఢిల్లీ పర్యటనకు రావాల్సిన అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులివాన్ వాయిదా వేసుకున్నారు.



ఎం కోటేశ్వరరావు
8331013288

పశ్చిమ దేశాలు తమను కాపాడతాయని భావించినప్పటికీ కొన్ని క్షిపణులు ఇజ్రాయిల్ ప్రాంతాలను తాకాయి. కనీసం తొమ్మిది క్షిపణులు రక్షణ వలయం నుంచి తప్పించుకున్నాయని, ఐదు నెవాటిమ్ అనే వైమానిక స్థావరం మీద పడి సి-130 రకం రవాణా విమానాన్ని, రన్‌వేను, ఖాళీగా ఉన్న గోదామును ధ్వంసం చేసినట్లు, మరో నాలుగు వేరే వైమానిక స్థావరం మీద పడినట్లు వార్తలు వచ్చాయి. సహజంగానే నష్టాన్ని తక్కువగా చూపేందుకు, అసలేమీ జరగలేదని చెప్పేందుకూ చూస్తారన్నది తెలిసిందే. క్షిపణులను మధ్యలోనే కూల్చివేసే ఏరో-3 అనే ఆధునిక వ్యవస్థను తొలిసారిగా ఏర్పాటు చేశారని, దాన్ని తప్పించుకొని తొమ్మిది క్షిపణులు రావటం ఇజ్రాయిలీలను ఆందోళనకు గురిచేస్తున్నట్లు చెబుతున్నారు. దాడి గురించి తాము నాలుగు రోజుల ముందే అమెరికాతో సహా ఇరుగు పొరుగుదేశాలన్నింటినీ హెచ్చరించామని ఇరాన్ ప్రకటించింది.

ఇజ్రాయిల్‌కు తాము కల్పించిన రక్షణ కవచం పనితీరును పశ్చిమదేశాలు సమీక్షిస్తున్నట్లు కనిపిస్తోంది. నెపం ఎవరి మీద, ఎలా నెట్టాలన్నది కూడా ఆలోచించటం సహజమే.

ప్రధాని నెతన్యాహు ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నామని ఇజ్రాయిల్ మిలిటరీ అధిపతి హెర్జీ హల్‌వెల్ చెప్పగా, ఏవైనా ప్రతిదాడులు జరిగితే క్షణాల్లో స్పందిస్తామని ఇరాన్ ఉపవిదేశాంగ మంత్రి అలీ బగేరీకాన్ చెప్పాడు. తన సార్వభౌమత్వాన్ని రక్షించుకుంటూ పరిస్థితి చేయిదాటకుండా ఇరాన్ వ్యవహరించగలదని చైనా ఆశాభావం వ్యక్తం చేసింది.పరిస్థితి మరింతగా దిగజారటం ఎవరికీ మంచిది కాదని రష్యా పేర్కొన్నది. ఇరాన్‌తో యుద్ధాన్ని తాము కోరుకోవటం లేదని, ఎప్పుడు, ఎలా స్పందించాలన్నది నిర్ణయించుకోవాల్సింది ఇజ్రాయిలేనని అమెరికా చెప్పింది. సిరియాలోని ఇరాన్ రాయబార కార్యాలయంపై చేసిన దాడిని తాము సమర్థిస్తున్నట్లు బ్రిటన్ పేర్కొన్నది. ఇజ్రాయిల్‌పై దాడి తరువాత మరిన్ని ఆంక్షల గురించి ఆలోచిస్తున్నట్లు బ్రిటన్ విదేశాంగ మంత్రి చెప్పాడు. గత రెండు రోజులుగా ఇజ్రాయిల్



బహుశా ఈ కారణంగా విమానాలు, ఇతర ఆయుధాలను వైమానిక స్థావరాల నుంచి వేరే చోటికి ఇజ్రాయెల్ తరలించి ఉండవచ్చు.

ఇజ్రాయిల్ రక్షణ దళాల ప్రతినిధి వెల్లడించిన సమాచారం ప్రకారం.. ఇరాన్ ప్రయోగించిన వాటిలో 170డ్రోన్లు,120 క్షిపణులు ఉన్నాయి, ఇరాన్, ఇరాక్, ఎమెన్,లెబనాన్ల నుంచి 350 రాకెట్లను వదిలారు. నాలుగు గంటల పాటు దాడి జరిగింది. రెండు దేశాల మధ్య 1,600 కిలోమీటర్ల దూరం ఉంది. తూర్పు మధ్యధరా సముద్రంలోని తమ యుద్ధ నౌకలు నాలుగు నుంచి ఆరు క్షిపణులు, 70డ్రోన్లను కూల్చివేసినట్లు అమెరికా అధికారులు చెప్పారు.దాడి జరిగిన తరువాత జో బైడెన్ ఇజ్రాయిల్ నేత నెతన్యాహుతో మాట్లాడుతూ మద్దతుగా ఉంటాం తప్ప ఇరాన్ మీద జరిపే ఏ దాడిలోనూ తాము ప్రత్యక్షంగా పాల్గొనేది లేదని చెప్పినట్లు వార్తలు వెలువడ్డాయి.ఆదివారం నాడు జి7 దేశాల ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్సులో సమావేశమై ఇరాన్ దాడిని ఖండించారు. ఈ చర్య అదుపు చేయలేని పరిస్థితికి దారితీస్తుం దని హెచ్చరించారు. ఆదివారం నాడు సమావేశమైన ఇజ్రాయిల్ యుద్ధ మంత్రివర్గం ఎలా స్పందించాలనే దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే వాయిదా పడింది.సోమవారం నాడు కూడా తీవ్ర తర్జనభర్జనలు జరిపింది.పరిస్థితి మరింత విషమించ కుండా చూడాలని బైడెన్ ప్రకటించటం, ప్రతి దాడికి అవసరమైన ఎత్తుగడలను రచించేందుకు సమయం తీసుకొనేందుకు, అమెరికా మీద మరింత ఒత్తిడి పెంచేందుకు వ్యవధి తీసుకుంటున్నట్లు,

మీదుగా ప్రయాణించే విమానాలను అనేక సంస్థలు వేరే మార్గంలో నడుపుతున్నాయి.భద్రతా కారణాల రీత్యా ఇరాన్ తన అణుకేంద్రాలను ఆదివారం నాడు మూసివేసింది. వాటిపై ఇజ్రాయిల్ దాడి జరపవచ్చని అంతర్జాతీయ అణుఇంధన సంస్థ డైరెక్టర్ జనరల్ రాఫెస్ గ్రోసీ ఆందోళన వ్యక్తం చేశారు. చైనా మధ్యవర్తిత్వంలో ఇరాన్-సౌదీ అరేబియా సాధారణ సంబంధాలను నెలకొల్పుంటున్న సంగతి తెలిసిందే. దాని చెడగొట్టేందుకు తప్పుడు సమాచారాన్ని వ్యాపింపచేస్తున్నారు.ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లను మధ్యలో కొన్నింటిని సౌదీ అరేబియా అడ్డుకున్నదంటూ ఇజ్రాయిల్ మీడియా సంస్థలు కొన్ని వార్తలను అల్లాయి.ఈ వార్తలను సౌదీ వర్గాలు ఖండించాయి.

మధ్యప్రాచ్యంలో జరుగుతున్న పరిణామాలను వ్లదిమిర్ పుతిన్ తనకు అనుకూలంగా మార్చుకోవచ్చని కొందరు విశ్లేషకులు పశ్చిమదేశాలకు హితవు చెప్పారు.బహుశా ఈ అంశం అమెరికా దృష్టిలో ఉన్న కారణంగానే తొందరపడవద్దని ఇజ్రాయిల్‌కు సలహా ఇచ్చి ఉండవచ్చని భావిస్తున్నారు. పశ్చిమ దేశాల దృష్టి మధ్య ప్రాచ్యంవైపు మళ్లితే ఇప్పటికే తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ఉక్రెయిన్‌ను చావు దెబ్బతీయటం మరింత సులభం అవుతుంది.ఇప్పటికే ఉక్రెయిన్ విద్యుత్ వ్యవస్థ నాశనానికి రష్యా దాడులు జరుపుతున్నది. అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు తమ వనరులన్నింటినీ ఇరాన్ మీద కేంద్రీకరిస్తే అమెరికా నాటోలోని తన అనుయాయి దేశాలకు భద్రత కల్పించలేదన్న భావన మరింతగా పెరుగుతుంది. ఇప్పటికే ఉక్రెయిన్‌కు అందించాల్సిన

> ప్రధాని నెతన్యాహు ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నామని ఇజ్రాయిల్ మిలిటరీ అధిపతి హెర్జీ హల్‌వెల్ చెప్పగా, ఏవైనా ప్రతిదాడులు జరిగితే క్షణాల్లో స్పందిస్తామని ఇరాన్ ఉపవిదేశాంగ మంత్రి అలీ బగేరీకాన్ చెప్పాడు. తన సార్వభౌమత్వాన్ని రక్షించుకుంటూ పరిస్థితి చేయిదాటకుండా ఇరాన్ వ్యవహరించగలదని చైనా ఆశాభావం వ్యక్తం చేసింది.పరిస్థితి మరింతగా దిగజారటం ఎవరికీ మంచిది కాదని రష్యా పేర్కొన్నది. ఇరాన్‌తో యుద్ధాన్ని తాము కోరుకోవటం లేదని, ఎప్పుడు, ఎలా స్పందించాలన్నది నిర్ణయించు కోవాల్సింది ఇజ్రాయిలేనని అమెరికా చెప్పింది.సిరియాలోని ఇరాన్ రాయబార కార్యాలయంపై చేసిన దాడిని తాము సమర్థిస్తున్నట్లు బ్రిటన్ పేర్కొన్నది.ఇజ్రాయిల్‌పై దాడి తరువాత మరిన్ని ఆంక్షల గురించి ఆలోచిస్తున్నట్లు బ్రిటన్ విదేశాంగ మంత్రి చెప్పాడు.

అమెరికా సాయం ఆలస్యం అయిందన్న అభిప్రాయం ఉంది.దాదాపు ఆరునెలల క్రితం ప్రకటించిన 60బిలియన్ డాలర్ల సహాయం గురించి ఇంతవరకు పార్లమెంటు ఖరారు చేయలేదు. మరోవైపు రష్యా, ఉత్తర కొరియా, ఇరాన్ బంధం మరింత పటిష్టం అవుతుంది. మధ్య ప్రాచ్యం, పశ్చిమాసియాలో రష్యా ప్రభావం మరింతగా పెరుగుతుంది. ఇప్పటికే రష్యా అందించిన సాంకేతిక పరిజ్ఞానంతో ఇరాన్ తయారు చేసిన డ్రోన్లను ఉక్రెయిన్‌పై ప్రయోగిస్తున్న సంగతి తెలిసిందే. ఎత్తుగడలు, లక్ష్యాలు ఎలా ఉన్నప్పటికీ సమస్యలు కూడా ఉన్నాయి.బింకంగా మాటలు చెప్పవచ్చు, ప్రకటనలు ఎలా ఉన్నప్పటికీ ఇజ్రాయిల్ వెంటనే స్పందించకపోవటానికి దాని మీద ఉన్న ఒత్తిడి ఒక కారణం. ఎన్నికల్లో ఉన్న బైడెన్‌కు ఇప్పుడు పూర్తిస్థాయి పోరు నష్టం కలిగించే అవకాశం ఉంది. ఆరునెలలు దాటినా సాధారణ పౌరులపై మారణకాండ, గాజాలో విధ్వంసకాండ సాగించటం తప్ప బందీలుగా ఉన్న తమవారిని విడిపించుకోలేకపోయింది. రోజురోజుకూ ఈ అంశం ఒత్తిడి పెంచుతున్నది. హమాస్ సాయుధులను అణచివేస్తామన్న మాటలు ప్రగల్భాలుగానే ఉన్నాయి. యుద్ధమంటూ మొదలైతే ఇజ్రాయిల్ మీద రెండు మూడు వైపుల నుంచి దాడులు జరుగుతాయి. ఇరాన్‌పై ప్రతిదాడుల అంశంలో ఇజ్రాయిలీ యుద్ధ మంత్రివర్గంలో భిన్నాభిప్రాయాలు వెలువడ్డాయి.

ఉక్రెయిన్ సంక్షోభం నుంచి గౌరవప్రదంగా ఎలా బయట పడాలో తెలియని పశ్చిమ దేశాలు 193 రోజుల గాజా మారణకాండ తరువాత తదుపరి ఏమిటన్నదానిపై మల్లగుల్లాలు పడుతున్నాయి. ఇరాన్ దాడులు జరిపిన వెంటనే ఇజ్రాయిల్ వైమానిక దళం దక్షిణ లెబనాన్‌లోని హిజబుల్లా స్థావరాలపై ప్రతిదాడులు జరిపింది. ఇజ్రాయిల్‌కు మద్దతు ఇస్తున్న జోర్డాన్ పాలకులకు వ్యతిరేకంగా అక్కడ ప్రదర్శనలు జరుగుతున్నట్లు వార్తలు. మొత్తంగా చూసినపుడు రెండు దేశాలూ ఎలా ప్రతీకారం తీర్చుకుంటాయి, వాటికి మద్దతుగా ఉన్న దేశాల పాత్ర ఎలా ఉంటుంది అనే అంశాలు ప్రపంచాన్ని భయపెడుతున్నాయి. ఐరోపా దేశాలు కూడా ప్రతిదాడులు వద్దని ఇజ్రాయిల్‌ను కోరాయి. ఈ వారంలో ఢిల్లీ పర్యటనకు రావాల్సిన అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులివాన్ వాయిదా వేసుకున్నారు. తమ రాయబార కార్యాలయం మీద జరిగిన దాడికి ప్రతిగా ఇరాన్ స్పందించి ఒక దాడితో ముగించింది. దీనికి ప్రతిగా ఇజ్రాయిల్ తెగబడితే అది అంతటితో ఆగదు అని వేరే చెప్పనవసరం లేదు. ■

బీజేపీ మేనిఫెస్టోనా? మోడీ ఫెస్టోనా?

బీజేపీ ఇటీవల విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో ఒక అసంకల్పిత హామీపత్రంగా కనిపిస్తున్నది. దేశంలోని యువత, మహిళలు, పేదలు, రైతుల అభివృద్ధే వికసిత భారత్ (2047) లక్ష్యంగా ప్రధాని మోడీ పేర్కొన్నాడు. కానీ 2014 నుంచి ఇలాంటి అకర్షణీయమైన హామీలిచ్చే రెండుసార్లు అధికారంలోకి వచ్చాడు. కొత్త నినాదాలతో మరోసారి అధికారంలోకి రావాలని ఎత్తుగడలు వేస్తున్నాడు. కానీ ఇప్పటివరకు ప్రకటించిన మేనిఫెస్టోలో ఎన్ని హామీలు నెరవేర్చా రన్నది నూతన మేనిఫెస్టోలో ఎక్కడా పస్తావించ లేదు. పైగా గతంలో ఇచ్చిన హామీలు తొంభై శాతం పూర్తిచేశామని నమ్మ బలికాడు. ఇప్పుడు ప్రకటించే 'మోడీ గ్యారంటీ' పేరుతో వెయ్యేండ్ల అభివృద్ధి అజెండాకు శ్రీకారం చుట్టినట్టు చెప్పాడు. అసలు మోడీ తన పదేండ్ల పాలనలో దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపాడా? తిరోగమనం వైపు నడిపాడా అన్నది చర్చించుకోవాల్సిన సమయమిది.

మోడీ గడిచిన పదేండ్ల పాలనలో సాధించిన ప్రగతి ఎంత అనేది గణాంకాలతో సహా గమనిస్తే 'మోడీ గ్యారంటీ-వికసిత భారత్ విజన్-2047' అర్థమవుతుంది. 2014 ఎన్నికల సమయంలో దేశంలో నిరుద్యోగం బాగా పెరిగిపోయిందని, దేశయువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో గత ప్రభుత్వ పాలకులు ఘోరంగా విఫలమ య్యారని, తాము అధికారంలోకి వస్తే ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని పెద్దఎత్తున ప్రచారం చేసి యువతను నమ్మించాడు. గడిచిన పదేండ్లలో ఏడాదికి రెండుకోట్ల చొప్పున అంటే ఈ పదేండ్లలో 20 కోట్ల ఉద్యోగాలివ్వాలి. మరి ఇచ్చాడా? కనీసం రెండు కోట్ల ఉద్యోగాలు కూడా కల్పించలేదు. పైగా పకోడీలు అమ్ముకోవడం కూడా ఉద్యోగమేనని కితాబిచ్చిన 'దేశ్‌కి నేత' ఆయనే కదా? గడిచిన నలభై ఏండ్లలో ఎన్నడూలేని విధంగా రికార్డు స్థాయిలో నిరుద్యోగం పెరిగిపోయింది. ఈ పదేండ్లకాలంలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నవారు 45శాతం ఉన్నారంటే అతిశయోక్తి కాదు. వీరికి ఉద్యోగాలు కల్పించకపో వడమేనా మోడీ చేసిన అభివృద్ధి?

దేశం నిజంగా అభివృద్ధిలో పయనించాలంటే ప్రజలు సంతోషంగా ఉండాలి. వారికి ఉపాధితో పాటు కూడు, గూడు, బట్ట సమకూర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. కానీ దాన్ని మోడీ పూర్తిగా విస్మరించారని చెప్పొచ్చు. ఎందుకంటే ఈ పదేండ్ల కాలంలో నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయి. ఉప్పు, పప్పు, నూనె ఇలా ప్రతి ఒక్కటీ సామాన్యుడికి అందనంత దూరంలో ఎగిరిపోయాయి. తాను అధికారంలోకి రాగానే ప్రతి పేదవాడికి చేరువయ్యే విధంగా నిత్యావసర ధరలు తగ్గిస్తానని వాగ్దానం చేశాడు. కానీ ఎంత మేరకు ధరలు తగ్గించి పేదప్రజలకు అందుబాటులో ఉంచాడో తన మేనిఫెస్టో సంకల్ప్ పత్రంలో చెప్పలేదు. కానీ 2014 నుంచి2024 కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ గణాంకాలు పరిశీలించినట్లయితే ఈ పదేండ్లలో మొత్తం ధరల్లో 70శాతం అధికంగా పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచంలోని నిత్యావసర వస్తువుల అధిక ధరలు అమలు చేస్తున్న దేశాల్లో టర్కీ తర్వాత భారతదేశం రెండో స్థానంలో ఉందని గ్లోబల్ ఇండెక్స్ రిపోర్ట్ ద్వారా తెలిసింది. మోడీ అధికారంలోకి రాకముందు ఐదు వందల రూపాయలున్న సిలిండర్ రెండింతలు దాటింది. అందులో రూ.200 తగ్గించి మహిళలకు నేనిచ్చే గిఫ్ట్ అన్నాడు మోడీ. వాస్తవానికి పెంచిందెంత? తగ్గించింది ఎంత?. ఇది ఎన్నికల జిమ్మిక్కని అర్థం చేసుకోలేని అమాయకులు కాదు ప్రజలు. ఇక పెట్రోల్, డీజిల్ ధరల గురించి వేరే చెప్పనక్కర్లేదు. పెరిగిన ధరలు వాహన దారులకు రోజురోజుకూ చుక్కలు చూపెడుతున్నాయి. ఇప్పటికే సెంచరీ మార్క్‌ను దాటాయి. మరోసారి మోడీ అధికారం లోకి వస్తే మరింత రేట్లు పెంచి ఇదే దేశ అభివృద్ధి అన్న ఆశ్చర్యపో నవసరంలేదు.



భరత్ చౌహాన్
9030666999

రైతుల గురించి చెప్పాల్సి వస్తే 'భారతదేశంలో రైతులు తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్నారని, మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారి ఆదాయం రెండింతలు చేస్తాను' అన్నాడు మోడీ. ఈ పదేండ్ల కాలంలో ఆదాయాన్ని ఎంతమేరకు రెట్టింపు చేశాడో కూడా తన నూతన సంకల్ప పత్రంలో ప్రస్తావించ లేదు. కానీ వాస్తవాల్ని పరిశీలిస్తే దేశంలో ఎన్నడూ లేనంతగా ఈ పదేండ్లకాలంలో 1,00,474 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఎన్సీఆర్‌బీ రిపోర్ట్ అధికారికంగా లెక్కలు విడుదల చేసింది. అంటే సగటున రోజుకి 30 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. రైతుల ఆర్థిక పరిస్థితులను రెండింతలు చేయడమంటే ఆత్మహత్యలు చేసుకునేలా పాలించడమా మోడీ చెబుతున్న అభివృద్ధి? అంతేకాదు మూడు రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకొచ్చి దాదాపు 750 మందికి పైగా రైతుల చావులకు కారణమయ్యాడు. బలవంతంగా నల్ల చట్టాలను వెనక్కి తీసుకుంటున్న సమయంలో పంటకు కనీస మద్దతు ధర ప్రకటించే విధంగా చట్టాలను తయారు చేస్తానని చెప్పాడు. కానీ ఇప్పటివరకు కనీస మద్దతు ధరనిచ్చే విషయంలో స్పష్టమైన వైఖరి ఏది వెల్లడించ లేదు! దానికి నిరసనగా దేశ రాజదాని ఢిల్లీలో మరోసారి రైతుల ఆందోళనలు ప్రారంభమ య్యాయి. ఇప్పటి వరకు రైతులడుగుతున్న కనీస మద్దతు ధరకు సంబంధించి ఎలాంటి గ్యారంటీ ఇవ్వని మోడీ దేశ ప్రజలకు వెయ్యేండ్ల గ్యారంటీ ఎలా ఇస్తాడు? ఇది ఆలోచించాల్సిన అంశం కాదా! రైతుల ఆర్థికస్థితిని మెరుగుపరుస్తానని, మరోసారి నూతన మేనిఫెస్టోలో అబద్ధపు ప్రచారాలు చేయడం మోసపూరిత చర్యనే.

> ఆయుష్మాన్ భారత్ గురించి గొప్పగా రంగురంగుల అక్షరాలతో అచ్చులు వేసి మసిపూసి మారేడు కాయచేసే ప్రయత్నం చేశాడు మోడీ. గడిచిన కాలంలో దేశవ్యాప్తంగా కేవలం ఎనిమిది వేల కోట్ల రూపాయలు మాత్రమే ఆయుష్మాన్ భారత్ కోసం ఖర్చు చేశాడు. ఢిల్లీ లాంటి చిన్న రాష్ట్రంలో వార్షిక ఆరోగ్య బడ్జెట్ 9.5 వేల కోట్ల రూపాయలు. అలాంటిది దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ భారత్ కోసం మోడీ ఖర్చు చేసినది కేవలం 8 వేల కోట్లు మాత్రమే అన్న నిజాన్ని ఎవరైనా దాచగలరా? దీని గురించి గొప్పగా చెప్పుకునే మోడీ ముందు మారుమూల గిరిజన ప్రాంతాల్లో కనీస వైద్యమందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కూడా లేవన్న సంగతి మరిచిపోరాదు.



ఇకపోతే విద్యా ద్వారా వికాసం, ఆర్థిక అభివృద్ధి సాధ్యమని, విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకొస్తానని, ఉపాధి కల్పించే విద్యా విధానాన్ని అందరికీ అందుబాటులో తెచ్చే విధంగా కృషి చేస్తానని చెప్పాడు మోడీ. వాస్తవానికి సమూల మార్పులు తెచ్చాడు కూడా. కానీ శాస్త్రీయ భావజాలాన్ని తొక్కేస్తూ అశాస్త్రీయాన్ని విద్యార్థుల మీద రుద్దే నూతన విద్యా విధానాల్ని తీసుకొచ్చాడు. 2014కు ముందు మోడీ అధికారంలోకి రాక ముందు దేశంలో మొత్తం 11లక్షల ప్రభుత్వ పాఠశాలలుండేవి. కానీ ప్రస్తుతం లక్ష ప్రభు త్వ పాఠశాలలు మూతపడ్డాయి. మాట మాట్లాడితే గుజరాత్ మోడల్ అంటూ నయవంచన చేసే మోడీ అదే గుజరాత్‌లో గతేడాది పదో తరగతి పరీక్షల్లో 150 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా ఉత్తీర్ణత సాధించలేకపోయారు. ఇదేనా విద్య గురించి మోడీ చేసిన ప్రక్షాళన?

ఆయుష్మాన్ భారత్ గురించి గొప్పగా రంగురంగుల అక్షరాలతో అచ్చులు వేసి మసిపూసి మారేడు కాయచేసే ప్రయత్నం చేశాడు మోడీ. గడిచిన కాలంలో దేశవ్యాప్తంగా కేవలం ఎనిమిది వేల కోట్ల రూపాయలు మాత్రమే ఆయుష్మాన్ భారత్ కోసం ఖర్చు చేశాడు. ఢిల్లీ లాంటి చిన్న రాష్ట్రంలో వార్షిక ఆరోగ్య బడ్జెట్ 9.5 వేల కోట్ల రూపాయలు. అలాంటిది దేశ వ్యాప్తంగా ఆయుష్మాన్ భారత్ కోసం మోడీ ఖర్చు చేసినది కేవలం 8 వేల కోట్లు మాత్రమే అన్న నిజాన్ని ఎవరైనా దాచగలరా? దీని గురించి గొప్పగా చెప్పుకునే మోడీ ముందు మారుమూల గిరిజన ప్రాంతాల్లో కనీస వైద్యమందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కూడా లేవన్న సంగతి మరిచిపోరాదు. ప్రసవం కోసం తీసుకెళ్లడానికి కనీసం అంబులెన్స్ సౌకర్యాలు లేక పురిటినొప్పులతో కొన్ని కిలోమీటర్ల దూరం కట్టెలమీద భుజాలపై మోసుకెళ్లి ఆరోగ్యం వికటించి మరణించిన ఘటనలు మన తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలో అనేకం చూశాం. ఇంకా చూస్తూనే ఉన్నాం. ఇలాంటి పరిస్థితులున్న దేశంలో మోడీ ఆరోగ్యం గురించి మాట్లాడుతున్న తీరును చూస్తే చాలా సిగ్గుగా ఉంది.

ఓసారి భారత ఆర్థిక వ్యవస్థను పరిశీలిస్తే మోడీ అసలు స్వరూపం బయటపడుతుంది. ఆయన అధికారంలోకి రాకముందు 'రూపాయి విలువ రోజురోజుకీ దిగజారిపోతున్నదని,అధికారంలోకి రాగానే దిగజారిపోతున్న రూపాయి విలువ ఆకాశానికి తీసుకొస్తానని, రూపాయిని డాలర్‌తో పోటీ పడేలా చేస్తానని' అన్నాడు. తీరా చూస్తే రికార్డు స్థాయిలో పాతాళంలోకి 82 రూపాయల స్థాయికి దిగజార్చాడు. మోడీ అధికారంలోకి రాక ముందు భారత దేశం అప్పు రూ.55.87 లక్షల కోట్లు ఉంటే ఈపదేండ్ల పాలనలో ప్రస్తుతం దేశం అప్పు రూ.155.31 లక్షల కోట్లుగా చేశాడు. ఇదేనా మోడీ చేసిన అభివృద్ధి? ఇకచాలు ఈ మోసపూరిత వాగ్దానాలను, నయవంచక నాటకాలను నమ్మే స్థితిలో ప్రజలు లేరు. బీజేపీకి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధమవుతున్నారు ప్రజలు. ■

సివిల్స్‌లో సత్తా చాటిన.. ఉమ్మడి వరంగల్ యువత

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి


జయసింహారెడ్డి


కొయ్యాడ ప్రణయ్


సయింపు కిరణ్

యూపీఎస్సీ ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నలుగురు యువకులు విజేతలుగా నిలిచారు. గతేడాది ఐపీఎస్ సాధించిన జయసింహారెడ్డి ఈసారి 103వ ర్యాంకు సాధించడంతో ఈసారి ఐఏఎస్ సాధించే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఎట్టకేలకు తన లక్ష్యాన్ని సాధించడంతో ఆ కుటుంబంలో హర్షం వ్యక్తం చేసింది. వరంగల్ పరిశోధనా స్థానంలో ప్రముఖ శాస్త్రవేత్త ఉమారెడ్డి కుమారుడే జయసింహారెడ్డి. రఘునాధపల్లి మండలకేంద్రానికి చెందిన కొయ్యాడ ప్రణయ్ 554వ ర్యాంకు సాధించారు. ప్రణయ్ ఎలాంటి కోచింగ్ లేకుండానే ఈ ర్యాంకు సాధించడం గమనార్హం. గతేడాది 885వ ర్యాంకు సాధించిన ప్రణయ్ ఐఆర్ఎంఎస్ రావడంతో ప్రస్తుతం శిక్షణలో ఉన్నారు. గీసుకొండ మండలం అనంతారం గ్రామానికి చెందిన సయింపు కిరణ్ 568వ ర్యాంకు సాధించారు. వరంగల్ శివనగర్‌కు చెందిన కోట అనిల్‌కుమార్‌కు 764 ర్యాంకు సాధించారు. కిరణ్‌కు ఐపీఎస్ వచ్చే అవకాశముండగా, కోట అనిల్‌కుమార్‌కు ఐఆర్ఎస్ వచ్చే అవకాశమున్నట్లు అంచనా వేస్తున్నారు.

నిరాశపడని సయింపు కిరణ్

568వ ర్యాంకు సాధించిన సయింపు కిరణ్.. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కిరణ్ వరంగల్ మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో పాఠశాల విద్యనభ్యసించారు. ఇంటర్ ప్రయివేటు కాలేజీలో చదివారు. జేఈఈ అడ్వాన్స్‌లో 1598వ ర్యాంకు సాధించి ఐఐటీ ఢిల్లీలో బీటెక్ పూర్తి చేశారు. 2018లో మొదటిసారి సివిల్స్ రాశారు. ప్రిలిమ్స్‌లో క్వాలిఫై కాలేదు. జీవితంలో మొదటిసారి ఫెయిల్యూర్ వచ్చినా కుంగిపోకుండా తప్పులను సరిదిద్దుకొని 2019, 2020లో ప్రిలిమ్స్ పూర్తి చేసి మెయిన్స్ రాశారు. రెండు మార్కులతో సెకండ్ అటెంప్ట్‌లో ఇంటర్వ్యూ పోయింది. 2021లో ఇంటర్వ్యూకు అవకాశం వచ్చింది. జాతీయస్థాయిలో నిర్వహించే సీఏపీఎఫ్‌లో ఆలిండియాలో 15వ ర్యాంకు సాధించిన సయింపు కిరణ్ ప్రస్తుతం శిక్షణలో ఉన్నారు.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థి ఆత్మహత్య

నవతెలంగాణ -ముథోల్


(ఫైల్)

నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీ యూనివర్సిటీలో ఓ విద్యా కుసుమం నేలరాలింది. హాస్టల్ గదిలో విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. వారి వివరాల ప్రకారం..

సిద్దిపేట జిల్లా తొగుట మండలం బండారుపల్లికి చెందిన బుచ్చుక అరవింద్ ట్రిపుల్ ఐటీలో పీయూసీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో హాస్టల్ గదిలో ఉరేసుకున్నాడు. మంగళవారం ఉదయం గమనించిన తోటి విద్యార్థులు యూనివర్సిటీ అధికారులకు సమాచారం అందించడంతో సెక్యూరిటీ సిబ్బంది స్థానిక ఆస్పత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థి మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విద్యార్థి తల్లిదండ్రులకు యూనివర్సిటీ అధికారులు సమాచారం అందించారు. ఈ నెల 18 నుంచి పీయూసీ రెండో సంవత్సరం విద్యార్థులకు ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థి హాజరు 50 శాతం కన్నా తక్కువగా ఉందని అధికారులు తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో ఒత్తిడికి గురై విద్యార్థి ఆత్మహత్య చేసుకొని ఉంటాడని అనుమానిస్తున్నారు. విద్యార్థి మృతిపై యూనివర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ వెంకటరమణ సంతాపం వ్యక్తం చేశారు.

లిల్లీపుట్‌గాళ్ల సర్కార్

(మొదటిపేజీ తరువాయి)

గుడి కట్టినం అక్కడెందుకు పూజలు చేస్తున్నరు. ఇచ్చిన హామీల్ని ఎగబెట్టింద్రు. కడుపులో పెట్టి కాపాడుకున్న రైతుల్ని ఆగం చేస్తుండ్రు. బోనస్ ఇస్తమని చెప్పి బోగస్ చేసింద్రు. కాంగ్రెస్ ఐదేండ్లు అధికారంలో ఉండాలి.. అప్పుడే మంచికి, చెడుకి మధ్య తేడా తెలుస్తుంది.. అయితే సీఎం పదవి కోసం ఎవరు ఎక్కడ జంప్ అవుతారో తెలియదు.. గిట్లాంటి లిల్లీపుట్‌గాళ్ల ప్రభుత్వం ఏడాదైనా ఉండనట్లుంది" అంటూ కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. మంగళవారం సంగారెడ్డి జిల్లాలోని సుల్తాన్‌పూర్‌లో నిర్వహించిన మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ ప్రజా ఆశీర్వాద సభకు కేసీఆర్ హాజరై మాట్లాడారు.

అంబేద్కర్‌కు అవమానం జరుగుతుంటే మనం నోరు మూసుకుని ఉంటామా అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీల్ని అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ఎందుకు ఓట్లేయాలని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సీట్లెందుకు.. ఓట్లేందుకని కాంగ్రెసోళ్లు అంటున్నారని, తెలంగాణ హక్కుల్ని కాపాడేందుకు బీఆర్ఎస్ బిడ్డలు పార్లమెంట్‌లో ఉంటేనే కొట్లాడగలరని అన్నారు. కాంగ్రెస్ వచ్చాక వరి కోతలు బందై కరెంట్ కోతలు షురూ అయ్యాయన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ, మహిళలకు రూ.2500 సాయం, ఆడబిడ్డ పెండ్లికి తులం బంగారం, రైతు బంధు, పింఛన్ల పెంపు వంటి హామీల్ని అమలు చేయని కాంగ్రెస్‌కు ఓట్లతో బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. వడ్లు, మక్కలకు బోనస్ ఇవ్వడానికి కోడ్ అడ్డు ఉండదన్నారు. వెంటనే రుణమాఫీ చేయాలన్నారు. ఎండిన పంటకు నష్టపరిహారం, రూ.2 లక్షల రుణమాఫీ, రూ.500 బోనస్ కోసం బీఆర్ఎస్ పోస్టుకార్డు ఉద్యమం చేపట్టిందన్నారు. మెతుకు సీమ మెదక్ జిల్లాలో సింగూర్ జలాల్ని పంట పొలాలకు మళ్లించింది బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. సంగమేశ్వర, బసవేశ్వర లిఫ్టులు కట్టి జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్ ప్రాంతంలో మూడు లక్షల ఎకరాలకు సాగునీరిచ్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే కాంగ్రెస్ వచ్చి ఆ లిఫ్టుల్ని పక్కన పెట్టిందని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఏనాడూ పోలీసుల చేత దౌర్జన్యాలు చేయించింది లేదన్నారు. హామీలు అమలుచేయాలని అడిగితే బూతులు మాట్లాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో పోలీసులు రెచ్చిపోయి బీఆర్ఎస్ వాళ్లను అరెస్టు చేసి కేసులు పెట్టి దౌర్జన్యం చేస్తున్నారన్నారు. 'మళ్లీ అధికారంలోకి వస్తాం.. తస్మా జాగ్రత్త' అంటూ పోలీసుల్ని హెచ్చరించారు. మేధావులైన ఉద్యోగులు సైతం ఆలోచించి ఓట్లేయాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులకు ఎంతో మేలు చేసిందని గుర్తు చేశారు. అక్కరకు రాని చుట్టం.. మొక్కినా వరమివ్వని దేవుళ్లు ఉన్నా లేకున్నా ఒక్కటే అన్నట్లుగా తెలంగాణకు ఏమీ చేయని బీజేపీకి ఎందుకు ఓటేయ్యాలని అన్నారు. ఆ పార్టీకి ఓటేస్తే మురికి కాల్వలో వేసినట్లే అవుతుందన్నారు. సభలో మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, మహమూద్‌అలీ, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింత ప్రభాకర్, మాణిక్యరావు, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మెదక్, జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు వెంకట్రామ్‌రెడ్డి, గాలి అనిల్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, పద్మాదేవేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, పట్నం మాణిక్యం, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెంపరేచర్ @ 44.7 డిగ్రీలు

(మొదటిపేజీ తరువాయి)

భద్రాచలంలో 44.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో మళ్లీ పగటి పూట ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలు దాటిపోయాయి. బుధ, గురు, శుక్రవారాల్లో వాతావరణం పొడిగా ఉండే అవకాశాలున్నాయి. ఆ మూడు రోజులూ కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, కొత్తగూడెం, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నల్లగొండ, సిరిసిల్ల జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశముంది. 20,21,22 తేదీల్లో మాత్రం రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయి. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో వచ్చే 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉపరితల గాలులు ఆగ్నేయ దిశలో వీచే అవకాశముంది.

విద్వేషాలు రెచ్చగొడుతున్నారు

(మొదటిపేజీ తరువాయి)



ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురించి ఆయన దాదాపు తన ప్రతి ప్రసంగంలోనూ ప్రస్తావిస్తూనే వున్నారని, ఈ విషయమై కొన్ని ప్రతిపక్ష పార్టీలపై బురద చల్లే యత్నం చేస్తున్నారని ఏచూరి ఆ లేఖలో పేర్కొన్నారు.

ప్రతిపక్ష నేతలను రామాలయ వ్యతిరేకులుగా చిత్రించడం, రాముడికి వారు వ్యతిరేకులని, రాముడిని అవమానిస్తున్నారని అవాకులు చవాకులు పేలుతున్నారని అన్నారు,.ఈ నెల 7న బీహార్‌లోని నవడాలో, 9న యుపిలోని ఫిలిబిత్‌లో మోడీ చేసిన ప్రసంగాలను, సంబంధిత వీడియో లింక్‌లను రెండు భాగాలుగా ఈ లేఖతో జతచేసి పంపామని ఏచూరి తెలిపారు.రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో ఈ నెల 6న మోడీ ప్రసంగిస్తూ, రామాలయంలో ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఎవరైతే వ్యతిరేకిస్తున్నారో వారు వచ్చే రామనవమి ఉత్సవాలను కూడా వ్యతిరేకిస్తారని వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రత్యర్థులకు వ్యతిరేకంగా మత భావాలను రెచ్చగొట్టే యత్నం తప్ప ఇది మరొకటి కాదని ఏచూరి పేర్కొన్నారు. (ఈ ప్రసంగానికి సంబంధించి ముఖ్య భాగాలు మొదటి అనుబంధంలో జోడించారు).

మోడీ చేసిన ఈ ప్రసంగాలు ఎన్నికల నియమావళిని బాహటంగా ఉల్లంఘించేలా ఉన్నాయి. జనరల్ కండక్ట్ సెక్షన్‌లోక్లాజ్ 1, 3లను కూడా ఇవి అతిక్రమిస్తున్నాయి. బీజేపీకి మద్దతును సమీకరించడానికి లేదా ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా విద్వేషాలను రెచ్చగొట్టడానికి రామాలయాన్ని, రాముడిని ఉపయోగించడమనేది ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కిందికే వస్తుందని ఆ లేఖ పేర్కొంది. మార్చి 1న రాజకీయ పార్టీలకు సూచనలు చేస్తూ ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను కూడా మోడీ ఖాతరు చేయడం లేదని ఏచూరి విమర్శించారు.'రామాలయాన్ని ద్వేషించే వారికి ఆశ్రయం ఇస్తున్నాయి', 'రాముడిని అవమానిస్తున్నారు', రామనవమి ఉత్సవాలను వ్యతిరేకించే వారిని హెచ్చరిక అంటూ మోడీ కొన్ని ప్రతిపక్షాలను దృష్టిలో పెట్టుకుని చేస్తున్న వ్యాఖ్యలు, ఉద్దేశిత లక్ష్యానికి వ్యతిరేకంగా మత విద్వేషాలను రెచ్చగొట్టడానికి ఉద్దేశించబడ్డాయని స్పష్టమవుతోంది. అలాగే ఈ చర్యలు చట్టానికి విరుద్ధంగా వుంటున్నాయి.

పైగా ఐపిసిలోని సెక్షన్ 153ఎ, సబ్ క్లాజ్ (ఎ), (బి), ఐపిసి సెక్షన్ 505, సబ్ సెక్షన్ 2 నిబంధనలు వర్తిస్తాయి. అలాగే, ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 123వ సెక్షన్ క్లాజ్ 3, 3ఎ నిబంధనలు కూడా ఈ ప్రసంగాలకు వర్తిస్తాయి.అత్యున్నత పదవిలో వున్న వ్యక్తి, పైగా పాలక పార్టీ ఉన్నత స్థాయి నేత ఇటువంటి విచ్ఛిన్నకరమైన, నిరాధారమైన ప్రసంగాలు చేయడం తీవ్ర దురదృష్టకరమని ఏచూరి ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో తక్షణమే ఈ విషయంలో జోక్యం చేసుకుని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించకుండా చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను సీపీఐ(ఎం) కోరుతోంది. దీనితో ప్రమేయం వున్న వ్యక్తి హెూదాతో సంబంధం లేకుండా నిష్పక్షపాతంగా చట్టాన్ని వర్తింపచేయాలని కోరింది. ఎన్నికల వాతావరణాన్ని మరింత విషపూరితం చేయకుండా నిలువరించేందుకు ఎన్నికల కమిషన్ తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ఏచూరి ఆ లేఖలో కోరారు.

సోరేన్ కేసులో మరొకరు అరెస్టు

రాంచీ : జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు వ్యతిరేకంగా మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరొకరిని అరెస్ట్ చేసింది. లాండ్ స్కాంకి సంబంధించిన మరో మనీలాండరింగ్ కేసులో అఫ్జర్ అలీ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సంబంధిత అధికారులు మంగళవారం తెలిపారు. కోర్టు అనుమతితో ఈడీ అతనిని కస్టడీలోకి తీసుకుందని పేర్కొన్నాయి. ప్రధాన నిందితుడు సోరెన్, మాజీ రెవెన్యూ డిపార్ట్‌మెంట్ సబ్ ఇన్స్‌పెక్టర్ భాను ప్రతాప్ ప్రసాద్ పట్ల అండదండలతో భూమిని ఆక్రమించుకునేందుకు అఫ్జర్ అలీ ఫోర్జరీకి పాల్పడ్డారని ఈడీ పేర్కొంది. ఈ కేసులో ఇది నాలుగవ అరెస్ట్. రాంచీలో అంటు టిర్కీ అనే వ్యక్తికి చెందిన పలు ప్రాంతాల్లో సోదాలు కూడా జరిపినట్లు ఆ అధికారులు తెలిపారు. జెఎంఎం అధినేత, జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌ను ఈ ఏడాది జనవరిలో ఇడి అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన రాంచీలోని బిర్సా ముండా జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఇదే కేసులో అరెస్టయిన భాను ప్రతాప్ ప్రసాద్, మహమ్మద్ సద్దామ్ హుస్సేన్ కూడా ఇదే జైలులో ఉన్నారు.

పాకిస్థాన్ నేషనల్ అసెంబ్లీ సభ్యురాలిగా ప్రమాణం చేసిన అసీఫా భుట్టో

ఇస్లామాబాద్ : పాకిస్థాన్ మాజీ ప్రధాని బెనజీర్ భుట్టో కుమార్తె అసీఫా భుట్టో జర్దారీ జాతీయ అసెంబ్లీ సభ్యురాలి (ఎంఎన్ఎ) గా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రతిపక్షాల నిరసనల మధ్య ఆమె సోమవారం ప్రమాణ స్వీకారం చేసినట్లు స్థానిక మీడియా డాన్ తెలిపింది. పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పిపిపి) చైర్మన్, తన సోదరుడు బిలావల్ భుట్టో జర్దారీ తోడురాగా, పార్లమెంటులోకి ప్రవేశించి, ఎంపిగా ప్రమాణం చేసినట్లు పేర్కొంది. ఎంఎన్ఎ పార్టీ సభ్యుల నినాదాల మధ్య ఎన్ఎ స్పీకర్ అయాజ్ సాధిక్ ఆమెతో ప్రమాణం చేయించారు. దీంతో ట్రెజరీ చట్టసభసభ్యులు వాకౌట్ చేశారు. గత నెల జరిగిన ఎన్నికల్లో ఎన్ఎ-207 షహీద్ బెనజీరాబాద్ (గతంలో నవాబ్‌షా) నుండి అసీఫా ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. అసీఫా భుట్టో తండ్రి ఆసిఫ్ అలి జర్దారీ పాకిస్తాన్ అధ్యక్షుడిగా ఎంపికవడంతో .. ఆ స్థానం ఖాళీ అయింది.



సంకల్ప్‌పత్ర్ కాదు దేశ ప్రజలకు మరణపత్రం

- నిత్యావసర ధరలు, నిరుద్యోగం నియంత్రణకు చర్యల్లేవు
- పంటలకు మద్దతు ధర, ఉపాధి కల్పనకు హామీల్లేవు
- జమిలి ఎన్నికలతో రాజ్యాంగ ఫెడరల్ వ్యవస్థకు ప్రమాదం : అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సంకల్ప్ పత్ర్ పేరుతో బీజేపీ విడుదల చేసిన మ్యానిఫెస్టో దేశ ప్రజలకు మరణపత్రంగా మారే ప్రమాదముందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. మోడీ గ్యారెంటీ అంటూ ప్రగల్బాలు పలుకుతూ బీజేపీ నేతలు విడుదల చేసిన మ్యానిఫెస్టోలో పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, నిరుద్యోగ నియంత్రణకు చర్యలు లేనేలేవన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల కల్పన, గ్రామీణ ఉపాధి హామీ చట్టం పనుల విస్తరణ వంటి అంశాల ఊసేలేదని విమర్శించారు. ఎన్ఆర్‌సీ, సీఏఏ వంటి చట్టాల అమలు, జమిలీ ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొనడంతో రాజ్యాంగ మనుగడకు, ఫెడరల్ వ్యవస్థకు ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. రాజ్యాంగం అమల్లో లేకుంటే వ్యవసాయ కార్మికులుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా రిజర్వేషన్లు అమలు ప్రమాదంలో పడటం ఖాయమని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ రక్షణ కోసం, ప్రజాస్వామ్య హక్కుల కోసం వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఓడించాలనీ, వామపక్ష, లౌకిక ప్రజాతంత్ర శక్తులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఐదు కేజీల ఉచిత బియ్యమే కాదు 14 రకాల నిత్యావసర సరుకులు అందించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించకుండా, ఎఫ్‌సీఐ గోదాములను నిర్వహించే బాధ్యత తీసుకోకుండా ఏ విధంగా ఐదు కేజీల బియ్యం పేదలకు ఇస్తారని ప్రశ్నించారు. కార్మికులు వ్యవసాయ కార్మికుల కనీస వేతనాల గురించి బీజేపీ పత్రంలో ప్రస్తావన లేదన్నారు. కార్పొరేట్ శక్తులకు లాభాలు కలిగించేందుకు కార్పొరేట్ కాంట్రాక్ట్ వ్యవసాయాన్ని, కార్మిక కోడ్ లను అమలు చేయడానికి బీజేపీ సిద్ధపడిందని విమర్శించారు. వీరికోసమే బుల్లెట్ ట్రైన్‌లను వేస్తామని ప్రకటించింది తప్ప సాధారణ ప్రజల ప్రయాణం చేసే జనరల్ బోగీలను పెంచుతామని చెప్పకపోవడం శోచనీయమన్నారు. గ్రామీణ పేదలకు, రైతాంగానికి, కార్మిక వర్గానికి వ్యతిరేక మ్యానిఫెస్టోని విడుదల చేసిన బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రెస్‌మీట్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ప్రసాద్, బొప్పని పద్మలు పాల్గొన్నారు.

నెత్తురోడిన బస్తర్

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఎదురు కాల్పుల్లో గాయపడిన జవాన్లకు ప్రమాదమేమీ లేదని, మెరుగైన చికిత్స కోసం వారిని విమానంలో తరలించామని అన్నారు.

ఎన్‌కౌంటర్ స్థలం నారాయణ్‌పూర్ జిల్లాలోని అబూజ్‌మధ్, మహారాష్ట్రలోని గడ్చిరోలి, ఉత్తర బస్తర్ ప్రాంతాలకు కూడలి అని సుందర్‌రాజ్ చెప్పారు. సంఘటనా స్థలంలో మావోయిస్టు సీనియర్ నాయకులు లలిత, శంకర్ రావు, రాజు ఉన్నట్లు తమకు సమాచారం ఉందని, దాని ఆధారంగానే డీఆర్‌జీ, బీఎస్ఎఫ్ సంయుక్త దళాన్ని అక్కడికి పంపామని వివరించారు. మావోయిస్టుల ఉత్తర బస్తర్ డివిజన్‌లో శంకరరావు, లలిత డివిజనల్ కమిటీ సభ్యులుగా పనిచేస్తున్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఎన్‌కౌంటర్ మృతుల్లో వీరు కూడా ఉన్నారని తెలిసింది.

ఛోటే బెత్రియా పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. సంఘటనా స్థలం నుండి మూడు ఎస్ఎల్ఆర్ రైఫిల్స్, ఒక ఏకే రైఫిల్, రెండు పిస్టల్స్, రెండు ఇన్సాస్ రైఫిల్స్, రెండు 303 రైఫిల్స్ వంటి ఆయుధాలు, పేలుడు పదార్థాలను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయని అధికారులు తెలిపారు. బినగుండ, దాని పరిసర ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న సమాచారంతో డీఆర్‌జీ, బీఎస్ఎఫ్ దళాలు సోమవారం రాత్రే గాలింపు చర్యలు ప్రారంభించాయి. 'బినగుండ ప్రాంతంలో ఉత్తర బస్తర్ డివిజనల్ కమిటీకి చెందిన మావోయిస్టులు ఉన్నారని మాకు కచ్చితమైన సమాచారం వచ్చింది. ఈ నెల 5వ తేదీ నుండి ఆ ప్రదేశంలోనే వారు శాశ్వత శిబిరాన్ని ఏర్పాటు చేసుకున్నారు' అని బీఎస్ఎఫ్ వర్గాలు చెప్పాయి.

రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు జరుగుతున్న సమయంలో గత సంవత్సరం నవంబర్ 7వ తేదీన పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సిబ్బంది వెళుతుండగా మావోయిస్టులు పేలుడు పదార్థాలతో దాడి చేశారు. ఈ ఘటనలో పోలింగ్ సిబ్బందికి ఎస్కార్టుగా వెళుతున్న ఓ జవాను తీవ్రంగా గాయపడి చనిపోయాడు. ఈ పేలుడులో ఇద్దరు పోలింగ్ సిబ్బంది కూడా గాయపడ్డారు. ఈ సంవత్సరం భద్రతా దళాలు మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాలను ముమ్మరం చేశాయి. ఇప్పటి వరకూ 50 మంది కిపైగా మావోయిస్టులను హతమార్చాయి. ఈ ఏడాది జరిగిన మావోయిస్టు హింసలో 18 మంది పౌరులు, ఆరుగురు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు.



షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

- చిన్న వ్యాపారుల షాపుల దగ్ధం
- సుమారు రూ.3లక్షల వరకు నష్టం

నవతెలంగాణ-కల్లూరు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగి పండ్ల షాపు, టైర్ల కొట్టు, కొలిమి షాపు పూర్తిగా దగ్ధమైన ఘటన ఖమ్మం జిల్లా కల్లూరు పట్టణంలోని మెయిన్ రోడ్‌లో మంగళవారం తెల్లవారు జామున జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి తాళం వేసిన షాపుల్లో.. మంగళవారం తెల్లవారుజామున మంటలు చెలరేగడంతో స్థానికులు మేల్కొని మంటలార్పే ప్రయత్నం చేశారు. అయినా మంటలు అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం అందించారు. కాగా, అగ్నిప్రమాదం జరిగిన పండ్ల షాప్‌లో సుమారు రూ. లక్ష విలువ చేసే వివిధ రకాల పండ్లు దగ్ధం కాగా, రూ.40 వేల నగదు కూడా దగ్ధమైనట్టు యజమాని షేక్ నషీర పాషా తెలిపారు. టైర్ల కొట్టులో గాలి మిషన్, టైర్లు దగ్ధం కావడంతో సుమారు లక్ష రూపాయల వరకు నష్టం జరిగిందని యజమాని ఆకుల ప్రసాద్ వాపోయాడు. కొలిమి షాపులో రూ.50 వేల వరకు నష్టం జరిగిందని యజమాని తెలిపారు. అగ్నిప్రమాదం విషయం తెలుసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ హుటా హుటిన సంఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రమాదం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్ట రాగమయితో ఫోన్‌లో మాట్లాడి బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. సంఘటనా స్థలంలో ఆస్తి నష్టాన్ని అంచనా వేసి నివేదిక సమర్పించాలని ఆర్ఐలు అన్వర్ పాషా, స్టాలిన్‌కు ఎమ్మెల్యే ఆదేశించినట్టు తెలిపారు.

నేను ఉగ్రవాదిని కాదు

(మొదటిపేజీ తరువాయి)

గోడల మధ్య కలిశాను. ఆప్ పార్టీపై కేంద్రం ఎంత ద్వేషం పెంచుకుందో దీని ద్వారా అర్థమౌతోంది " అని ఆయన జైలు నుంచి పంపిన మెసేజ్‌లో పేర్కొన్నారని అన్నారు.

కేజ్రీవాల్ రోజువారీ కార్యకలాపాలతో పాటు కుటుంబసభ్యులతో మాట్లాడే సమయంలో కూడా నిరంతరం పర్యవేక్షిస్తూ వేధింపులకు గురిచేస్తోందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ మండిపడ్డారు. ఢిల్లీ ప్రజలతో పాటు దేశ ప్రజలకు ఓ కుమారుడిగా, సోదరుడిగా సేవలందించిన వ్యక్తి పట్ల ఈ విధంగా వ్యవహరించడం మీకు అవమానంగా అనిపించడం లేదా అని కేంద్రాన్ని నిలదీశారు. ప్రధాని మోడీ మనస్సు ద్వేషంతో నిండిపోయిందని, కేజ్రీవాల్ తన భార్య, కుటుంబసభ్యులను కూడా గ్లాస్ గోడల మధ్య కలుసుకుంటున్నారని సంజయ్ సింగ్ ధ్వజమెత్తారు.

ఆయన మట్టి మనిషని, ఐఆర్ఎస్ జాబ్ వదులుకుని దేశ ప్రజలకు సేవలందిస్తున్నారని అన్నారు. తన సిద్ధాంతాల కోసం పదవి చేపట్టిన 49 రోజులకే రాజీనామా చేశారని, అదీ కేజ్రీవాల్ అంటే అని సంజయ్ సింగ్ పేర్కొన్నారు. ఎంత బలంగా అణచి వేయాలని చూస్తే అంత బలంగా తిరిగి వస్తారని అన్నారు.

ఖాళీ ధాన్యం బస్తాల దగ్ధం

నవతెలంగాణ - నిజాంపేట

మెదక్ జిల్లా రామాయంపేట సహకార సంఘం ఆధ్వర్యంలో రబీ సీజన్ వరి ధాన్యాన్ని సేకరించడానికి కొనుగోలు కేంద్రాన్ని మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో ప్రారంభించారు. ఆ కొనుగోలు కేంద్రంలో కొత్త ధాన్యం బస్తాలు 5000 వేలు, పాతవి 5000 స్టోరేజ్ చేసినట్లు సీఈఓ పుట్టి నర్సింహులు తెలిపారు. సోమవారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 2300 గన్ని బ్యాగ్స్ దహనం చేసినట్లు తెలిపారు. ఒక్క బస్తా ఖరీదు 80 రూపాయలు దీని వల్ల సొసైటీకి సుమారు రూ.1,84,000వేల నష్టం వాటిల్లిందన్నారు. దీనిపై సెంటర్ ఇన్‌ఛార్జి డి మహేష్‌తో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఘటనపై అనుమానాలు ఉన్నాయని అన్నారు.



బౌద్ధం ఓ ప్రత్యేక మతం

అందులో చేరాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి

- సర్క్యులర్ జారీ చేసిన గుజరాత్ ప్రభుత్వం

అహ్మదాబాద్ : బౌద్ధం ఓ ప్రత్యేక మతమని గుజరాత్ ప్రభుత్వం తెలిపింది. ఎవరైనా హిందూ మతం నుండి బౌద్ధ మతం, జైన మతం, సిక్కు మతంలోకి మారాలంటే సంబంధిత జిల్లా మెజిస్ట్రేట్ నుంచి ముందస్తు అనుమతి పొందాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఓ సర్క్యులర్ జారీ చేసింది. గుజరాత్ మత స్వేచ్ఛ చట్టం-2003 ప్రకారం ముందుగా అనుమతి పొందడం తప్పనిసరి అని రాష్ట్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆ సర్క్యులర్ తెలిపింది. బౌద్ధ మతంలోకి మారేందుకు సమర్పిస్తున్న దరఖాస్తులు నిబంధనలకు అనుగుణంగా ఉండడం లేదని ప్రభుత్వ దృష్టికి వచ్చిందని వివరించింది. కాగా సర్క్యులర్‌పై డిప్యూటీ సెక్రటరీ (హోం) విజయ్ బధేకా సంతకం చేశారు.

మత మార్పిడుల నిరోధానికే

గుజరాత్‌లో ప్రతి సంవత్సరం దసరా, ఇతర పండుగల సందర్భంగా జరిగే కార్యక్రమాలలో పలువురు దళితులు మూకుమ్మడిగా బౌద్ధ మతంలో చేరుతున్నారు. ఈ నేపథ్యంలో మత మార్పిడులను నిరోధించేందుకు ప్రభుత్వం తాజాగా సర్క్యులర్ జారీ చేసింది. గుజరాత్ మత స్వేచ్ఛ చట్టాన్ని జిల్లా మెజిస్ట్రేట్ల కార్యాలయాలు తమ ఇష్టానుసారం అన్వయించుకుంటున్నాయని అందులో తెలిపింది. హిందూ మతం నుండి బౌద్ధ మతంలోకి మారడానికి అనుమతి కోరుతూ సమర్పించే దరఖాస్తుల విషయంలో నిబంధనలను పాటించడం లేదని ప్రభుత్వం దృష్టికి వచ్చింది. అదీకాక కొన్ని సందర్భాలలో హిందూ మతం నుండి బౌద్ధంలోకి మారేటప్పుడు ముందస్తు అనుమతి అవసరం లేకుండా చూడాలని కొందరు దరఖాస్తుదారులు, స్వతంత్ర సంస్థలు కోరుతున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 (2) ప్రకారం సిక్కులు, జైనులు, బౌద్ధులు హిందూ మతానికి చెందిన వారేనని, మత మార్పిడుల కోసం వారు అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని దరఖాస్తులను పరిష్కరించే సమయంలో సంబంధిత అధికారులు చెబుతున్నారు. మత మార్పిడుల వంటి సున్నితమైన అంశాలపై దరఖాస్తుదారులకు సమాధానం ఇచ్చే ముందు న్యాయపరమైన నిబంధనలను సరిగా అధ్యయనం చేయకపోతే చట్టపరమైన వివాదాలు తలెత్తుతాయి' అని ఆ సర్క్యులర్‌లో తెలియజేశారు.

ఆ రాష్ట్రంలో పరిపాటే

గుజరాత్‌లో దళితులు బౌద్ధ మతంలోకి మారడం సర్వసాధారణంగా జరుగుతున్నదే. గుజరాత్ బౌద్ధ అకాడమీ (జీబీఏ) వంటి సంస్థలు ప్రతి ఏటా మత మార్పిడుల కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయి. కాగా తాజా సర్క్యులర్‌పై జీబీఏ కార్యదర్శి రమేష్ బంకర్ హర్షం వ్యక్తం చేశారు. బౌద్ధం అనేది హిందూమతంలో భాగం కాదని అది స్పష్టం చేసిందని చెప్పారు. గత సంవత్సరం రెండు వేల మంది ప్రజలు బౌద్ధ మతాన్ని స్వీకరించారని ఆయన తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం గుజరాత్‌లో 30,483 మంది బౌద్ధులు ఉన్నారు. రాష్ట్ర జనాభాలో ఇది 0.05% మాత్రమే. అయితే జనగణన చేసిన అధికారులు బౌద్ధులను హిందువులుగా పరిగణించారని, దీంతో ఆ గణాంకాల్లో బౌద్ధుల వాస్తవ సంఖ్య ప్రతిబింబించలేదని రమేష్ తెలిపారు. గత సంవత్సరం అక్టోబరులో అహ్మదాబాద్‌లో 400 మంది ప్రజలు బౌద్ధ మతాన్ని స్వీకరించారు. 2022 అక్టోబరులో గిర్ సోమనాథ్‌లో 900 మంది బౌద్ధ మతంలో చేరారు.


ప్రత్యేక మతంగా పరిగణించాలి

గుజరాత్ మత స్వేచ్ఛ చట్టం ప్రకారం బౌద్ధాన్ని ప్రత్యేక మతంగా పరిగణించాలని సర్క్యులర్ స్పష్టం చేసింది. చట్టపరమైన నిబంధనలను కూలంకషంగా అధ్యయనం చేయాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు జారీ చేస్తున్న ఆదేశాలను పాటించాలని, ఆ తర్వాతే మత మార్పిడుల దరఖాస్తులపై నిర్ణయం తీసుకోవాలని తెలిపింది.



యూపీఎస్సీ ఫలితాల్లో విజయానికి కేరాఫ్ అడ్రస్ నారాయణ

- జాతీయ స్థాయిలో 3,493, 545,919 ర్యాంకులతో సంచలనం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఫలితాల్లో విజయానికి కేరాఫ్ అడ్రస్‌గా నారాయణ విద్యాసంస్థ నిలిచింది. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన సివిల్ సర్వీసెస్‌లో నారాయణ విద్యార్థులు సంచలన విజయం సాధించారు. ఈ మేరకు నారాయణ విద్యాసంస్థల గ్రూప్ డైరెక్టర్లు పి సింధూర నారాయణ, పి శరణి నారాయణ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యూపీఎస్సీ ఫలితాల్లో జాతీయ స్థాయిలో దోనూరు అనన్యరెడ్డి మూడో ర్యాంకు, దొనక పృథ్వీరాజ్ కుమార్ 493 ర్యాంకు, సి హెచ్ నరేంద్ర పడాల్ 545 ర్యాంకు, ధరావత్ సాయిప్రకాశ్ 919 ర్యాంకు సాధించి విజయభేరి మోగించారని వివరించారు. సివిల్స్ కష్టతరమంటూ నేటి యువత భావిస్తున్నదని తెలిపారు. ఇష్టపడి చదివితే కచ్చితంగా విజయం సాధించొచ్చని సూచించారు. పట్టుదల, నిరంతర కృషి ఉంటే సాధించలేనిది ఏదీ లేదని పేర్కొన్నారు. సమకాలీన అంశాలపై సమగ్ర అవగాహన కలిగి ఉంటే సివిల్స్ సాధించడం కష్టమేమీ కాదని వివరించారు. 21 ఏండ్లకే ఐఏఎస్ కలను నెరవేర్చేందుకు నారాయణ ఇంటిగ్రేటెడ్ ఐఏఎస్ అకాడమిని తీర్చిదిద్దామని తెలిపారు. అందుకే సాక్ష్యమే ఈ ఫలితాలని పేర్కొన్నారు. సివిల్స్‌లో ర్యాంకులు పొందిన అనన్యరెడ్డి, పృథ్వీరాజ్‌కుమార్, సి హెచ్ నరేంద్ర పడాల్ ఇంటిగ్రేటెడ్ అకాడమిలో శిక్షణ పొందారని వివరించారు. ర్యాంకులు పొందిన వారిని అభినందించారు.

మోనికాకు సివిల్స్‌లో 487వ ర్యాంకు

- ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమీ అభినందనలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఫలితాల్లో మోనికా అడుసుమిల్లి జాతీయస్థాయిలో 487 ర్యాంకు సాధించారు. ఈ మేరకు ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమి చైర్మెన్, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, అడ్వైజర్, చీఫ్ గార్డెనర్ వై సత్యనారాయణ, ప్రిన్సిపాల్ కె సురేందర్‌రెడ్డి, కోర్సు కోఆర్డినేటర్ జనార్ధన్‌దండు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె సతీష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో ఆమెకు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. తమ అకాడమిలో ఆమె తెలుగు సాహిత్య విద్యార్థినిగా యూపీఎస్సీకి సన్నద్ధమయ్యారని పేర్కొన్నారు.

మా ఇద్దరినీ హత్య చేస్తారనిపిస్తోంది..

- అక్బరుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు



నవతెలంగాణ - ధూల్ పేట్

హైదరాబాద్ చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను, తన సోదరుడు అసదుద్దీన్ ఓవైసీని చంపాలని కొందరు చూస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ పాతబస్తీ యాకుత్‌పురలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన ఎంఐఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో తాము చాలా బలంగా ఉన్నామని, అందుకే తమను ఓడించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఎవరు ఎంత ప్రయత్నించినా తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. అయితే, తమను (ఓవైసీ సోదరులను) జైలుకు పంపి అక్కడ మెడిసిన్ పేరుతో స్లోపాయిజన్ ఇచ్చి చంపేస్తారేమోనని అనిపిస్తోందన్నారు. లేదా గన్‌తో కాల్చి హత్య చేస్తారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. ఎలాంటి పరిస్థితి వస్తుందో, మరణం ఎటు వైపు నుంచి పొంచి ఉందో తెలియదని చెప్పారు. అయినా, తాము భయపడబోమన్నారు. మరోసారి హైదరాబాద్ గడ్డపై మజ్లిస్ జెండా ఎగుర వేస్తామన్నారు. లోక్‌సభ ఎన్నికల వేళ అక్బరుద్దీన్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి.

చిట్యాల రాజుకు ఓయూ డాక్టరేట్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సూర్యాపేట జిల్లా వాసి చిట్యాల రాజుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో డాక్టరేట్ పట్టా వరించింది. డాక్టర్ ఎవి కృష్ణప్రసాద్ పర్యవేక్షణలో 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ నెట్‌వర్క్‌కు అనుసంధానమయ్యే వివిధ రకాల స్మార్ట్ డివైజెస్‌ల అథెంటికేషన్, డాటా సెక్యూరిటీ విషయంలో ఎదురయ్యే సవాళ్లను మెషిన్ లెర్నింగ్ సహాయంతో ఎలా అధిగమించొచ్చు'అనే విషయంపై ఆయన పరిశోధన చేశారు. ప్రతిష్టాత్మకమైన ఓయూ డాక్టరేట్‌ను మంగళవారం రాజుకు ప్రదానం చేశారు. ఇదే అంశంపై ఆయన రచనలు, వ్యాసాలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్లలో ప్రచురితమయ్యాయి. ఈ సందర్భంగా సైఫాబాద్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జె లక్ష్మణ్‌నాయక్‌తోపాటు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ఎన్నికల తర్వాత రేవంత్ రెడ్డి సీటుకే గ్యారంటీ లేదు

- ఆగస్టు తర్వాత హామీలు ఎలా సాధ్యం? : బీజేపీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్

నవతెలంగాణ-నిజామాబాద్

వందరోజుల్లో అమలు కాని కాంగ్రెస్ పార్టీ గ్యారంటీలు.. ఆగస్టు తర్వాత ఎలా సాధ్యమవుతాయని నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం నిజామాబాద్ నగరంలో అరవింద్ ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికలకు ముందు వంద రోజుల్లో హామీలను అమలుచేస్తామన్న కాంగ్రెస్.. ఇప్పుడు ఆగస్టులో రుణమాఫీ చేస్తామని మరోసారి మోసానికి తెరలేపుతోందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణలో రాజకీయ పరిణామాలు మారనున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఇవే చివరి ఎన్నికలని, ఆతర్వాత రేవంత్ రెడ్డి సీటుకే గ్యారంటీ లేదని తెలిపారు. తెలంగాణలో బీజేపీ రోజురోజుకీ ఎదుగుతోందని, కాబట్టి ఇతర పార్టీలతో లాలూచీ పడే అవసరం లేదని స్పష్టంచేశారు. రాష్ట్రంలో బీజేపీకి 12 సీట్లు వస్తాయని కాంగ్రెస్ నేతలే చెబుతున్నారని, అలా వస్తే సీఎం రేవంత్‌ను ఎవరు కాపాడుతారని అన్నారు. సమర్థుడైన సీఎం రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్‌లో ఉండటమే పెద్ద తప్పని అన్నారు. కాంగ్రెస్ నేతలు రేవంత్‌ను పనిచేయకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌లో ఉంటే ఎవరికైనా రాజకీయ భవిష్యత్తు ఉండదని అన్నారు.

మహాదేవపూర్ పోలీస్‌స్టేషన్ ఖాళీ..

- ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్‌తో పాటు 9 మంది బదిలీ

నవతెలంగాణ-మహాదేవపూర్

జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందిపై పోలీస్‌శాఖ చర్యలకు ఉపక్రమించింది. సోమవారం మహాదేవపూర్ పోలీస్ సిబ్బంది ఏడుగురిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు మహాదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో జెడ్పీటీసీ భర్త శ్రీనివాస్ చేసిన డ్యాన్స్ వైరల్‌గా మారడంతో జిల్లా ఎస్పీ స్పందించి ఎస్ఐ ప్రసాద్‌ను వీఆర్‌కు అటాచ్ చేసి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశారు. అదేవిధంగా ఇక్కడ పనిచేస్తున్న కానిస్టేబుళ్ల ఇసుక, గుడుంబా, ఇతర కారణాలతో ఏడుగురు కానిస్టేబుళ్లను ఇతర పోలీస్ స్టేషన్లకు బదిలీ చేశారు. దాంతో మహదేవపూర్ పోలీస్ స్టేషన్ ఖాళీగా దర్శనమిస్తోంది. మహదేవపూర్ పోలీస్ స్టేషన్‌కు వివిధ గ్రామాల నుంచి భూ తగాదాలు, కొట్లాటల కేసులు వస్తుంటాయి. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దున ఉన్న పోలీస్‌స్టేషన్ కావడంతో మావోయిస్టుల ప్రభావమూ ఎక్కువగానే ఉండటంతో స్థానిక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పోలీస్ స్టేషన్‌కు పూర్తిస్థాయిలో పోలీసు బలగాలను నియమించాలని కోరుతున్నారు.

అదరగొట్టారు

(మొదటిపేజీ తరువాయి)

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ 2023 ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్), ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)కి 1016 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. 180 మంది ఐఏఎస్‌లు, 200 మంది ఐపీఎస్‌లుగా మారనున్నారు.

లక్నోకు చెందిన ఆదిత్య శ్రీవాస్తవ ఆల్ ఇండియా మొదటి ర్యాంక్ సాధించగా... అనిమేష్ ప్రధాన్‌కు రెండో ర్యాంక్, అనన్యారెడ్డి(తెలంగాణ)కి మూడో ర్యాంకు లభించింది. టాప్ ఐదు ర్యాంకుల్లోని ముగ్గురు అభ్యర్థులు ఇప్పటికే ఐపీఎస్ అధికారులు కావటం విశేషం. ఒకటవ ర్యాంక్ సాధించిన ఆదిత్య శ్రీవాస్తవ, నాల్గోవ ర్యాంక్ పీకే సిద్ధార్థ్ రామ్‌కుమార్, ఐదో ర్యాంక్ రోహణి హైదరాబాద్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీలో ఐపీఎస్ శిక్షణ పూర్తి చేస్తున్నారు. యూపీఎస్సీ ప్రకటించిన సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో తెలుగు విద్యార్థులు మెరిశారు. టాప్ వందలోపు మూడు ర్యాంకులను సాధించి సత్తా చాచారు. మూడో ర్యాంకు అనన్యారెడ్డి, 27వ ర్యాంకు నందాల సాయికిరణ్, 82వ ర్యాంకు మెరుగు కౌశిక్ పొందడం గమనార్హం.

గత 11 ఏండ్లలో ఓ ఐపీఎస్ అధికారి సర్వీస్‌లో ఉండగా ఈ పరీక్షలో ఆల్ ఇండియా మొదటి ర్యాంక్ సాధించడం ఇదే తొలిసారి. గతంలో 2013లో ఐపీఎస్ అధికారి గౌరవ్ అగర్వాల్ సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఆల్ ఇండియా మొదటి ర్యాంక్ సాధించారు. ఆదిత్య శ్రీవాస్తవ గతేడాది ఐపీఎస్‌లో ఎంపికయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఐపీఎస్ శిక్షణ తీసుకుంటున్నారు. ఇది అతనికి మూడో ప్రయత్నం కాగా మొదటిసారి ప్రిలిమ్స్‌లో ఎంపిక కాలేదు. ఆదిత్య ఐఐటీ కాన్పూర్‌లో ఎలక్ట్రికల్‌లో బీటెక్ చేశారు. అక్కడ కూడా టాపర్‌గా నిలిచారు. ఆదిత్య తండ్రి అజయ్ శ్రీవాస్తవ కాగ్‌లో ఆడిట్ అధికారి. చిన్నప్పటి నుంచి కొడుకు ఎక్స్‌ట్రా ఆర్డినరీ అని తల్లి అభా శ్రీవాస్తవ చెప్పారు.

జామియా వర్సిటీ నుంచి 31 మంది ఎంపిక

ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ నుంచి 31 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వీరిలో 11 మంది మహిళలున్నారు. ఈ విద్యార్థులందరూ జేఎంఐకు చెందిన రెసిడెన్షియల్ కోచింగ్ అకాడమీ (ఆర్‌సీఏ) నుంచి చదువుకున్నారు. జేఎంఐ విద్యార్థి నౌషీన్ ఆల్ ఇండియా తొమ్మిదొవ ర్యాంక్ సాధించారు. గత రెండేండ్లుగా యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలో మహిళలు అగ్రస్థానంలో ఉన్నారు. ఇషితా కిషోర్ 2022లో ఏఐఆర్‌లో నెంబర్ 1 ర్యాంకును సాధించింది. శృతి శర్మ యూపీఎస్‌సీ సీఎస్ఈ 2021లో ఆల్ ఇండియా ర్యాంక్ 1ని సాధించింది. 2022లో గరిమా లోహియా, ఉమా హారతి ఎన్ , స్మృతి మిశ్రా టాప్ ర్యాంకర్లలో ఉన్నారు. 2021లో మొదటి మూడు ర్యాంకులు మహిళలవే. అంకితా అగర్వాల్‌కు ఏఐఆర్ 2, చండీగఢ్‌కు చెందిన గామిని సింగ్లా ఏఐఆర్ 3ని పొందారు.

2023లో మహిళల ఉత్తీర్ణత శాతం 34

గత ఐదేండ్లలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలో మహిళల శాతం పెరిగింది. 2018 , 2019లో మహిళా ఉత్తీర్ణత శాతం 24 శాతం కాగా 2020లో 29 శాతానికి చేరుకుంది. అదే సమయంలో, 2021లో ఇది 3 పాయింట్లు తగ్గి 26 శాతానికి చేరుకుంది. 2022లో ఈ సంఖ్య మరోసారి 34 శాతానికి పెరిగింది. గతేడాది ఎంపికైన 933 మంది అభ్యర్థుల్లో 320 మంది మహిళలున్నారు.

సివిల్స్‌లో మెరిసిన 'అనన్య'



సొంత ప్రిపరేషన్‌తో తొలి ప్రయత్నంలోనే మూడో ర్యాంకు

యూపీఎస్సీ విడుదల చేసిన సివిల్స్ తుది ఫలితాల్లో తెలంగాణకు చెందిన అనన్య రెడ్డి మూడో ర్యాంకుతో మెరిశారు. మహబూబ్‌నగర్‌కు చెందిన అనన్య రెడ్డి తన తొలి ప్రయత్నంలోనే అసాధారణ ప్రతిభతో మూడో ర్యాంకు సాధించారు. పదో తరగతి వరకు మహబూబ్‌నగర్ గీతం హైస్కూల్‌లో చదివిన ఆమె ఇంటర్ విద్యను హైదరాబాద్‌లో అభ్యసించారు. ఢిల్లీలోని మెరిండా హౌస్ కాలేజీలో డిగ్రీ చదివారు. ఎవరి దగ్గరా శిక్షణ తీసుకోకుండానే ఈ ఘనతను సాధించారు.

' సివిల్స్' పరీక్ష ఎంతో కఠినంతో కూడినది. ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలలో ఎదురయ్యే కఠిన సవాళ్లను ఎదుర్కొని నిలవడం ఆషామాషీ వ్యవహారం కాదు. ఇంటర్వ్యూ తర్వాత సివిల్స్‌కు ఎంపికవుతారని అనన్య భావించినప్పటికీ.. మూడో ర్యాంకు వస్తుందని మాత్రం అస్సలు అనుకోలేదని ఆమె చెప్పారు. సొంత ప్రణాళికతోనే రోజుకు 12 నుంచి 14 గంటల పాటు చదివినట్టు తెలిపారు. చిన్నప్పటినుంచే సమాజానికి సేవ చేయాలన్న కోరికతోనే సివిల్స్‌ను ఎంచుకున్నట్టు తెలిపారు.

కరీంనగర్‌వాసి సాయికిరణ్‌కు 22వ ర్యాంకు

యూపీఎస్సీ ప్రకటించిన సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన నందాల సాయికిరణ్ 27వ ర్యాంకు సాధించారు. దీంతో ఆ గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సివిల్స్‌లో కౌశిక్ అదుర్స్!

సివిల్స్‌కు ఎంపిక కావడమే లక్ష్యంగా క్యాప్ జెమినీలో ఉద్యోగం వదులుకొని మెయిన్స్‌కు ప్రిపేరైన కౌశిక్.. తొలి ప్రయత్నంలోనే 82వ ర్యాంకుతో సత్తా చాటారు. ఓయూలో సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తి చేసిన ఆయన.. ఢిల్లీలో ఎంబీఏ చేశారు. 'అందరూ చదివినట్లే చదివానని.. రోజుకు ఎనిమిది, తొమ్మిది గంటల పాటు ప్రిపేర్ అయినట్టు ఆయన మీడియా' తో చెప్పారు. "ఎంబీఏ ఫైనల్ ఇయర్‌లో ఉన్నప్పుడు సివిల్స్‌కు ప్రిపరేషన్ మొదలు పెట్టా. ఆ తర్వాత ఏడాది పాటు జాబ్ చేశా. ప్రిలిమ్స్ తర్వాత సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి మెయిన్స్ రాశా. ఐఏఎస్ అవ్వాలనేది నా లక్ష్యం. సెలెక్టైతే చాలనుకున్నా. కానీ 100లోపు ర్యాంకు వస్తుందని మాత్రం అసలు ఊహించలేదు. నాన్న కన్‌స్ట్రక్షన్ ఫీల్డ్‌లో పనిచేస్తారు. అమ్మ గృహిణి. నాన్నకు తెలిసిన కొందరు ఐపీఎస్‌లు, ఐఏఎస్‌లను కలవడం, ఇతరుల గైడెన్స్‌తో పాటు కొన్ని స్టాండర్డ్ సోర్సులు నాకు బాగా ఉపయోగపడ్డాయి. నాకు చాలా ఆలోచనలు ఉన్నాయి. ముఖ్యంగా వికలాంగుల కోసం, ఆరోగ్య రంగంపై పనిచేయాలని ఉంది" అని అన్నారు.

సివిల్స్ ర్యాంకులు పొందిన తెలుగు విద్యార్థులు

దోనూరు అనన్యరెడ్డి మూడో ర్యాంకు, నందాల సాయికిరణ్ 27వ ర్యాంకు, మెరుగు కౌశిక్ 82వ ర్యాంకుతోపాటు పెంకీసు ధీరజ్‌రెడ్డి 173, జి అక్షయ్‌దీపక్ 196, గణేశ్న భానుశ్రీ లక్ష్మీ అన్నపూర్ణ 198, నిమ్మనపల్లి ప్రదీప్‌రెడ్డి 382, బన్న వెంకటేశ్ 467, కడుమూరి హరిప్రసాద్‌రాజు 475, పూల ధనుష్ 480, కె శ్రీనివాసులు 526, నెల్లూరు సాయితేజ 558, కిరణ్ సాయింపు 568, మర్రిపాటి నాగభరత్ 580, పోతుపురెడ్డి భార్గవ్ 590, వద్యావత్ యశ్వంత్ నాయక్ 627, కె అర్పిత 639, ఐశ్వర్య నెల్లిశ్యామల 649, సాక్షికుమారి 679, చౌహాన్ రాజ్‌కుమార్ 703, గాదె శ్వేత 711, వి ధనుంజయ్‌కుమార్ 810, లక్ష్మీబానోతు 828, ఆదా సందీప్‌కుమార్ 830, జె రాహుల్ 873, హనిత వేములపాటి 887, కె శశికాంత్ 891, కెసారపు మీన 899, రామూరి సాయి అలేఖ్య 938, గోవద నవ్యశ్రీ 995 ర్యాంకులను సాధించారు.

సివిల్ టాపర్స్‌కు సీఎం అభినందనలు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీపీఎస్సీ) 2023 ఫలితాల్లో మెరిసిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సీఎం కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఈసారి 50 మందికి పైగా సివిల్ సర్వీసెస్‌కు ఎంపికవడం పట్ల సీఎం ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించిన పాలమూరుకు చెందిన దోనూరి అనన్య రెడ్డికి సీఎం ప్రత్యేక అభినందనలు తెలిపారు

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మహిళా సంక్షేమానికి పెద్ద పీట

- అవినీతికి పాల్పడినట్టు రుజువులుంటే చూపించాలి : మహిళా సదస్సులో చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి
- ఎన్నికల తర్వాత ఆరు గ్యారంటీలు అమలు : రంజిత్‌రెడ్డి సతీమణి, టీటీడీ బోర్డు సభ్యులు సీతారెడ్డి



నవతెలంగాణ-శంషాబాద్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పెద్దషాపూర్ గ్రామంలోని ఎస్వీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన మహిళా సదస్సులో ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి మాట్లాడారు. తాను అవినీతికి పాల్పడినట్టు రుజువులుంటే చూపించాలని ప్రతిపక్ష నాయకులకు సవాల్ విసిరారు. రాముని పేరు చెప్పి బీజేపీ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని ఎవరైనా కలవాలంటే అపాయింట్‌మెంట్ తీసుకోవాలని, కానీ తాను ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశానని తెలిపారు. కాంగ్రెస్ మాత్రమే మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తుందని అన్నారు. మహిళ విద్యావంతురాలైతే సమాజంలో వెలుగు వస్తుందని, కుటుంబం అభివృద్ధి పథంలో పయనిస్తుందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఆరు గ్యారంటీల అమలుకు చర్యలు తీసుకుంటుందని అన్నారు. బహదూర్‌గూడ, పెద్ద గోల్కొండ, కొత్వాల్ గూడ, ఘాన్సీ మియాగూడ గ్రామాల రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించడానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. తనను ప్రజలు ఆశీర్వదించి చేవెళ్ల ఎంపీగా గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధితోపాటు స్వచ్ఛంద కార్యక్రమాలు కూడా చేయనున్నట్టు చెప్పారు.

ఎన్నికల తర్వాత సంక్షేమ పథకాలు అమలు : టీటీడీ బోర్డు సభ్యులు గడ్డం గీత

ఎన్నికల కోడ్ కారణంగా అమలుకు నోచుకోని ఆరు గ్యారంటీలలో మిగతా పథకాలన్నింటినీ ఎన్నికల తర్వాత తప్పకుండా అమలు చేస్తామని టీటీడీ బోర్డు సభ్యులు గడ్డం గీత అన్నారు. కాంగ్రెస్ ద్వారానే మహిళా సాధికారత సాధ్యమని తెలిపారు. నారి న్యాయ్ పేరుతో దేశవ్యాప్తంగా ఐదు అద్భుత గ్యారంటీలను కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో ప్రకటించిందన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి చేతి గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో రంజిత్ రెడ్డిని గెలిపించాలని కోరారు.

ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న పాటలతో సభా ప్రాంగణం మార్మోగిపోయింది. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కస్తూరి నరేందర్, మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్, మండల ప్రధాన కార్యదర్శి చిలకమర్రి మహేందర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు కోటేశ్వర్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి జిల్లా ఆనంద్, పెద్ద షాపూర్ మాజీ సర్పంచ్‌లు కామోని భాయి లక్ష్మయ్య, చెక్కల చంద్రశేఖర్, యాటకారి సిద్దేశ్వర్, హస్లీ రాములు, జిల్లా మహిళా అధ్యక్షులు మైలారం సులోచన, కవ్వగూడ ఎంపీటీసీ సంగీత సిద్దేశ్వర్, గోవర్ధన్, సురేష్ నాయక్, కె.యాదిరెడ్డి, కె.వెంకటేష్‌గౌడ్, జీవన్ గౌడ్, లక్ష్మయ్య, అంజయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి ఓ గజిని

- ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తారా? రాజీనామా చేస్తారా?
- జీవో 36 జారీలో అవినీతి : బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గజిని అనీ, ఆయన ఎప్పుడేం మాట్లాడుతారో అర్థం కాని పరిస్థితి నెలకొందని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జీవో నెంబర్ 36పై తాను ఆధారాలను బయటపెట్టినా కాంగ్రెస్ నేతలెవ్వరూ మాట్లాడలేదనీ, దీనినిబట్టే అందులో ఎంతో అవినీతి జరిగిందన్న విషయం అర్థమవుతున్నదని చెప్పారు. ఆ జీవోపై ఆధారాలతో సహా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ల్యాండ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ప్రధాన కార్యదర్శికి కాపీలు పంపిస్తున్నామని తెలిపారు. ఆ భూమిలో ఆస్పత్రి పెట్టి ప్రజల కోసం నడిపించివచ్చునని సూచించారు. రేవంత్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకున్నదన్నారు. అందుకే రైతుల మీద ప్రేమ పుట్టుకొచ్చి డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని ప్రకటించారని చెప్పారు. మళ్లీ బూటకపు మాటలను మోసం చేసేందుకు సన్నద్ధమయ్యారని విమర్శించారు. రైతు రుణ మాఫీకి 35వేల కోట్లు కావాలనీ, రైతు డిక్లరేషన్ అమలు చేయాలంటే రూ.80 వేల కోట్ల అవసరమని చెప్పారు. బడ్జెట్‌లో కేటాయించిన రూ.19 వేల కోట్లతో ఇవన్నీ ఎలా సాధ్యమవుతాయని ప్రశ్నించారు. నిధులు ఎక్కడ నుంచి తెస్తారని అడిగారు. ఎన్నికల సభల్లో రేవంత్‌రెడ్డి మైకు దొరికితే చాలు బాలకృష్ణ, ఎన్టీఆర్ డైలాగులు కొడుతున్నారని విమర్శించారు. రైతు డిక్లరేషన్ చేస్తావా? పదవికి రాజీనామా చేస్తావా ? అనేది ఆయన తేల్చుకోవాలన్నారు. తెలంగాణలో ఐదు ఎంపీ సీట్లను కూడా గెలిచే అవకాశం కాంగ్రెస్‌కు లేదన్నారు. ఇంటెలిజెన్స్ రిపోర్టు ఉంది కాబట్టే డమ్మీ అభ్యర్థుల గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆగస్టు 15 న రుణ మాఫీ చేస్తావా? రాజీనామా చేస్తావా? చెప్పాలని ప్రశ్నించారు. ఓటుకి నోటు కేసులో జైలుకెళ్లినా అది బీజేపీ పనే అని రేవంత్‌రెడ్డి అంటారని విమర్శించారు.

వడదెబ్బతో ఇద్దరు మృతి



నవ తెలంగాణ - నవీపేట్/హుస్నాబాద్ రూరల్

వడదెబ్బ తగిలి ఇద్దరు మృతిచెందిన ఘటనలు నిజామాబాద్, సిద్దిపేట జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండల కేంద్రానికి చెందిన ఉపాధి కూలీ ర్యాగల్ల లావణ్య అలియాస్ లక్ష్మి నర్సమ్మ(42) రోజులాగే సోమవారం ఉపాధి పనుల నిమిత్తం లింగమయ్య గుట్ట చెరువులో పూడికతీత పనులకు వెళ్లింది. అక్కడ ఎండ తీవ్రత కారణంగా వాంతులు, విరేచనాలు అవడంతో సోమసిల్లి పడిపోయింది. అదే సమయంలో గుండెపోటు రావడంతో తోటి కూలీలు భర్త రాజశేఖర్ (ఆర్ఎంపీ)కి ఫోన్ చేయగా అతను వచ్చి సీపీఆర్ చేసి 108లో జిల్లా కేంద్రంలోని ప్రయివేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. చికిత్స చేస్తుండగా పరిస్థితి విషమించి ఆమె మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కి చెందిన గుళ్ళ ఎల్లయ్య (52) పోస్ట్‌మెన్‌గా పనిచేస్తున్నారు. సాగా సోమవారం విధులు నిర్వహించిన పోస్ట్‌మెన్ ఎల్లయ్య ఎండ తీవ్రతకు వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉందని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దాంతో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించగా, పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందారు. మృతునికి భార్య శ్రీమతి, కొడుకు, కూతురు ఉన్నారు. తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

కంటికి రెప్పలా కాదు..

- కంట్లో పెట్టుకొని చూసే హీనుడు 'కడియం'
- పసిపిల్లల నోటి బుక్క లాక్కున్న రాబంధు
- ఖల్ నాయక్ నిజాయితేమిటో ప్రజలకు వివరిస్తా : మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

కార్యకర్తలను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన వాడే కంట్లో పెట్టుకుని చూసుకునే వాడని, తనకు కాకుండా పక్కన వారికి మర్యాద దక్కితే ఓర్వకుండా, పగ పెంచుకొని అనేక రకాలుగా బాధపెట్టే వాడని, నీచుడు, దుర్మార్గుడని కడియం శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఘాటు విమర్శలు చేశారు. వరంగల్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ గెలుపు కోసం జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్‌లో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడియంపై రాజయ్య తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. బెదిరించడం, భయభ్రాంతులకు గురి చేయడంలో కడియం శ్రీహరిని మించిన వారు లేరని ఆరోపించారు. ఎంపీ, ఉపముఖ్యమంత్రి, రెండుసార్లు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పదవి కూడా లాక్కున్నారని అన్నారు. కడియంను మేధావి అనుకునేవారికి చెంపలేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. 1994 నుంచి 2004 వరకు నియోజకవర్గంలో ఓ గ్రామ సర్పంచ్ జన్మభూమికి సహకరించకపోతే జాఫర్ ఘడ్ గుట్టల్లో కొట్టించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 1999లో ఖల్ నాయక్ అని కడియంపై పుస్తకం వచ్చిందని, 1994లో టీచర్స్ కాలనీలో ఉన్న కడియం ఇల్లు చూస్తే.. గచ్చు నేల, కిటికీలకు గోనె సంచులు, తెగిపోయిన చెప్పులతో, మాసిన గడ్డం వేసుకొని పేకాట ఆడుతూ పట్టుబడి పోలీస్ స్టేషన్‌లో కూర్చున్న చరిత్ర కడియం శ్రీహరిదని అన్నారు. కడియం ఒక్కసారైనా మాదిగ, బైండ్ల గురించి మాట్లాడారా? అలా మాట్లాడారని నిరూపిస్తే తాను ప్రత్యక్ష రాజకీయాల్లో ఉండనని సవాల్ విసిరారు. దళిత ద్రోహిగా, ఆనాడే దళిత దొరగా కడియంను పిలిచేవారని గుర్తు చేశారు. దేవనూరులో భూములు, ఆర్మీచర్ ప్లాంట్, పెట్రోల్ బంక్ ఎక్కడివని ప్రశ్నించారు. పార్టీకి, నియోజకవర్గానికి కడియం చేసిందేమీ లేదని, పైగా అవినీతిలో పూర్తిగా కూరుకుపోయారని తెలిపారు. ఇంతచేసినా తన బిడ్డకు కేసీఆర్ టికెట్ ఇచ్చారని, అయినా పార్టీ మారడానికి సిగ్గుండాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో డైపర్ పెట్టుకుని తిరిగిన నువ్వు.. ఇప్పుడు ఏం పెట్టుకొని తిరుగుతావో చూస్తానని అన్నారు. అందరితో ఆత్మీయత పంచుకునేందుకు గడపగడపకు వస్తానని, బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌ను గెలిపించుకునే వరకు.. తగ్గేదేలేదంటూ సవాల్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్‌కు స్థానం లేదు

- మతిభ్రమించి కేసీఆర్, కేటీఆర్ అసత్యాలు
- రఘువీర్ రెడ్డిని లక్ష మెజార్టీతో గెలిపించాలి
- రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయం : మిర్యాలగూడలో పార్లమెంట్ కాంగ్రెస్ సన్నాహక సమావేశంలో ఉత్తమ్, కోమటిరెడ్డి, జానారెడ్డి



నవతెలంగాణ- మిర్యాలగూడ

"బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పికొట్టేందుకు సిద్ధమయ్యారు.. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తోంది.. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయం.. తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్‌కు స్థానం లేదు.. కేసీఆర్, కేటీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారు" అని భారీ నీటిపారుదల, సివిల్ సప్లై శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ సీఎల్పీ నేత జానారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని ఎన్ఎస్పీ క్యాంపులో మంగళవారం నిర్వహించి నియోజకవర్గస్థాయి పార్లమెంట్ సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ఈ ఎన్నికల్లో మోడీ ఓడిపోతారన్న భయంతోనే 400 సీట్లు గెలుస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో బీజేపీకి స్థానం లేదని, బీఆర్ఎస్ ప్రజలకు దూరమైందని.. ఆ పార్టీల పట్ల ప్రజల్లో నమ్మకం సన్నగిల్లిందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అత్యధిక పార్లమెంట్ స్థానాలు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం రూపాయి పని కూడా చేయలేదని, ఒక ఇల్లు కూడా నిర్మించి ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్ర విభజన హామీలను మోడీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పని ఖతం అయిందని చెప్పారు. ఎమ్మెల్సీ కవిత జైలుకు పోవడంతో తండ్రి కేసీఆర్, సోదరుడు కేటీఆర్‌కు మతిభ్రమించి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలోకి పోతారని అసత్యపు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. పొద్దున లేచింది మొదలు రాత్రి వరకు రేవంత్ రెడ్డిని, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. కుర్చీ వేసుకుని కూర్చుని జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్న కేసీఆర్.. ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ఆ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేనందున మానసిక స్థితి కోల్పోయి అవాకులు చవాకులు పేల్చుతున్నారని అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఒక్క పని కూడా చేయలేదు కానీ ఇప్పుడు అహంకారంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని తెలిపారు.జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, మిర్యాలగూడ నియోజకవర్గంలో త్వరలోనే అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి రఘువీర్ రెడ్డిని లక్ష మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జై వీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భారతీ రాగ్యా నాయక్, ఎంపీ అభ్యర్థి కుందూర్ రఘువీర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శంకర్ నాయక్, నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

‘సేవలో భాగంగా ముగ్గురి అనాథల చేరదీత’



నవతెలంగాణ-బడంగ్ పేట్

సమాజ సేవలో భాగంగా ముగ్గురు అనాథలను చేరదీసినట్టు మాతృ దేవోభవ అనాథ ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు గట్టు గిరి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ గ్రామ నివాసులు, అబాకస్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ అడ్వైసర్స్ సీఓ మర్రి శశాంక్ రెడ్డి ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్ ప్రాంతంలో మతి స్థిమితం లేని ముగ్గురు ఆశ్రమంలో చేరుకున్నట్టు పేర్కొన్నారు. మానవ సేవే మాధవ సేవగా భావించి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉంద న్నారు. మర్రి శశాంక్ రెడ్డి అనాథలకు భవిష్యత్‌లో తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు.

శానిటేషన్ వర్కర్ మృతదేహానికి మేయర్ నివాళి



నవతెలంగాణ - బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ గ్రామానికి చెందిన శానిటేషన్ వర్కర్ అంజ రాజు మంగళవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అక్కడికి చేరుకొని అతని మృత దేహానికి నివాళులర్పించారు. తర్వాత మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి.రఘు, ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, ఎర్ర జైహింద్, మేనేజర్ నగేష్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫిల్లింగ్ స్టేషన్లను పరిశీలించిన ఎండీ



జలమండలి ఉన్నతాధికారులతో ఎండీ టెలీ కాన్ఫరెన్స్

నవతెలంగాణ - సిటీబ్యూరో

నగరంలో నీటి సరఫరాపై జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి ఆరా తీశారు. నారాయణగూడ, చిలకలగూడలో ఉన్న ఫిల్లింగ్ స్టేషన్స్ పరిశీలించారు. లాగ్ బుక్స్, నీటి సరఫరా వివరాల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జలమండలి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ కాన్ఫరెన్స్‌లో డివిజన్ల వారీగా ట్యాంకర్ల బుకింగ్స్, డెలివరీ, పెండెన్సీ, పర్యవేక్షణ, అదనపు ట్యాంకర్లు, రోజువారీ, రాత్రి వేళల్లో సరఫరా చేసే ట్రిప్పులు, నీటిసరఫరా, అదనపు జలాల కేటాయింపు తదితర అంశాలపై ఎండీ సమీక్షించారు. డివిజన్ల వారీగా వివరాల్ని అడిగి తెలుసుకున్నారు. ట్యాంకర్ ట్రిప్పులు, నీటి సరఫరాలో ఎదురయ్యే సమస్యల గురించి ఆరా తీశారు. నీటి సరఫరాలో ప్రెజర్ సమస్యలు ఎప్పటి కప్పుడు పరిష్కరించుకోవాలన్నారు. ట్యాంకర్ డెలివరీలో ఆలస్యం లేకుండా చూడాలని ఒకవేళ ఆలస్యమైతే వినియోగదారులకు సందేశం పంపించాలన్నారు.

మహిళల రక్షణే షీ టీం లక్ష్యం : తరుణ్ జోషి



నవతెలంగాణ - హయత్ నగర్

మహిళల రక్షణే షీ టీం లక్ష్యం అని రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి అన్నారు. రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఈవ్ టీజర్లకు మంగళవారం రాచకొండ క్యాంప్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తరుణ్ జోషి మాట్లాడుతూ 15 రోజుల్లో 122 మంది ఆకతాయిలను రాచకొండ షీ టీమ్స్ పట్టుకుందన్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో మహిళలను, యువతులను వేధింపులకు గురిచేస్తున్న 122 (మేజర్స్-79, మైనర్స్-43) మందిని షీ టీమ్స్ పట్టుకున్నారని వెల్లడించారు. వారికి ఎల్బీనగర్ సీపీ క్యాంప్ కార్యాలయంలో (ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆఫీసు)లో కౌన్సిలర్స్‌తో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చినట్టు పేర్కొన్నారు. గత నెల 16 నుండి 31 వరకు షీ టీమ్స్ రాచకొండ మొత్తం 37 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, దాదాపు 5875 మందికి మహిళా చట్టాలు, వారి యొక్క హక్కులు, నేరాల గురించి వివరించి అవగాహన కల్పించినట్టు తెలిపారు. ఆడవారికి ఎదురయ్యే భౌతిక పరమైన, సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే దాడులు, లైంగిక వేధింపులు, ప్రయాణ సమయాల్లో వేధింపులు వంటి ఇబ్బందుల నుంచి రక్షించేందుకు రాచకొండ పోలీసులు ఇరవై నాలుగు గంటలూ అందుబాటులో ఉంటున్నారని పేర్కొన్నారు. పురుషులు, సాటి ఆడవారి పట్ల బాధ్యతగా, మర్యాదగా నడుచుకోవాలని, వారికి అండగా నిలవాలని, పలు రకాల అవసరాలతో ఇంటి నుంచి బయటకు వచ్చే స్త్రీలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకూడదన్నారు. మహిళలు వేధింపులకు గురైనప్పుడు వెంటనే షీ టీమ్స్ ,రాచకొండ వాట్సాప్ నెంబర్ 8712662111 ద్వారా , లేదా ప్రాంత షీ టీమ్ అధికారుల నంబర్లు -భువనగిరి ఏరియా 8712662598, చౌటుప్పల్ ఏరియా - 8712662599, ఇబ్రాహీంపట్నం ఏరియా -8712662600, కుషాయిగూడ ఏరియా -8712662601, ఎల్బీనగర్ ఏరియా -8712662602, మల్కాజిగిరి ఏరియా -8712662603, వనస్థలిపురం ఏరియా -8712662604లకు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ ఉషా విశ్వనాథ్, ఏసీపీ వెంకటేశం, అడ్మిన్ ఎస్ఐ రాజు, షీ టీమ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హక్కులు అందరికీ అందుబాటులో ఉండాలి

- జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ డి.మనోహర్ ములే



నవతెలంగాణ - చైతన్యపురి

స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం భారత రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు, వాగ్దానాలు వికలాంగులతో సహా అందరికీ అన్ని వేళలా అవి అందుబాటులో ఉండాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ డి. మనోహర్ ములే అన్నారు. మానస చిన్నారుల ఆరోగ్య వైకల్యాల అధ్యయన సంస్థలో ‘దివ్యాంగుల మానవ హక్కుల పరిరక్షణ’ అనే అంశంపై మంగళవారం జరిగిన సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమ్మిళిత సమాజం, వైవిధ్య భరిత సమాజం గురించి చాలా చర్చలు జరుగుతున్నాయని, అవి రోజువారీ దిన చర్యలలో తప్పనిసరిగా ప్రతిబింబించాలని అన్నారు. దివ్యాంగుల హక్కుల ఉల్లంఘన, వారికి జరిగిన అన్యాయాల గురించి జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదులు పెద్దగా అందడం లేదని, అయితే దేశంలో ప్రతి విషయం సవ్యంగా ఉందని అర్థం కాదని అన్నారు. అన్యాయానికి గురైన దివ్యాంగులకు ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం అందుబాటులో ఉందని తెలియక పోవడం ఓ కారణమన్నారు. పౌరులందరూ దివ్యాంగుల హక్కుల పరిరక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అన్యాయం లేదా చట్టపరమైన హక్కుల ఉల్లంఘన ఎవరైనా దృష్టికి వస్తే, మానవ హక్కుల కమిషన్ వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు ఎస్.విజయభారతి, న్యాయశాస్త్ర ప్రొఫెసర్ జి.బి. రెడ్డి , డాక్టర్ ఆర్. అనిత, మానస కోశాధికారి టి.మదన్ మోహన్ రెడ్డి, పి.వనజ, బి.గీత, కె.వెంకమ్మ, డా.బి.దినేష్ కుమార్, సివి సుబ్బారావు, రామచంద్ర విష్ణుభట్ల, ఎం.కృష్ణ చైతన్య, కె. సుమతి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి డీసీసీబీ చైర్మెన్ కొత్తకుర్మ సత్తయ్య





నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్‌లో బీఆర్ఎస్ పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. తుర్కయంజాల్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీలో బలమైన నాయకుడిగా పేరు తెచ్చుకున్న డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య బీఆర్ఎస్ పార్టీకి, సభ్యత్వానికి రాజీనామా చేశారు. మంగళవారం తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డిలు ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని నమ్మి బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. మధ్యాహ్నం సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తకుర్మ మంగమ్మ శివకుమర్, నోముల కృష్ణ గౌడ్, గుండ్లపల్లి ధనరాజ్, కోసిక ఐలయ్య, పుల్లగుర్రం విజయానంద్ రెడ్డి, గుండా ధన్ రాజ్, రెవల్లే యాదగిరి, మేతరి దర్శన్, సుజాత అలీ, తాడిచెట్టు అశోక్ గౌడ్, సామ భీమ్ రెడ్డి, బారు శ్రీనివాస రావు(బొగ్గు శ్రీను), కొల్లూరి నిరంజన్ రెడ్డి, మేతరి శంకర్, చేగురి వెంకటేష్ పాల్గొన్నారు.

చంపాపేట్‌లో
కార్పొరేటర్ మధుసూదన్ రెడ్డి పర్యటన

నవతెలంగాణ - సంతోష్‌నగర్

చంపాపేట్ డివిజన్ మారుతీ నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న స్టామ్ వాటర్ డ్రైన్స్ పనులను (వరదనీటి కాల్వ పనులు) జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, చంపాపేట్ డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మారుతీ నగర్ కాలనీ వరద నీటి నివారణ కోసం స్టామ్ వాటర్ డ్రైన్ పనులు చేపట్టినట్లు తెలిపారు. మారుతీ నగర్ రోడ్డు నెంబర్ 1 స్ట్రీట్ 13 నందు వర్షాలు కురిసినప్పుడు వర్షపు నీరు ఇండ్లలోకి ప్రవేశించడం జరుగుతుందన్నారు. అందుకే 2 ఫీట్ స్టామ్ వాటర్ డ్రైన్ నిర్మాణం పనులను దాదాపు 300 మీటర్ల వరకు పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. మారుతీనగర్ కాలనీ శివ రెడ్డి రెసిడెన్సీ నుండి మారుతీ నగర్ కాలనీ రోడ్ నెంబర్ మీదుగా రాజిరెడ్డి నగర్ కాలనీ కాకతీయ స్కూల్ వరకు బాక్స్ డ్రైన్స్ పనులు సకాలంలో పూర్తి అయితే వరదముంపు నుండి పూర్తి విముక్తి లభిస్తుందన్నారు. చంపాపేట్ డివిజన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యం అని అన్నారు. కాలనీ సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, వాటర్ వర్క్స్ మేనేజర్ రమ్య భారతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు, కాలనీ జనరల్ సెక్రెటరీ జి.శ్రీనివాస్ రెడ్డి, కాలనీ సభ్యులు ఆనంద్, రాజు, రవీందర్, పతాంజలి శ్రీనివాస్, కోటేశ్వరరావు, సుజీవన్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ - హయత్‌నగర్

ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ దయాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఎల్బీనగర్‌లోని ఎస్ బీ హెచ్ కాలనీలో హరి అదవిలత, హరి రవి కుమార్‌లు దంపతులు నివాసం ఉంటున్నారు. గత కొంత కాలంగా రవి కుమార్(49) క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయాడు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవ్వడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేస్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హయత్‌నగర్ 2 డిపోలో అంబేద్కర్ జయంతి



నవతెలంగాణ - హయత్‌నగర్

అంబేద్కర్ 133వ జయంతిని పురస్కరించుకొని హయత్ నగర్ 2 డిపోలో ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ నిర్వహించిన వేడుకలకు ఆర్టీసీ జీహెచ్‌జడ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం వలనే మనం ఇప్పుడు సంతోషంగా జీవిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జోన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, హయత్‌నగర్ సహాయ రీజినల్ మేనేజర్ సుచరిత, 1,2 డిపో మేనేజర్లు శ్రీనివాస్, విజయ్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు యాదయ్య, శ్రీనివాస్, బుద్ధవిషల్ డిపో కమిటీ సభ్యులు శ్రీనివాస్, నర్సింహ, మైసయ్య, యాదగిరి స్వామి, సోమేశ్వర్ పాపారావు, రామకృష్ణ శంకర్ నాయక్, నెహ్రూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

‘ఓల్డ్ మలక్‌పేట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా’



నవతెలంగాణ - సంతోష్ నగర్

ఓల్డ్ మలక్‌పేట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ ఎండీ సైఫుద్దీన్ షఫీ అన్నారు. డివిజన్ పరిధిలోని కాలనీ పరిసర ప్రాంతాలను ఆయన మంగళవారం పరిశీలించి మాట్లాడారు. డ్రైనేజీ, తాగునీటి సరఫరా, సీసీ రోడ్లు, స్థానిక సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీ అధికారులదే అని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని డ్రైనేజీ మరమ్మతులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని కోరారు. డివిజన్ పరిధిలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. శ్రీరామ నవమి పండుగ సందర్భంగా డివిజన్ ఆవరణలో భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్పొరేటర్ వెంట కాలనీ సభ్యులు, సీనియర్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డ
పెండ్లికి పుస్తె మెట్టెల బహూకరణ



నవతెలంగాణ- అబ్దుల్లాపూర్‌మెట్

పేదింటి ఆడబిడ్డ వివాహానికి ఇబ్రహీంపట్నం పట్నం దండెం మాధవి రాంరెడ్డి పుస్తె మెట్టలు బహూకరించి..తన ఉదారతను చాటుకున్నారు. ఈ మేరకు మంగళవారం దండెం మాట్లాడుతూ పేదరికంలో ఉన్న వారిని ఆదరించి, తన తల్లిదండ్రులు కీ.శే. దండెం యాదమ్మ, నారాయణరెడ్డిల చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు పేదలకు అన్ని విధాలుగా వెన్నంటి ఉంటానని భరోసా ఇచ్చారు. తుర్కయంజాల మున్సిపల్ కార్యాలయంలో స్వీపర్‌గా విధులు నిర్వహించే కార్మికురాలికి ఐదుగురు సంతానం... ఇటీవల ఆమె భర్త మృతిచెందారని చెప్పారు. దీంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె కూతురు అనుషా వివాహం ఈ నెల 19న నిశ్చయించడంతో స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. వెంటనే స్పందించి అనుషా వివాహానికి పుస్తె మెట్టెలు అందజేసినట్టు తెలిపారు. ఆయన వెంట పండుగుల రాము, పండుగుల సత్యనారాయణ, పండుగుల పోశయ్య, పండుగుల సుమలత తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్యేకు వినతి





నవతెలంగాణ - నాగోల్

కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ నాగోలు డివిజన్‌లోని అయ్యప్ప కాలనీవాసులు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ని అయ్యప్ప కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి అయ్యప్ప కాలనీలో నూతనంగా నిర్మించిన బాక్స్ డ్రైనేజీ నిర్మాణంతో కాలనీలో ఉన్న పైపులైన్లు పగిలి పోవడం జరిగి ందని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ సందర్భ ంగా కాలనీవాసులు మాట్లాడుతూ ఇరవై ఏండ్ల కిందట అప్పటి జనాభాకనుగుణంగా 6 ఇంచుల పైప్ లైన్లు వేశా రని గుర్తుచేశారు. కాలనీలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభా వలన డ్రైనేజీ ప్రవాహంతో పైపులు కూడా పగిలిపోయాయని, దీంతో మాన్యువల్స్‌లలో కూడా మట్టి చేరి డ్రైనేజీ మురుగు నీరంతా రోడ్లపై ప్రవహిస్తుందని తెలిపారు. దాదాపు 600 కాలనీలలో నుండి వచ్చే డ్రైనేజీ, వర్షపు నీరు ఇక్కడకు వచ్చి చేరడంతో అవుట్ ఫ్లో లేని కారణంగా చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, దీంతో అనారోగ్యాల బారిన పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కాలనీపై దృష్టి సారించి వెంటనే తగిన నిధులను మంజూరు చేయించి నూతన పైపులైన్లు, మ్యాన్ హెూల్స్‌లను, రోడ్ల నిర్మాణ పనులను చేపట్టి సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ అయ్యప్ప కాలనీ సమస్యలపై ఇప్పటికే ఎన్నోసార్లు సంబంధిత అధికారులతో మాట్లాడడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల కోడ్ దృష్ట్యా అధికారులంతా ఎన్నికల హడావుడిలో ఉన్నారని, ఎన్నికల అనంతరం తప్పకుండా అయ్యప్ప కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప కాలనీవాసులు నరసింహాచారి, రవికాంత్ శర్మ, సుదర్శన్, గోపాల్, కాలనీ మహిళలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వ పథకాలే రంజిత్ రెడ్డిని గెలిపిస్తాయి’



నవతెలంగాణ - ఎల్బీనగర్

మహేశ్వరం నియోజవర్గం పరిధిలోని సరూర్‌నగర్ డివిజన్ అశోక ఫంక్షన్ హాల్లో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య నాయకుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ప్రజలు దేశవ్యాప్తంగా పదేండ్ల బీజేపీ, బీఆర్ఎస్ దోపిడీ పాలనతో విసిగిపోయారని తెలిపారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు మహాలక్ష్మి, రైతు భరోసా, ప్రతి కుటుంబానికి 200 ఉచిత విద్యుత్, యువ వికాసం హామీలను నెరవేర్చిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. చేవెళ్ల పార్లమెంట్ నుంచి మన గడ్డం రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, టీపీసీసీ నిజాముద్దీన్, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత నరసింహారెడ్డి, మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, డివిజన్ బోయిన్ శంకర్ యాదవ్, యువజన ధనరాజ్ గౌడ్, మహిళ అధ్యక్షురాలు అరుణ, బీర బాలకృష్ణ, చిక్కుల శివ ప్రసాద్, నందీగామా నర్సింహ, గంగం కిశోర్ కుమార్, జంగారెడ్డి, ఇమ్రాన్, జావిద్, రమేష్ గౌడ్, మల్లేష్, పులి గౌడ్, సుధాకర్ గౌడ్, షఫీ, మణికంఠ భాస్కర్ నాగరాజ్, జనార్ధన్ గౌడ్ సంగీత, శైలజ, సుశీల మైనార్టీలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ జీ.రంజిత్ రెడ్డిని గెలిపిస్తాయని టీపీసీసీ కార్యదర్శి, కంటెస్టెంట్ ఎమ్మెల్యే ఎల్మేటీ అమరేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డిలు ఆశాభావం వ్యక్తం చేశారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్‌గూడ ఎస్ వై ఆర్ పంక్షన్ హాల్లో మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం కాంగ్రెస్ ముఖ్య నాయకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను గెలిపించటానికి సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టీపీసీసీ నియోజకవర్గం ఇంచార్జి నిజాముద్దీన్, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, దేప భాస్కర్ రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, సీనియర్ నాయకులు బంగారు సత్యనారాయణ, నవారు మల్లారెడ్డి, బాల్ లింగని జంగయ్య, రాఘవేందర్ రెడ్డి, గట్టు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



యువజన కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా సంతోష్‌రెడ్డి



నవతెలంగాణ-కాప్రా

యువజన కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నాచారానికి చెందిన సంతోష్ రెడ్డి నియామకం అయ్యారు. మంగళవారం రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేయాలన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో సైనికుల్లా పనిచేసి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేసేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మామిడాల సంతోష్‌రెడ్డి కుటుంబం 40 ఏండ్లుగా కాంగ్రెస్‌లో పని చేస్తుందన్నారు. వారి కుటుంబ సేవలను గుర్తించి యువజన కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీగా నియమించినట్టు తెలిపారు. తనకు గుర్తింపు ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులుశివసేనారెడ్డి, ఉప్పల్ ఇన్‌చార్జి పరమేశ్వరెడ్డిలకు సంతోష్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి అన్నారు. మంగళవారం పార్లమెంట్ ఎలక్షన్ - 2024 స్వీప్ కార్యక్రమంలో భాగంగా "ఓటు హక్కును సద్వినియోగం అనే థీమ్‌పై జల్‌పల్లి మున్సిపాలిటీలో ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మరాఠా భవన్‌లో ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిచారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ కమిషనర్, మేనేజర్ సుదర్శన్, వివిధ శాఖల అధికారులు, వార్డు ఆఫీసర్స్, సానిటేషన్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, కార్యాలయ సిబ్బంది నూతన ఓటర్లు పాల్గొన్నారు. అనంతరం మరాఠా భవన్ నుంచి జల్‌పల్లి బస్‌స్టాప్ వరకు ర్యాలీ నిర్వహించారు.

చలాన్ల పేరుతో వేధింపులు సరికాదు



- తెలంగాణ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్

నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ సర్కిల్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు చలాన్ల పేరుతో వేధింపులకు గురి చేస్తున్నారని తెలంగాణ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గోపాల్ రెడ్డి అన్నారు. తమ సమస్యను పరిష్కరించాలని తెలంగాణ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉప్పల్ ట్రాఫిక్ డీసీపీ, ఏసీపీ లకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులకు ట్రాఫిక్ పర్మిషన్ అవసరం లేదని పేర్కొన్నారు. తెలంగాణలో మొత్తం ఒక్క సీటుకు రూ.1120 టాక్సీ కట్టినా చలాన్‌లు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సంపాదన చలాన్‌కే సరిపోతోందని వాపోయారు. పోలీస్ పర్మిషన్ కోసం దరఖాస్తు చేసుకుని మూడు నెలలు గడిచినా పర్మిషన్ ఇవ్వకుండా చలాన్లు వేస్తున్నారని తెలిపారు. తమను ఇబ్బందులకు గురిచేస్తే ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలోకొండల్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సైన్స్ శిక్షణా శిబిరం గోడ పత్రిక ఆవిష్కరణ



నవతెలంగాణ-కాప్రా

జనవిజ్ఞాన వేదిక కాప్రా, కీసర, మల్కాజిగిరి మండల కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి సైన్స్ శిక్షణా శిబిరం గోడ పత్రికను ఈటీడీసీ సైంటిస్ట్ కర్రె మల్లేశం ఈసీఐఎల్‌లోని కార్యాలయ ప్రాంగణంలో మంగళ వారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జన విజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న ఈ వేసవి శిక్షణా శిబిరం విద్యార్థులకు ఎంత ఉపయోగ కరంగా ఉంటుందన్నారు. విద్యార్థులు తమ సబ్జెక్టులను బట్టిపట్టే విధానానికి ఎలా స్వస్తి పలకాలో నేర్పిస్తారని తెలిపారు. బాబాలు చిన్న చిన్న సైన్స్ ట్రిక్స్‌ను ఉపయోగించి ప్రజలను ఎలా మోసం చేస్తున్నారనే విషయాలను వివరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కోశాధి కారులు శ్రీనివాస్, జెన్నీ మాట్లాడుతూ.. ఈ వేసవిలో జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కాప్రా మండల పరిధిలో సౌత్ కమలానగర్‌లోని శ్రీమేధా విద్యా మందిర్ హైస్కూల్లో ఈనెల 25వ తేదీ నుంచి వచ్చే నెల నాలుగో తారీఖు వరకు ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ఉచిత వేసవి సైన్స్ శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తు న్నామని తెలిపారు. కుషాయిగూడ, చర్లపల్లి, కాప్రా, కమలానగర్ గాయత్రీ నగర్, మహేష్ నగర్, ఏఎస్‌రావునగర్, మౌలాలి ప్రాంతాల విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంపు వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ :94915 50128, 92465 43662, 89192 04421 సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, శివప్రసాద్, దుర్గాచారి, పాల్గొన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలి : బండారి



నవతెలంగాణ-కాప్రా

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీగా రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం నాచారం డివిజన్‌లో నిర్వహించిన మల్కాజిగిరి పార్ల మెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి జహంగీర్, నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్, డివిజన్ ప్రెసిడెంట్ మేకల ముత్యంరెడ్డి, నాయకులు మల్లికార్జున్‌గౌడ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉప్పల్, నాచారం డివిజన్ నాయకులు, కార్యకర్తలు చాలా ఉత్సాహంగా పని చేస్తారని తెలిపారు. గత ఎన్నికల్లో వచ్చిన మెజార్టీనే అందుకు నిదర్శనం అన్నారు. అనంతరం రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. బండారి గెలుపు కోసం కృషి చేసినట్టుగానే తన గెలుపునకు కృషి చేయాలని కోరారు.

మల్లాపూర్ ఎస్ఎల్ఎన్ఎస్ ఫంక్షన్ హాల్‌లో..



మల్కాజిగిరి ఎంపీగా రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని బీఆర్ఎస్ ఉప్పల్ ఎన్నికల ఇన్‌చార్జి జహంగీర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మల్లాపూర్ డివిజన్ ఎస్ఎల్ఎన్ఎస్ ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, మల్లాపూర్ ప్రధానకార్యదర్శి వాసు తదితరులున్నారు.

మేయర్ శాంతి కోటేష్ గౌడ్‌ను కలిసిన కార్మిక నగర్ వాసులు



- కాలనీ సమస్యలను పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-జవహర్‌నగర్

జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని రెండో డివిజన్ కార్మిక నగర్ కాలనీ ప్రజలు మంద రాజు ఆధ్వర్యంలో మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్‌ను వారి నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా మేయర్ దంపతులను సన్మానించారు. అనంతరం కాలనీలో డ్రయినేజీ, మంచినీటి పైపులైన్లు వేయించాలని, డంపింగ్ యార్డ్ నుంచి మురుగునీరు ఇండ్లలోకి వస్తుందని తెలిపారు. ఆ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన మేయర్ త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి సుజాత, సరస్వతి, స్వప్న, క్రిష్ణ, సోమయ్య, రమేష్, సుధాకర్, రామారావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకలకు ఆలయాలు సిద్ధం

- వెల్లివిరుస్తున్న మతసామరస్యం
- శ్రీరామనవమిపై ప్రత్యేక కథనం



నవతెలంగాణ - జవహర్ నగర్

శ్రీరామనవమి వేడుకలకు హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లోని ఆలయాలు సిద్ధమయ్యాయి. బుధవారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శ్రీరామనవమి పై ప్రత్యేక కథనం

ప్రతీ ఏడాది చైత్ర మాసం శుక్ల పక్ష నవమి రోజున శ్రీరామనవమి అత్యంత భక్తి శ్రద్దలతో జరుపుకుంటారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఆలయాలన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబవుతాయి. బెల్లంతో చేసిన పానకం, వడ పప్పును దేవునికి నైవేద్యంగా సమర్పిస్తారు. విష్ణుమూర్తి ఏడో అవతారంగా త్రేతాయుగంలో రాముడు జన్మించాడని పూర్వీకులు చెబుతారు. పద్నాలుగేండ్ల అరణ్యవాసం, రావణ సంహారం తరువాత శ్రీరాముడు సీతాసమేతంగా అయోధ్యలో పట్టాభిషిక్తుడైనాడు. ఈ శుభ సంఘటన కూడా చైత్ర శుద్ధ నవమి నాడే జరిగిందం టారు. సీతారాముల కల్యాణం కూడా ఈ రోజునే జరిగింద ని చెబుతారు. అందుకు గుర్తుగా ఈరోజు సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపించడం ఆనవాయితీ. దేశమంతటా సీతారామ కల్యాణాన్ని తమ ఇంటిలో వివాహమేనేమో అన్నంత భక్తి శ్రద్ధలతో సంబరంగా భక్తులు జరుపుకుంటారు.

అయితే మానవుడిగా పుట్టిన రాముడు దేవుడిగా ఇన్ని కోట్ల గుండెల్లో కొలువై ఉండటానికి కారణం క్లిష్ట పరిస్థితులలోనూ ఆయన అనుసరించిన ధర్మమే. రాము డు మంచి బాలుడు అంటారు. ఇక రామనవమి రోజున దేవుడికి పసుపు బట్టలు సమర్పించడం శుభప్రదంగా భావిస్తారు. అలాగే అన్నదానం, వస్త్రదానం చేస్తారు.

మత సామరస్యం..

భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనం భారతదేశం. కులాలు, మతాల గోడల్ని చేరిపేస్తూ సాటి మనిషికి సాయపడాలనే సారాంశాన్ని ఇచ్చే ఘటనలు కోకొల్లలు. ముస్లింలు హిందువుల ఆలయానికి, హిందువులు మసీదులకు వెళ్లిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఇలాంటికే శ్రీరామనవమి వేడుకల్లోనూ కనిపిస్తాయి.

తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సత్యనారాయణపురం ప్రాంతంలోని దర్గాలో సర్వమత సామరస్యానికి ప్రతీకగా, గత 40 ఏండ్లుగా హజ్రత్ నాగుల్ మీరా ఉర్సు ఉత్సవాలు జరుపుకుంటున్న దర్గాలో సీతారామ కల్యాణం జరిపిస్తారు. తమ ముస్లిం పండుగల మాదిరిగానే శ్రీరామనవమి వేడుకలను కూడా దర్గా కమిటీ ఘనంగా నిర్వహిస్తోంది. కుల, మత, బేధాలు లేకుండా ఇక్కడ పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ లోని కదిరి మండలం పెద్దపల్లి గ్రామంలో ఆలయ కమిటీ ఇఫ్తార్ విందు నిర్వహించగా, స్థానిక ముస్లింలు శ్రీరామనవమి వేడుకలను ఘనంగా జరుపుకుంటారు. తాజాగా బెంగళూరులో ఓ ముస్లిం వ్యక్తి శ్రీరామనవమి వేడుకలలో రామాలయాన్ని కడిగి శుభ్రం చేశారు. ఇలా చేయడం తనకు ఎంతో సంతోషాన్నిస్తుం దని తెలిపాడు. తెలంగాణలోని కొన్ని గ్రామీణ ప్రాంతాలలో ముస్లింలకు సంబంధించిన మొహరం పండుగను హిందూ ముస్లింలు కలిసి జరుపుకుంటారు. అదేవిధంగా శ్రీరామనవమి వేడుకలలో కొన్ని ప్రాంతాలలో హిందువులతో కలిసి ముస్లింలు కూడా పాల్గొంటారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను చేస్తుంటారు. అలా ఈ శ్రీరామనవమి పండుగలోనూ మతసామరస్యం వెల్లివిరుస్తుంది.

వచ్చేది మాన్సూన్ సీజన్



- ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలి
- మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

వచ్చేది మాన్సూన్ సీజన్ అని నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, వాటర్ వర్క్స్ ఎం.డీ సుదర్శన్ రెడ్డితో కలిసి జీహెచ్ఎంసీ పరిధిలో మాన్సూన్ ముందస్తు ఏర్పాట్లపై ఈ.ఎస్.సి, జోనల్ కమిషనర్‌లు, ఎస్ఈలతో సమీక్షించారు. ఈ సందర్భంగా దాన కిషోర్ మాట్లాడుతూ వర్షాకాలంలో భారీ వర్షాలు, వరదలతో నగర వాసులకు ఎలాంటి ఇబ్బందులు, నష్టం వాటిల్లకుండా ముందస్తు ప్రణాళికతో పూర్తి పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డి.ఆర్.ఎఫ్) అన్నివేళలా అప్రమత్తమై సిద్ధంగా ఉండాలన్నారు. ఫైర్, వాటర్, జీహెచ్ఎంసీ, పోలీస్ తదితర శాఖలన్నీ కలిసి మే నెల చివరి వారంలోగాని, జూన్ మొదటి వారంలోగా మాక్ డ్రిల్ ఏర్పాటు చేయాలన్నారు. ఏదైనా ఆపద సంభవిస్తే ఆయా అధికారులు వచ్చి అండగా ఉంటారన్న నమ్మకం ప్రజలకు కల్పించాలన్నారు. రెగ్యులర్ పూడిక తీత (డిసిల్టింగ్) పనులు ప్రజలకు అవగాహన కోసం ఎగ్జిబిషన్ పెట్టాలని, వరద ముంపు కోసం చేపట్టిన అన్ని పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలో 125 వాటర్ లాగిన్ లొకేషన్స్ గుర్తించారని, 22 లొకేషన్స్‌లో సమస్యలను శాశ్వతంగా పరిష్కరించారని తెలిపారు. 40 లొకేషన్‌లలో పర్సనల్‌గా వెళ్లి పరిశీలించి శాశ్వతంగా పరిష్కరించాలన్నారు. మిగతా లొకేషన్లలో కూడా వాటర్ నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఈలకు సూచించారు. 1304 కి.మీ.పొడవు నాలాలు ఉన్నాయని, నాలాలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత చర్యలో భాగంగా నాలా ఆడిట్ చర్యలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రజలు నాలాలలో చెత్త వేస్తున్నారని, నాలాలలో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఈ.ఎన్.సీ జియా ఉద్దీన్, జోనల్ కమిషనర్లు రవి కిరణ్, హేమంత్ బోర్కడే, సహదేవ్ రావు, స్నేహ శబరీష్, అభిలాష అభినవ్, పంకజ వెంకన్న, సి.ఈలు దేవానంద్, కిషన్ లేక్స్ ఎస్.ఈ ఆనంద్, జోనల్ ఎస్.ఈ.లు అశోక్ రెడ్డి, చిన్న రెడ్డి, అనీల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నెలల శిశువుకు ఊపిరితిత్తుల శస్త్ర చికిత్స



నవతెలంగాణ-సిటీబ్యూరో

అంకుర హాస్పిటల్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్, వైద్యపరంగా ఒక అద్భుతమైన విజయాన్ని సాధించింది. కేవలం నాలుగు నెలల వయసున్న శిశువుకు సంక్లిష్టమైన ఊపిరితిత్తుల శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసింది. అంకుర హాస్పిటల్ బంజారాహిల్స్ బ్రాంచ్‌లో పీడియాట్రిక్ సర్జరీ బృందం ఈ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించింది. పీడియాట్రిక్ సర్జరీ, పీడియాట్రిక్ యూరాలజీ చీఫ్ సర్జన్ డాక్టర్ వీవీఎస్ చంద్రశేఖరం నేతత్వంలో అత్యంత నైపుణ్యం గల వైద్యుల బృందం ఖచ్చితత్వం, నైపుణ్యం అవసరమైన శస్త్రచికిత్స సవాలుగా స్వీకరించి విజయవంతంగా చేసింది. "ఇలాంటి సమస్యల నుంచి పిల్లలను రక్షించడంలో సకాలంలో గుర్తింపు, జోక్యం చాలా ముఖ్యమైనవి" అని అంకుర హాస్పిటల్ ఫర్ విమెన్ అండ్ చిల్డ్రన్ కి చెందిన పీడియాట్రిక్ సర్జరీ, పీడియాట్రిక్ యూరాలజీ చీఫ్ సర్జన్ డాక్టర్ వీవీఎస్ చంద్రశేఖరం అన్నారు.

ఊపిరితిత్తుల్లో పుట్టుకతో వచ్చే క్రమరాహి త్యాలు లక్ష మంది శిశువుల్లో 30-42 మందిలో కనిపించే అరుదైన అంశం. ఈ సమ స్యలను సకాలంలో గుర్తించడం వల్ల పెద్దయ్యాక వినాశక రమైన ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌లు, క్యాన్సర్‌ల నుంచి పిల్లలను రక్షించవచ్చు. వారు ఆరోగ్యకరమైన వ్యక్తులుగా ఎదగడంలో సహాయపడుతుంది" అని అన్నారు.

పనితీరులో ప్రతిభ..సీపీ చేతుల మీదుగా రివార్డ్స్



- దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిచిన సీసీఎస్
- బాధితులకు భరోసాగా నిలిచిన షీ బృందాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

రోజుకోతీరులో రెచ్చిపోతున్న సైబర్ నేరస్తులను కట్టడి చేయడంలో దేశంలోనే మన సైబర్‌క్రైమ్ పోలీ సులు నెంబర్‌వన్‌గా నిలిచారు. బాధితుల నుంచి ఫిర్యా దులు తీసుకోవడం, వెంటనే విచారణ జరిపించడంలో ముందున్నారు. సాంకేతిక ఆధారాలతో అన్నికోణాలో విచారించి ఇతర రాష్ట్రాలల్లో తలదాచుకుంటున్న సైబర్ నేరస్తులను, కరుడుగట్టిన నిందితులను అరెస్టుచేసి కోర్టులో హాజరుస్తున్నారు. సైబర్‌నేరస్తుల చేతిలో మోసపోయిన బాధితులకు న్యాయం చేయడంతోపాటు పోగొట్టుకున్న నగదను సైతం రికవరీ చేసి అందిస్తున్నారు. డీసీపీ ఎన్.స్వేతా పర్యవేక్షణలో సీసీఎస్, డీడీ విభాగాలు మెరుగైన ఫలితాలు సాధిస్తూ దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిచింది.

బాధితులకు 'భరోసా'

భరోసా సహాయ కేంద్రం సమగ్రమైన సహాయాన్ని అందించడానికి, ఆపదకులోనైన బాధితులు పోలీస్ స్టేషన్లకు వెళ్లకుండానే సురక్షితమైన వాతావరణంలో చేయూత అందించడానికి ఏర్పాటు చేయబడ్డాయి. హింస మరియు లైంగిక వేధింపులకు గురైన పిల్లలు, స్త్రీలు మరల అటువంటి వాటి బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నాయి. బాధితులకు న్యాయం, నిందితులకు తగిన శిక్షపడేలా చేయడం భరోసా కేంద్ర ముఖ్య లక్ష్యం. ఒకే గొడుగు కింద వైద్యం, న్యాయ సహాయం, ఆర్థిక సహాయం, కౌన్సిలింగ్ అందిస్తోంది. హైదరాబాద్ నగరంలో ఏర్పాటు చేసిన భరోసా సహాయ కేంద్రం తన లక్ష్యాన్ని చేరుకోవడంలో విజయవంతమైంది. షీ టీమ్స్ సైతం పోకిరీల ఆగడాలను అరికడుతున్నాయి. ఆకతాయిలను రెండ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కోర్టులో ప్రవేశపెట్టడంతో వారికి 2 నుంచి 10రోజులపాటు జైలుశిక్షలు పడడంతోపాటు జరిమానాలు విధిస్తున్నారు. నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలు, డీసీపీ డి.కవిత పర్యవేక్షణలో నగరంలో భరోసా కేంద్రం, షీ టీమ్స్ బాధితులకు భరోసాగా నిలుస్తున్నాయి. వందలాది మంది మహిళలను, చిన్నారులను, మైనర్లను రక్షించారు. అటూ సైబర్‌క్రైమ్స్, ఇటు భరోసా, షీ బృందాల పనితీరులో పోలీస్‌శాఖకు మరింత పేరుప్రతిష్టలు తీసుకొస్తున్నాయి. మంగళవారం భరోసా కేంద్రాన్ని సందర్శించిన సీపీ సిబ్బంది చేసిన సేవలను ప్రత్యేకంగా అభినందిచారు. వారి పనితీరుతో రివార్డ్స్‌ను, నగదు ప్రొత్సాహంతో తస్కరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు ఎస్.చాంద్ బాషా, శివమారుతీ, ప్రశన్నలక్ష్మి, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు డాక్టర్లు, కోర్టు సిబ్బందితోపాటు షీ బృందాలు, భరోసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





మార్కెట్‌లోకి ఇండి బ్రీజ్ ఇండస్ట్రీయల్ ఎయిర్స్ కూలర్స్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇండి బ్రీజ్ ఇండస్ట్రీయల్ ఎయిర్స్ కూలర్స్ మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది. ఈ నూతన కూలర్స్ గురించి క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ బిజినెస్ హెడ్ (లార్జ్ డొమెస్టిక్ అప్లయెన్సెస్) మల్హర్ వాడ్కే మాట్లాడుతూ "ఇండిబ్రీజ్ ఇండస్ట్రియల్ కూలర్ శ్రేణిని ప్రారంభించడం క్రాంప్టన్ తన కస్టమర్ల అవసరాలతో పాటు అభివృద్ధి చెందాలనే అంకితభావాన్ని ప్రతిబింబిస్తుంది. క్రాంప్టన్ అధునాతన సాంకేతికత, మార్గదర్శక ఆవిష్కరణలతో అడ్డంకులను బద్దలు కొట్టిన చరిత్రను కలిగి ఉంది. ఇండీ బ్రీజ్ ఇండస్ట్రియల్ కూలర్‌లు ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాయని మేం విశ్వసిస్తున్నాం. మరింత సౌకర్యవంతమైన, సౌలభ్య వంతమైన వినియోగదారు అనుభవం కోసం మా ఉత్పత్తుల నుంచి కస్టమర్లు ఆశించే అదే అధిక ఫలితాలను అందజేస్తుంది" అని అన్నారు.

ఈటల రాజేందర్ సమక్షంలో చేరికలు



నవతెలంగాణ-శామీర్‌పేట

దేశ అభివృద్ధి ప్రధాని నరేంద్ర మోడీతోనే సాధ్యమని మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. దేశ అభివృద్ధి, ధర్మం కోసం రాష్ట్ర ఎంపీపీల ఫోరం ఫౌండర్ అధ్యక్షుడు ఉమ్మడి శామీర్‌పేట మండల మాజీ ఎంపీపీ బొల్లబోయిన చంద్రశేఖర్ యాదవ్ 500 మంది తన అనుచరులు కలిసి ఈటల సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి ఈటల కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో మాజీ సర్పంచ్ పద్మ కృష్ణ యాదవ్, మాజీ ఎంపీటీసీ పద్మ శివకుమార్ గౌడ్, పరమేష్ యాదవ్, శ్రీశైల యాదవ్, ప్రద్యున్ యాదవ్, వినోద్ జైన్, బబ్లు యాదవ్, మల్లేష్, యాదవ్, నగేష్ యాదవ్, సురేందర్ తదితరులున్నారు. ఈ సందర్భంగా చంద్ర శేఖర్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌లో తొమ్మిదేండ్లు పని చేశానని అన్నారు. ఇప్పుడు దేశం కోసం, ధర్మం కోసం రాజేందర్ అన్న సమక్షంలో బీజేపీలో చేరానని పేర్కొన్నారు. కాగా ఈటల రాజేందర్‌కు చంద్రశేఖర్ యాదవ్ గజమాలతో స్వాగతం పలుకగా ఆయన సతీమణి హారతి ఇచ్చారు.





శాన్వి ఫ్రెడ్స్ హెూమ్స్‌లో నెలకొల్పిన శ్రీ సీతారామ మందిరం ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. మంగళవారం ఉదయం సుప్రభాత సేవ అంకురార్పణ ధ్వజారోహణ గావించారు. రిత్వికులు పవన్ కుమార్ ఆధ్వర్యంలో ఈ క్రతువులు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో శాన్వి ఫ్రైడ్ కన్‌స్ట్రక్షన్స్ యజమాని కృష్ణారెడ్డి దంపతులు, భూమి యజమానులు మహేష్‌కుమార్ దంపతులు, సురేష్ కుమార్ దంపతులు, పవన్, విల్లాస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

-నవతెలంగాణ-అల్వాల్



కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 12వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్ 2 నుంచి సిహెచ్ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణను సత్కరించి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్



టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధుయాష్కీ గౌడ్ మాతృమూర్తి అనసూయమ్మ సోమవారం పరమపదించారు. మంగళవారం హాయత్ నగర్‌లోని వారి స్వగృహంనందు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ , మధుయాష్కీ గౌడ్‌ని పరామర్శించారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సంక్షేమ, కుల సంఘాల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీ కోలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో... మంగళవారం కుత్బుల్లాపూర్, జీడిమెట్ల డివిజన్‌లకు సంబంధించి సంక్షేమ సంఘాలు, కులసంఘాల ఆత్మీయ సమావేశం కల్పనా సొసైటీలోని గుజరాతి కమ్యూనిటీ హాల్, సుచిత్ర టీఎన్ఆర్ గార్డెన్‌లలో వేరు వేరుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్, మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావ్‌లతో కలిసి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలపరిచిన మల్కాజిగిరి అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కుల సంఘాలు, సంక్షేమ సంఘాలను శ్రీశైలం గౌడ్ కోరారు. మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని, ఇప్పటి వరకు బీఆర్ ఎస్, బీజేపీలు ఇక్కడ గెలవలేదని, ఈ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ గెలుస్తుందని అన్నారు. బూత్ స్థాయిలో ప్రతీ కార్యకర్త సమిష్టిగా పనిచేసి ముఖ్యమంత్రికి మల్కాజిగిరి స్థానాన్ని కానుకగా ఇవ్వాలన్నారు. పలువురు నాయకులు బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరగా, వారిని సునీతా మహేందర్ రెడ్డి, శ్రీశైలం గౌడ్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు కేఎం ప్రతాప్, నియోజకవర్గ కోఆర్డినేటర్ బండ్రు శోభారాణి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు నర్సారెడ్డి భూపతి రెడ్డి, కందాడి జ్యోష్ణ శివారెడ్డి, సొంటి రెడ్డి పున్నారెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్ లక్ష్మి, డివిజన్ అధ్యక్షులు పలు సంక్షేమ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రంజిత్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి



ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ డివిజన్ పరిధిలోని, ఆల్విన్ కాలనీ ఫేస్ 1 అసోసియేషన్ సభ్యులను కలిసి, కాలనీ సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలో ఉన్న త్రాగునీరు, సీసీ రోడ్ల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు, మనందరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, బి.వెంకటేష్ గౌడ్, సంపత్ రెడ్డి, కృష్ణగౌడ్, నరసింగరావు, రఘు, రామ్ రెడ్డి, పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్
లీకేజీలను గుర్తించి మరమ్మత్తులు చేపట్టాలి



- కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఎక్కడైనా లీకేజ్ అయ్యే పరిస్థితి ఉన్న పైప్ లైన్‌లను గుర్తించి, మరమ్మత్తులు చేపట్టాలని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. మంగళ వారం హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ రాం నగర్, కృష్ణవేణి కాలనీలో చేపడుతున్న మంజీర పైప్ లైన్ వాల్వు మరమ్మత్తు పనులను, కాలనీలో నెలకొన్న మంచి నీటి సమస్యను కాలనీ వాసులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా త్వరితగతిన మరమత్తు పనులు పూర్తి చేసి నీటి సరఫరాకి ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలన్నారు. డివిజన్‌లో ఎక్కడ నీటి సమస్య తలెత్తకుండా కిందిస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. ప్రతీ కాలనీ, బస్తీలలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తానన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. మీ కాలనీలలో ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా నన్ను కానీ, కార్పొరేటర్ కార్యాలయాన్ని కానీ సంప్రదించాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు శేఖర్, కుమార్ యాదవ్, ఉపేందర్, వెంకటేష్, నరేందర్, ధనుంజయ, నరేష్ పాల్గొన్నారు.

ప్రజలను పట్టించుకోని బీజేపీ,కాంగ్రెస్..



- బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

తెలంగాణ-జగద్గిరిగుట్ట

గల్లీలో పనిచేయాలన్న ఢిల్లీ పెద్దలని అడిగే చేసే కాంగ్రెస్, బీజేపీ నాయకులు తెలంగాణ రాష్ట్రాన్ని ఏం పాలిస్తారని మల్కాజిగిరి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఘాటుగా విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో భాగంగా మంగళ వారం గాజులరామారం డివిజన్ ఉషోదయ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో పాటు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి రాగిడి మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర సమయంలో ప్రజలను పట్టించుకోని సీఎం రేవంత్ రెడ్డి డమ్మీ అభ్యర్థిగా సునీతమ్మను ఎంపీ అభ్యర్థిగా నిలిపి బీజేపీ గెలుపుకు తోడ్పాటునం దిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు కష్టాలు మొదలయ్యాయన్నారు. గత పది ఏండ్లలో ఎన్నడూ కనబడని వాటర్ ట్యాంకర్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి జోరుగా తిరుగుతూ ప్రజలకు నీటి కష్టాలను గుర్తు చేస్తున్నాయన్నాయని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే నెంబర్ వన్ స్థాయికి ఎదిగిందన్నారు. గ్రేటర్ పరిధిలో ఐటీ రంగంలో పెట్టుబడులు తేవడం, ఫ్లై ఓవర్లు నిర్మించడంలో అభివృద్ధి పథంలోకి నడిపిన ఘనత కేసీఆర్ కె దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే బీజేపీ పార్టీకి ఓటు వేసినట్లేనని... ఓటర్లారా ఆలోచించండి.. ఆగం కాకండి బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసే విధంగా ప్రజలను చైతన్యవంతులను చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మల్కాజిగిరికి సంబంధంలేని కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఇక్కడికి వచ్చి పోటీ చేస్తున్నారని వారికి మల్కాజిగిరి ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ ప్రచారంలో ప్రతి నాయకుడు ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీ గెలుపు అవసరాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ప్రజల్లో మమేకమైన నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డిని ఎంపీగా గెలిపించుకుంటే అభివృద్ధి మరింత రెట్టింపు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మర్రి లక్ష్మణ్‌రెడ్డి రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్ సక్సెస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మర్రి లక్ష్మణ్‌రెడ్డి రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్-2024 విజయవంతమైంది. ఈవెంట్‌ను చాలా విజయవంతంగా నిర్వహించారు. ఎంఎల్ఆర్ఐటీ కళాశాల అత్యుత్తమ ఫలితాలను సాధించి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా నలు మూలల నుంచి నగరంలోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాల వేదికగా నిర్వహించిన ఈ క్రీడాపోటీలు ఘనంగా జరిగాయి. ఎంఎల్ఆర్ గ్రూప్స్ చైర్మెన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, ఎంఎల్ఆర్ఐటీ ఫౌండర్ సెక్రెటరీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కాలేజీ ప్రిన్సిపాల్ డా.కె.శ్రీనివాసరావు, అరుంధతి హాస్పిటల్ డైరెక్టర్ దీరన్ రెడ్డి ప్రారంభ, ముగింపు కార్యక్రమాలను హాజరయ్యారు. విజేతలు, రన్నరప్‌లకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి, మర్రి లక్ష్మణ్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలకు క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. ప్రతీ ఏటా రూ.కోటీ 50 లక్షల స్కాలర్‌షిప్ ఇచ్చి 35 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ కోటా క్రింద ప్రవేశాలను కల్పించి తమ నిబద్ధతను చాటుతున్నామని తెలిపారు. విజేతలకు అభినందనలు తెలిపారు.





ఆల్విన్ కాలని డివిజన్ నవోదయ కాలనీలో, ఎంఎస్ఎం ఈ కౌన్సిల్ కార్యాలయానికి శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీష్ గౌడ్ హాజరయ్యారు. పలు అంశాల పై చర్చించారు. ఈ కార్యక్రమంలో జీవీఆర్, శిరీష సత్తూర్, తెలంగాణ రాష్ట్ర ఎంఎస్ఎంఈ చైర్మెన్ రఘు, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి

అక్రమ నిర్మాణాలపై అధికారుల కొరడా



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో పలు చెరువులు, కుంటలు అక్రమ నిర్మాణాలతో ఇటీవల వరుస కథనాలు వివిధ పత్రికలలో ప్రచురితమైన పలువురు స్థానికులు ఫిర్యాదులు చేసిన అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉంటూ.... ఒకరిపై ఒకరు వారు రావడం లేదని చెప్పుకొని కాలయాపన చేశారే గానీ, చర్యలు మాత్రం తీసుకోలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం ఎట్టకేలకు ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా అక్రమ నిర్మాణాలపై కొరడా జులిపించారు. మొదట దుండిగల్ పెద్దచెరువు బఫర్‌లో వెలసిన అక్రమనిర్మాణాలు తొలగించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ డీ.ఈ శ్రీనివాస్ మాట్లాడుతూ చెరువు శిఖంలో అక్రమనిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. అనంతరం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మూలోని కుంటలో కొంత స్థలంలో సిమెంట్ పలకలతో కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను మండల రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు మున్సిపల్ సిబ్బందితో కలిసి అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు స్థానిక కౌన్సిలర్ ప్రజా ప్రతినిధులతో ఒత్తిళ్ళ సిఫారసు చేయడంతో మొదట తొలగించేందుకు తూతూ మంత్రంగా తొలగించేందుకు సిద్ధమయ్యారు. దుండిగల్ మున్సిపాలిటీకి చెందిన స్థానిక బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆనంద్ కుంటలో మట్టిపోసి కుంటను కబ్జాచేసి చుట్టూ సిమెంటు పలకలతో నిర్మాణం చేపట్టి కబ్జాకు శ్రీకారం చుట్టాడు. దుండిగల్ రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్ ఆదేశాలతో కూల్చివేతలు చేపట్టారు. కబ్జాలను కూల్చివేసేందుకు వెళ్లిన అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధి నుంచి ఒత్తిడి రావడంతో మధ్యలో వెనుతిరిగినట్లు సమాచారం... ప్రభుత్వ ఆస్తులు, ప్రజా సంపదను కబ్జా చేసిన వారిపై గట్టిచర్యలు తీసుకోవలసి ఉండగా, అధికారులు పాలకులకు వత్తాసు పలకడంపై విమర్శలు వెల్లువెత్తాయి. చివరకు ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్ స్వయంగా వచ్చి మూలోని కుంటలో వెలసిన అక్రమనిర్మాణాలను ఇరిగేషన్ తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎఈ నిఖిత, దుండిగల్ మండల ఆర్ ఐ ప్రదీప్ రెడ్డి,రెవెన్యూమున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



శేరిలింగంపల్లి నియోజకవర్గం కూకట్‌పల్లి సర్కిల్‌లోని వివేకానందనగర్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ 33వ బ్రహ్మోత్సవాల సందర్భంగా, ఆలయ కమిటీ వేదంపండితుల ఆహ్వనం మేరకు, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు హాజరయ్యారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేదంపండితుల ఆశీర్వాదం తీస్కొని, ఏడుకొండల వెంకటేశ్వర స్వామి దయవల్ల ప్రజలందరు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి



ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజుని కుత్బులాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజలు, పార్టీ శ్రేణులు మంగళవారం శంభీపూర్ కార్యాలయంలో కలిశారు. శ్రీరామ నవమి వేడుకలకు రావాలని ఆహ్వాన పత్రికలను అందజేసి ఆహ్వానించారు.

నవతెలంగాణ-దుండిగల్

విద్యార్థుల ప్రతిభకు ఎల్లలు లేవు

- ఏజీఎం. శివరామకృష్ణ
- ప్రభంజనం సృష్టించిన శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు
- ఐఎన్‌టిఎస్‌ఓ లెవెల్ -2 ఫలితాలలో జాతీయస్థాయి గుర్తింపు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

విద్యార్థులు తలుచుకుంటే అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేయగలరని, వారి ప్రతిభకు ఎల్లలు లేవని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ బ్రాంచ్‌కు చెందిన శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు నిరూపించారని పాఠశాల ఏ.జి.యం.శివరామకృష్ణ పేర్కొన్నారు. ఐ.ఎన్.టి.ఎస్.ఓ. లెవెల్ -2 ఫలితాలలో (2023-24) సంవత్సరానికి నిర్వహించిన పోటీ పరీక్షలో వల్లభనేని సౌమిక ప్రథమ బహుమతి(లెనోవా టాబ్), హర్షిష్ సాయి సూర్య నందేపు రెండవ బహుమతి, ప్రాతూరి ప్రజోష్ణ తృతీయ బహుమతి, వీర సాయి నందన్ పాసాల, అక్షర పెద్దమ్మ గారి నాలుగో బహుమతులు, శక్తి సాయి పూడు, పోలా సాయి సహస్ర ఐదో బహుమతులు... సూర్యవంశీ ప్రత్యేక బంగారు పథకాలు కైవసం చేసుకుని అద్భుత ప్రభంజనం సృష్టించారు. అదేవిధంగా 308 మంది సెలక్షన్ కాగా మొదటి బహుమతి బంగారు పథకంతో పాటు మెరిట్ సర్టిఫికెట్, రెండవ బహుమతి బంగారు పథకంతో పాటు మెరిట్ సర్టిఫికెట్, నాలుగో బహుమతి బంగారు పతకంతో పాటు మెరిట్ సర్టిఫికెట్స్ 4, ఒక బహుమతి బంగారు పతకంతో పాటు మెరిట్ సర్టిఫికెట్లు 2తో పాటు ప్రోత్సాహక బంగారు పతకం, మెరిట్ సర్టిఫికెట్లు 30 బహుమతులు, బంగారు పథకాలు ఆరు వీటితో పాటు బంగారు పతకాలు మెరిట్ సర్టిఫికెట్లు 247, ప్రత్యేక బంగారు పతకాలు 103, కైవసం చేసుకొని అదరహో అనిపించారు. ఈ సందర్భంగా పాఠశాల ఏజీఎం.శివరామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటినుండే కృషి పట్టుదల కనబరిచితే భవిష్యత్తులో తప్పక మేధావులు అవుతారని ఆకాంక్షించారు. విద్యార్థుల మనోభావాలకనుగుణంగా తల్లిదండ్రులతో పాటు తమ అధ్యాపక బృందం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామని అందుకే ఇంతటి అరుదైన జాతీయస్థాయి ఫలితాలు సాధించగలిగామని తెలిపారు. అనంతరం పాఠశాల ఆర్.ఐ. పద్మజ, ప్రిన్సిపల్ భార్గవి బోయపాటి, అసిస్టెంట్ కోఆర్డినేటర్ వెంకట శివ, అకాడమిక్ డీన్ ప్రసాద్, సి బ్యాచ్ ఇన్‌చార్జి రమేష్, ఉపాధ్యాయులు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రత్యేకంగా పాఠశాలలో అభినందించి ప్రశంసా పత్రాలు అందచేసారు.

నేటి యువతకు ఎమర్జింగ్ ట్రెండ్స్ టెక్నాలజీస్ ఎంతో అవసరం



- ప్రో.డా. కె.పి.సుప్రీతి

నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం స్కూల్ అఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో నేషనల్ కాన్ఫరెన్స్ ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెఎన్‌టీయూ హైదరాబాద్ సిఎస్ఈ. హెచ్ఓడి. డా.కెపి. సుప్రీతి విచ్చేశారు. కాన్ఫరెన్స్‌ని ఉద్దేశించి మాట్లాడుతూ నేటి యువత ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేసే అధ్యాపకులు నేడు కార్పొరేట్ రంగంలో ముందుడాలంటే ఎమర్జింగ్ టెక్నాలజీస్ పై అవగాహనతో పాటు అద్భుతమైన పట్టును సాధించాలని తెలిపారు. నేడు కార్పొరేట్ రంగంలో డిజిటల్ మార్కెటింగ్, ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ లాంటి టెక్నాలజీస్ సమాజంలో మనిషి యొక్క మేధస్సునుని పెంపొందించడంలోను, సైబర్ నేరాల నుంచి తమ జీవితాలకు భద్రత కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం కళాశాల సెక్రటరీ జక్కుల త్రిశూల్ రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక విజ్ఞానం కార్పొరేట్ సమాజంలో మనిషి మేధస్సును ప్రశ్నించేలా అభివృద్ధి చెందుతున్న ఈ క్రమంలో ప్రతీ ఒక్కరు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను అవగాహన చేసుకొని వాటికనుగుణంగా మనిషి మేధస్సును కూడా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కళాశాల డైరెక్టర్ డా. ఏ.మోహన్ మాట్లాడుతూ నేషనల్ లెవెల్‌లో కాన్ఫరెన్స్ నిర్వహించి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం మీద నేటి సమాజంలో విద్యార్థులకు, అధ్యాపకులకు ఏ పాటి జ్ఞానం ఉంది దాని ద్వారా వారి జీవితాలలో సమాజంలో ఎలాంటి మార్పులు వస్తున్నావో తెలుసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్.లోకనాథం మాట్లాడుతూ కార్పొరేట్ సమాజం ప్రపంచాన్ని శాసిస్తున్న నేటి కాలంలో ఎమర్జింగ్ ట్రెండ్స్ మీద మన కళాశాలలో నేషనల్ లెవెల్ కాన్ఫరెన్స్ నిర్వహించి విద్యార్థులను వివిధ కళాశాలల అధ్యాపకులను ఉత్సాహపరిచి వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలనేదే ముఖ్య లక్ష్యం అని తెలిపారు. ఎమర్జింగ్ ట్రెండ్స్ మీద నిర్వహిస్తున్న నేషనల్ లెవెల్ కాన్ఫరెన్స్ కంప్యూటర్ సైన్స్ అఫ్ ఇండియా సహకారంతో ఎంతో విజయవంతంగా పూర్తి చేశాం అని సి.ఎస్.ఈ. హెచ్.ఓ.డి. డా. ఏ.వి.ఎల్.యెన్. సుజిత్ తెలిపారు. ఈ నేషనల్ కాన్ఫరెన్స్ లో 200 మందికి పైగా విద్యార్థులు వివిధ ఇంజినీరింగ్ కళాశాలల అధ్యాపకులు పాల్గొని ఎమర్జింగ్ ట్రెండ్స్ మీద వివిధ సాంకేతిక అంశాల మీద ఉపన్యాసాలు ఇచ్చారని ఈ నేషనల్ కాన్ఫరెన్స్ సి.ఎస్.ఈ.- ఎమర్జింగ్ హెచ్.ఓ.డి. డా. ఏం.పార్థసారధి తెలిపారు. ముగింపు కార్యక్రమములో అద్భుత ప్రదర్శన కనబర్చిన వారికి బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ జక్కుల నర్సింహా రెడ్డి, సెక్రటరీ జక్కుల త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి తో పాటు డైరెక్టర్ డా. ఏ. మోహన్, ప్రిన్సిపాల్ డా. ఆర్.లోకనాథం, విద్యార్థుల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పోటీ రంగంలో దూసుకుపోతున్న విష్ణు అకాడమీ

- ఎన్నో సంచలన ర్యాంకులతో ప్రత్యేక గుర్తింపు

నవతెలంగాణ-సిటీబ్యూరో

సివిల్స్, గ్రూప్స్ శిక్షణలో విశేషానుభవం గల విష్ణు ఐఏఎస్ అకాడమీ నగరంలో అద్భుతమైన ఫలితాలతో దూసుకుపోతుంది. ఆల్ టైమ్ ప్రపరేషటరీ ప్రోగ్రామ్ గైడెన్స్, మెంటార్ షిప్‌తో నేటికీ ఆల్ టైమ్ ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిన సంస్థగా గుర్తింపు సాధించింది. విష్ణు ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకులు విష్ణువర్ధన్ వ్యక్తిగత ప్రేరణతో యూపీఎస్సీ, ఇతర పోటీపరీక్షల శిక్షణలో అపార అనుభవం కలిగిన నిపుణుల ప్రసంగాలతో విద్యార్థులకు మరింత లోతైన అవగాహన కల్పించడం ద్వారా ఎక్కువ మార్కులు సాధించేందుకు దోహదపడుతుంది. విష్ణు అకాడమీకే సాధ్యమైన ఈ ప్రత్యేక కార్యాచరణతో కొన్ని వందల మంది విద్యార్థులు సివిల్స్‌లో విజయం సాధించి, ప్రభుత్వ ఉద్యోగస్థులుగా అత్యున్నత స్థాయిలలో కొనసాగుతున్నారు. ప్రతి విద్యార్థి పట్ల సబ్జెక్ట్ ఎక్స్ పర్ట్ చూపించే వ్యక్తిగత శ్రద్ధతో ఆయా సబ్జెక్టులపై విద్యార్థుల్లో నిశిత బుద్ధిని పెంపొందిస్తోంది. విజేతల స్ఫూర్తిదాయక ప్రసంగాలతో నూతన విద్యార్థులను కార్యోన్ముఖులను చేస్తోంది. నైపుణ్యం గల అధ్యాపకులను తయారు చేసిన నాణ్యమైన కంటెంట్‌తో అభ్యర్థుల్లో విశ్వాసాన్ని రెట్టింపు చేసే లక్ష్యం దిశగా నడిపిస్తోంది. విష్ణు ఐఏఎస్ అకాడమీ విద్యార్థులకు నిర్వహించే దశల వారీ పరీక్షల ద్వారా ఆయా సబ్జెక్టుల్లో వారిలోని వ్యక్తిగత బలాలు, బలహీనతలను అంచనా వేసేందుకు సహాయపడతాయి. సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని విన్ విన్ సిచ్యుయేషన్ విధానాలతో అందుబాటు ఫీజులతో కోచింగ్ అందిస్తోంది.



రాష్ట్రంలోని ప్రయివేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ట్రస్మా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు శివరాత్రి యాదగిరి మంగళవారం సీ.ఎం. నివాసంలో కలిసి విన్నవించారు. అనంతరం శాలువాతో సన్మానించారు. సానుకూలంగా స్పందించిన సీ.ఎం. రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని ప్రయివేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని హామీ ఇచ్చారు.

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

యూపీఎస్సీ సివిల్స్ ఫలితాలలో లా ఎక్సలెన్స్ విద్యార్థులు ప్రతిభ



నవతెలంగాణ-ముషీరాబాద్

యూపీఎస్సీ సివిల్స్ ఫలితాలలో తెలుగు రాష్ట్రాలలోనే అత్యధిక ర్యాంక్‌లను సాధించిన సంస్థ లా ఎక్సలెన్స్ 200 లోపు ర్యాంక్‌లలో 9 ర్యాంక్‌లను లా ఎక్సలెన్స్ విద్యార్థులు సాధించారు. లా ఎక్సలెన్స్ విద్యార్థులు 35 ర్యాంక్‌లకు పైగా సాధించి తెలుగు రాష్ట్రాలలో అగ్రగామిగా నిలిచింది. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా లా ఎక్సలెన్స్ అకాడమీ నాణ్యమైన విద్యను అందిస్తూ వారికి అండగా నిలుస్తుంది. ఫలితాలలో ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను సంస్థ డైరెక్టర్, చైర్మెన్ రాంబాబు పూల బొకే అందించి శాలువాతో సత్కరించారు. తెలుగు రాష్ట్రాలలో లా ఎక్సలెన్స్ ను అగ్రగామిగా నిలిపిన సంస్థ సిబ్బందిని డైరెక్టర్ అభినందించారు. రాబోయే విద్యా సంవత్సరం నుండి లా ఎక్సలెన్స్‌లో ఐఎఎస్ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ తెలిపారు.

బీజేపీ నల్లధనం తెస్తామని నల్ల చట్టాలు తెచ్చారు

- కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్



నవతెలంగాణ-ముషీరాబాద్

బీజేపీ నల్లధనం తెస్తామని నల్ల చట్టాలు తెచ్చారని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. బీజేపీ ప్రభుత్వ విధివిధానాలపై గౌరీ సతీష్ పత్రిక ప్రకటన ద్వారా స్పందించారు. నిరుద్యోగ నిర్మూల న్నారు. ఇంటికో నిరుద్యోగిని తయారు చేశారని తెలిపారు. పన్నులు తగ్గిస్తామని పనులు లేకుండా చేశారు. ధరలు తగ్గిస్తామని ప్రజల కొనుగోలు శక్తిని తగ్గించారు. రూపాయి పతనాన్ని అరికడతామని తెలిపి దాని విలువను మరింత క్షీణించేలా చేశారని ఎద్దేవా చేశారు. టాక్స్ తగ్గిస్తామని తెలిపి దొడ్డిదారి సెస్‌ల భారాన్ని మోపారు. పట్టణ ఉపాధి హామీఅని గ్రామీణ ఉపాధి పని దినాలు తగ్గించారని తెలిపారు. ఆత్మనిర్భార్ భారత్ అన్నారు ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బతీశారు. విద్వేషాలు రెచ్చగొట్టే బీజేపీని ఓడించాలని జాతి గౌరవాన్ని నిలబెట్టాలని కోరారు.

విద్యార్థులు జాబ్‌మేళాలు సద్వినియోగించుకోవాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల చంచలగూడలోని బ్రిలియంట్ టెక్నాలజీస్ సంస్థ జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాలో 45 మంది ఉద్యోగార్థులు పాల్గొని సంస్థ వారు వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి పది మందిని తమ సంస్థలో ఉద్యోగులుగా ఎంపిక చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూలపల్లి వెంకటరమణ తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి జాబ్ మేళాలు భవిష్యత్తులో నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు.

ఘనంగా నంది పురస్కారాల ప్రదానోత్సవం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

మనిషి తన జీవితంలో చేసే ప్రయత్నానికి పురస్కారం సహకారం లాంటిదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఉగాది పండుగ సందర్భంగా ఉజ్వల సామాజిక స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాలలో సేవలందిస్తున్న వారికి నంది పురస్కారాలు ప్రధానోత్సవ కార్యక్రమంలో బొగ్గులకుంట సరస్వత పరిషత్తులో నిర్వహించారు. కార్యక్రమానికి అతిథులుగా ప్రముఖ సంఖ్యాశాస్త్ర నిపుణుడు దైవజ్ఞ శర్మ, ప్రముఖ కేరళ జ్యోతిష్య నిపుణులు శివ నరసింహన్ తాంత్రి, గౌతమ్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత బాలరాజ్ ముదిరాజ్, ప్రముఖ సినీనటి ఊర్వశి పటేల్, శ్రీ సాయి సహాయ సేవా సమితి చైర్ పర్సన్ డాక్టర్ ఎర్రం పూర్ణ శాంతి గుప్తా పాల్గొని పురస్కారాలను ప్రధానం చేశారు. వివిధ రంగాలలో సేవలందిస్తున్న వారిని గుర్తించి అవార్డులను అందజేయడం అభినందనీయమన్నారు. సభకు ముందు ప్రముఖ గాయని సాయి పవని నిర్వహణలో గాయని గాయకులు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి. కార్యక్రమంలో గో సేవకుడు బాలరాజ్ గౌడ్, ప్రముఖ కవి వేమూరి అనంత రామకృష్ణ శర్మ, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం. లక్ష్మి పాల్గొన్నారు.

నూతన నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర నర్సింగ్ ఆఫీసర్స్ కమిటీ ఎన్నిక..






నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలంగాణ రాష్ట్ర ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ నేషనల్ హెల్త్ మిషన్ నర్సింగ్ ఆఫీసర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలుగా కొట్టల నిశాంతిని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మరియా, ఉపాధ్యక్షులుగా కె. చంద్రకాంత్, బి.రత్నకుమారి, సహాయ కార్యదర్శిగా బి.వనిత ఎస్.కె హిమామ్బి, కోశాధికారిగా ఎస్.సరిత సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు నిశాంతిని మాట్లాడుతూ.. ఉద్యోగస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ప్రజలకు ఆయుర్వేద వైద్యం అనువైంది

- ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శీనివాసరావు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ఆయుర్వేద వైద్యంతో ప్రజల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని కింగ్ కోఠి ప్రభుత్వ పాలిక్లినిక్ ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కింగ్ కోఠి పాలిక్లినిక్ (ఆయుర్వేదం) క్లినిక్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎండాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎండకు వెళ్లాలనుకునే వారు గొడుగు వెంట తీసుకెళ్లాలన్నారు. ప్రజలు ఎక్కువగా నిమ్మరసం, కొబ్బరి నీళ్ల, కీర దోస, తాజా పండ్లు, పండ్ల రసాలు తీసుకోవాలని సూచించారు. రోజుకు తగినంత మంచినీళ్ల తీసుకోవాలన్నారు. ఆయుర్వేద క్లినిక్ వచ్చే రోగులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇంగ్లీషులో ఉన్న జాగ్రత్తల పత్రాన్ని అందిస్తున్నామని తెలిపారు. రోజుకు తమ ఆయుర్వేద క్లినిక్ కు 50 మంది రోగులు వస్తున్నారని తెలిపారు. రోగులకు ఉచితంగా మందులను అందిస్తున్నామని చెప్పారు.

తూతూమంత్రంగానే ‘అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ’లు

- ఎన్నికల కోడ్ పేరుతో నెలరోజులుగా జాప్యం
- తల్లిదండ్రులతో సమావేశాలు లేకుండానే ఏఏపీసీల ఏర్పాటు
- తెలిసిన విద్యార్థుల తల్లుల పేరిట బ్యాంకు ఖాతాలు ఓపెన్
- డీప్యూటీ ఐవోఎస్‌ల చర్యలపై విద్యార్థుల పేరెంట్స్ నుంచి వ్యతిరేకత
- ఆదరబాదరాగా బ్యాంకు అకౌంట్స్ తెరవడంపై హెచ్‌ఎంల ఆందోళన



నవతెలంగాణ-సిటీబ్యూరో

కాంగ్రెస్ సర్కారు రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కావాల్సిన చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఇప్పటివరకు పాఠశాల స్థాయిలో పనిచేసిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు స్వస్తి పలుకుతూ..వాటి స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటుకు ఓకే చెప్పింది. అంతేగాక పాఠశాల అభివృద్ధిలో స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ), ఏఎల్‌ఎఫ్‌లను(ఏఎల్‌ఎఫ్) భాగస్వాములను చేయడం ద్వారా గుణాత్మక విద్యా సాధించే లక్ష్యం సాకారమవుతుందని భావించింది. కానీ అదిలోనే దానికి మండల స్థాయి విద్యాశాఖ అధికారులు తిలోదకాలు ఇచ్చేస్తున్నారు. ఎన్నికల కోడ్ పేరుతో దాదాపు నెలరోజులుగా కమిటీలు ఏర్పాటు చేయకుండా జాప్యం చేస్తూ వచ్చారు. తీరా ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి పెరగడంతో ఇప్పుడు ఆదరాబాదరాగా ఏపీసీసీలను ఏర్పాటు చేస్తున్నారు. కనీసం తల్లిదండ్రులతో పాఠశాలల్లో సమావేశాలు ఏర్పాటు చేయకుండానే తమకు తెలిసిన విద్యార్థుల పేరెంట్స్ పేర్లతో తీర్మానం కాపీలు తయారు చేసి బ్యాంకు ఖాతాలు తెరుస్తున్నారు. ఫలితంగా ఇటు ప్రభుత్వ లక్ష్యం దెబ్బతినడం.. అటు పథకంపై విద్యార్థుల పేరెంట్స్‌కు అవగాహన కొరవడతున్న పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం సర్కారు బడుల అభివృద్ధికి మన బస్తీ-మన బడి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకంలో నిర్ణయించిన మేర లక్ష్యాలను వివిధ కారణాలతో పూర్తిచేయలేకపోయింది. దీంతో రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలల్లోని పెండింగ్ పనులతో పాటు కొత్తగా చేయాల్సిన పనులపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా ప్రతి పాఠశాలలో స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలను భాగస్వాములుగా చేసి వారినే కమిటీల్లో నియమించి ప్రతిపాదిత పనులను చేయాలని సర్కారు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. కాగా, గ్రామస్థాయి కమిటీలో సంబంధిత పాఠశాల సమీపంలోని విలేజీ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్‌గా(వీడీవో), పట్టణాల్లో ఏరియా లెవల్ ఫెడరేషన్లుగా(ఏఎల్‌ఎఫ్) గుర్తించారు. అక్కడి మహిళలనే కమిటీ చైర్‌పర్సన్‌గా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. ప్రతీ తరగతి నుంచి ముగ్గురు పేరెంట్స్.. చైర్మెన్, హెచ్‌ఎంతో కలిసి చర్చించి సభ్యులుగా ప్రతిపాదించాలి. ఇందులో ఒకరు ఎస్సీ లేదా ఎస్టీ సామాజిక వర్గానికి చెందినవారు ఉండాలి. రెండేండ్ల పాటు పదవీ కాలం ఉంటుంది. పిల్లలు బడి నుంచి వెళితే వారి స్థానంలో కొత్త సభ్యులను చేర్పించాలి. చైర్‌పర్సన్, కన్వీనర్లు జాయింట్ అకౌంట్ ఓపెన్ చేయాలి. అన్ని పనులు, ఆర్థిక లావాదేవీలకు పాఠశాల కమిటీ తీర్మానం తప్పనిసరి. నిర్ణయాలు, తీర్మానాల కోసం కనీసం 50శాతం సభ్యులు హాజరుకావాలి.

562 బడులు..30.63కోట్లు మంజూరు

హైదరాబాద్ జిల్లావ్యాప్తంగా మొత్తం 696 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. ఇందులో అద్దె భవనాలు, ఇతర వాటిని తీసేయగా.. 562 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటుతో పాటు మౌలిక వసతులను కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం జీఓ-5ని జారీ చేయగా.. యూడైస్ ఆధారంగా నిధులు విడుదల చేస్తారు. అయితే ఈ నెల 25 నుంచి పనులు ప్రారంభించి స్కూళ్లు ప్రారంభం నాటికి అంటే జూన్ 10లోగా ఆయా బడుల్లో పనులను పూర్తి చేయాలని సర్కారు అధికారులను ఆదేశించింది. ఇందుకోసం జిల్లాలోని మొత్తం 562 పాఠశాలలకు రూ.30.63 కోట్లు మంజూరు చేయగా.. ఇప్పటివరకు 478 స్కూళ్లలో రూ. 26.42 కోట్లు ప్రతిపాదిత పనులకు అంచనాలు పూర్తిచేయగా..మరో 14శాతం ప్రతిపాదిత పనుల అంచనాలు పూరి ్తచేయాలి. కాగా డీఈవో ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ పనులను కలెక్టర్ ఎప్పటికప్పుడు పర్య వేక్షించున్నారు.

కమిటీ ఏర్పాటులో అంతా గందరగోళం..!

జిల్లావ్యాప్తంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు అంతా గందరగోళంగా మారాయని తెలిసింది. జీవో-5 ప్రకారం డిప్యూటీ ఐవోఎస్‌ల ఆధ్వర్యంలో మొదట కమిటీలను ఏర్పాటు చేసి.. తర్వాత పాఠశాలలో కావాల్సిన పనులను గుర్తించి కమిటీ తీర్మానం చేయాలి. అనంతరం చైర్‌పర్సన్, మెంబర్ కన్వీనర్ (హెచ్‌ఎం) పేరిట బ్యాంకుల్లో ఉమ్మడి ఖాతా ఓపెన్ చేయాలి. ఈ విషయంలో డిప్యూటీ ఐవోఎస్‌లు తమకు నచ్చినట్టుగా వ్యవహరిస్తున్నారని తెలిసింది. జిల్లా కలెక్టర్, డీఈవో మెప్పు కోసం బడుల్లో మీటింగ్‌లు పెట్టకుండానే తమకు తెలిసిన విద్యార్థుల తల్లులను కమిటీల్లో సభ్యులుగా నియమించి.. వారిని ఒకరిని చైర్‌పర్సన్‌గా ఎంపిక చేస్తున్న పరిస్థితి ఉంది. అదేవిధంగా వారి పేర్లతో తీర్మానం కాపీలు తయారు చేసి బ్యాంకు ఖాతాలూ ఓపెన్ చేస్తున్నారు. వాస్తవానికి జీవో-5 ప్రకారం ఏఏపీసీలపై తొలుత పేరెంట్స్‌తో అవగాహన సమావేశం తర్వాతనే కమిటీలు వేయాల్సిన అధికారులు హెడ్‌మాస్టర్ల పై ఒత్తిడి తీసుకొస్తూ హడావుడి చేస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక తమకు తెలిసిన పేర్లనే కమిటీల్లో పెడుతుండడంతో సర్కారు ఆశించిన లక్ష్యం నెరవేరలేకపోతోందని పలువురు హెచ్‌ఎంలు వాపోతున్నారు. సరైన పనులను గుర్తించకుండా తూతూ మంత్రంగా తీర్మానాలు చేస్తే విద్యార్థులకు ప్రయోజనం చేకూరదని వారు చెబుతున్నారు. డిప్యూటీ ఐవోఎస్‌లు ఆదరబాదరాగా కమిటీలు ఏర్పాటు చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై కలెక్టర్, డీఈవో దృష్టిపెట్టాలని వారు కోరుతున్నారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 562 బడుల్లో 532 కమిటీలు ఏర్పాటు చేయగా.. వాటిలో 456 కమిటీలకు సంబంధించి బ్యాంకు ఖాతాలు తెరిచారు.

సివిల్స్ పరీక్ష ఫలితాల్లో 82వ ర్యాంకు సాధించిన మెరుగు కౌశిక్

- అనలాగ్ అకాడమీ డైరెక్టర్ శ్రీకాంత్



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రతిష్టాత్మకమైన యుపీఎస్సీ సివిల్స్ పరీక్ష లకు శిక్షణ అందించే ప్రముఖ అనలాగ్ ఐఏఎస్ అకాడమీ ఈ సంవత్సరం 50 మంది ర్యాంకులను దేశానికి అందించిందని అకాడమీ డైరెక్టర్ శ్రీకాంత్ అన్నారు. వెలువడిన సివిల్స్ పరీక్ష ఫలితాలలో అత్యుత్తమ ఫలితాలు అందుకున్న అనలాగ్ ఐఏఎస్ అకాడమీ సంస్థ ఆధ్వర్యంలో కవాడిగూడ బ్రాంచ్‌లో విలేకర్‌ల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి డైరెక్టర్ శ్రీకాంత్ హాజరై మాట్లాడుతూ హైదరాబాద్ కేంద్రంగా గల 22 సంవత్సరాలుగా ఎంతో మంది ఐఏఎస్ కావాలనే కలలను సాకారం చేశామన్నారు. సివిల్స్ ఫలితాలలో మొదటి వందలో 11 ,16 ,47 ,50 తో పాటు 50 ర్యాంకులను కైవసం చేసుకున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరింత మందిని తీర్చిదిద్దే ప్రయాణంలో తగిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. విద్యార్థులకు పరీక్షల శిక్షణ ఇచ్చే సమయంలో వ్యక్తిగతంగా ప్రతి అభ్యర్థికి తగిన రీతిలో ఉత్తేజపరుస్తున్నామన్నారు. దేశంలోనే అత్యుత్తమైన శిక్షకులుగా పేరుగాంచిన ఫ్యాకల్టీలతో పాఠశాలలో బోధించడంతో పాటు ఉన్నతమైన స్టడీ మెటీరియల్ను రూపొందించి అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడం అనలాగ్ ఐఏఎస్ అకాడమీ ప్రత్యేకత అని తెలిపారు. అదేవిధంగా అభ్యర్థుల ఇంటర్వ్యూలో బాగా రాణించడానికి వారికి తగిన రీతిలో శిక్షణ మెలకువలు అందిస్తున్నామని తెలిపారు.

పబ్లిక్ సెక్టర్ల మూసివేత ‘బీజేపీ’ ప్రధాన ముసాయిదానే

- ప్రభుత్వ రంగ పరిశ్రమల మూసివేతకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలి
- వీక్షణం మాసపత్రిక సంపాదకులు ఎన్.వేణుగోపాల్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

పబ్లిక్ సెక్టర్ల మూసివేత బీజేపీ ప్రభుత్వ ప్రధాన ముసాయిదా అని, ప్రభుత్వ రంగ పరిశ్రమల మూసివేతకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని రాజకీయ విశ్లేషకులు, వీక్షణం మాసపత్రిక సంపాదకులు ఎన్. వేణుగోపాల్ అన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కన్వెన్షన్ లో భాగంగా రెండవ రోజు జరిగిన సదస్సులో ‘పబ్లిక్ సెక్టర్ల మూసివేత-సమాజంపై ప్రభావం’ అనే అంశంపై ఎన్.వేణుగోపాల్ ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు.కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను రద్దు, ధ్వంసం చేస్తుందని ఆరోపించారు. గతంలో దేశంలో 5,000 వేలకు పైగా ప్రభుత్వ రంగ సంస్థలు ఉండేవని, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో కేవలం 2,900 పరిశ్రమలు మాత్రమే ఉన్నాయని, చిన్న తరహా పరిశ్ర మల మూసివేతకు కారణం ప్రధాని మోడీనేనని ధ్వజమెత్తారు. మోడీ హయాం లో లక్షలాది మంది నిరుద్యోగులు ప్రత్యక్షంగా ఉపాధి కోల్పోతే, పరోక్షంగా కోట్లాది మందిపై ప్రభావం పడిందన్నారు. రాష్ట్రంలో ఉన్న నిజాం చక్కెర ఫ్యాక్టరీకి 7 వేల ఎకరాల భూమి ఉందని, ఈ భూమిని ఇప్పుడు ప్రైవేట్ వ్యక్తుల కు అమ్మే కుటిల ప్రయత్నాలను పాలకులు చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో 186 కోట్ల మంది యువజనులు ఉంటే అందులో 28 శాతం భారతీయులేనన్నారు. నవ యువకులతో నవనవ లాడుతున్న యువజన దేశం భారత్ అన్నారు. ఏ దేశానికి లేనంత యువ సంపద మనకున్నప్పటికీ ఉత్తేజం, ఉత్సాహం కరువయ్యాయన్నారు. పాలకుల వినాశకర విధానాల కారణంగా దేశంలోని 30 శాతం మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అకాశాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లా ఖాద్రి, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సత్య ప్రసాద్, యుగంధర్, బిజ్జ శ్రీనివాసులు, పేరబోయిన మహేందర్, రాష్ట్ర సమితి సభ్యులు స్వప్న, షేక్ మహమూద్, మొగిలి లక్ష్మణ్, ఎల్లంకి మహేష్, చిలకరాజు శ్రీను, మార్కపూరి సూర్య మానస్ కుమార్, నాయీమ్, చిరంజీవి, మజీద్, అనిల్, కళ్యాణ్, సుశాంత్, వెంకన్న, శోభన్, రమేష్, శేఖర్, రాధ, రవి కుమార్, మస్క సుధీర్, రాజ్ కుమార్, ఆంజనేయులుతో జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఇంటి వద్ద
ఎర్రని బట్టలు, బొమ్మ, పసుపు, కుంకుమ కలకలం



- క్షుద్రపూజలంటూ వీడియో వైరల్
- పిల్లల అల్లరిగా తేలిన వైనం

నవతెలంగాణ-బంజారాహిల్స్

మాజీ సీఎం కేసీఆర్ నివాసం పక్కనే క్షుద్ర పూజల ఆనవాళ్లు కనిపించాయని కలకలం రేగింది. వివరాల్లోకెళ్తే.. బంజారాహిల్స్ నందినగర్‌లోని మాజీ సీఎం కేసీఆర్ ఇంటి వద్ద ఎర్రని బట్టలు,బొమ్మ, పసుపు కుంకుమ,వెంట్రుకలు నిమ్మకాయలతో ఉన్న ఫోటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారాయి. గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేశారంటూ వదంతులు వ్యాపించాయి. అయితే ఇవి కొంతమంది మాత్రం ఆకతాయిలు చేసిన అల్లరి చేష్టలుగా పలువురు వర్ణించారు. రీల్స్ చేసేందుకు ముగ్గురు పిల్లలు ఓ బొమ్మ, పసుపు, కుంకుమ, నిమ్మకాయలతో వీడియో చేసినట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనకు సంబంధించిన సమాచారం తెలుసుకున్న బంజారాహిల్స్ పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి ఆ బొమ్మలను అక్కడే కాల్చివేసి ఆ ప్రాంతాల్లో ఎవరు రాకుండా ఆ గేటుకు తాళం వేయించి ఆ ఖాళీ ప్రాంతంలో అనుమతి లేకుండా ఎవరూ వెళ్లకుండా చర్యలు చేపట్టారు.



మధ్యాహ్నం పరిమితం.. మిగితా వేళల్లో యధావిధిగా

నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో ఎండల తీవ్రత రోజురోజుకీ పెరుగుతోంది. దాంతో ఆర్టీసీ బస్సులు కేవలం పది నుంచి 20 మందితో రోడ్లపై తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికితోడు ఈ ఎండలతో ఆర్టీసీ సిబ్బంది సైతం చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో టీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రేటర్ హైదరాబాద్‌లో బుధవారం నుంచి మధ్యాహ్నం సమయంలో కేవలం బస్సు ట్రిప్పుల సంఖ్యను తగ్గించి నడపాలని నిర్ణయించింది. తొలిసారి నగరంలో ఈ ప్రయోగాన్ని అమలు చేస్తున్నట్టు సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. ముఖ్యంగా మధ్యాహ్నం పూట ప్రయాణికులు లేకపోవడంతో బస్సు టిప్పులు సంఖ్యను తగ్గించి నడుపుతా మని, ఇది నగరంలోని అన్ని ప్రధానమైన రూట్లలో అమలు కానుంది. కావున ప్రయాణికులు దీనిని గమనించి.. ఆర్టీసీ నిర్ణయానికి సహకరించాలని కోరారు. కాగా నేటి నుంచి మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బస్సు టిప్పుల సంఖ్య తగ్గనుంది. ఉదాహరణకు 5 నిమిషాలకో బస్సు నడిపే రూట్లో 10 నిమిషాలకు.. పది నిమిషాలకో నడిపే రూట్లో 15 నిమిషాలకొకటి నడపనున్నారు. సాయంత్రం 4గంటల నుంచి అర్ధ రాత్రి 12 గంటల వరకు యధావిధిగా సిటీ బస్ సర్వీస్‌లు ఆర్టీసీ నడపనుంది.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT: HAYATHNAGAR
I.A.NO. 846 OF 2021 IN O.S. NO. 414 OF 2021

Between:
P.Uma maheshwar Rao & others
...Petitioners/Plaintiffs
AND
Sheri Andalu & others
..Respondents/Defendants
To
Kota Rajesh S/o. Yellammda, R/o. Plot No.1, South End Park, Mansoorabad, Saroornagar, R.R. District – 500 035.

NOTICE

That the above named plaintiffs filed the above suit for Cancellation of Registered Sale Deeds bearing Document Nos.2513 of 2020 and 2515 of 2020 dated 11-03-2020 against you and others and the above suit is pending before the Hon'ble Junior Civil Judge, Ranga Reddy District At: Hayathnagar and the above suit is posted on 03-05-2024 for your appearance, failed the Court will take appropriate proceedings against you by said set ex-parte.

SUIT SCHEDULE "A" PROPERTY
All that the land bearing Plot No.126 Part, admeasuring 244 Sq.Yds., or 204.00 Sq.Mtrs, in Sy.No.131, Ward No.5, Block No.2, Near Bank Colony, situated at Sahebnagar Kalan Village, Hayathnagar, Revenue & Mandal,R.R.District, T.S and bounded by:North : Plot No.125, South : 30' wide Road & Plot No.126 Part,East : 25' wide Road & Plot No.126 Part
West : Plot No.105

SUIT SCHEDULE "B" PROPERTY
All that the land bearing Plot No.126 towards South East Part, admeasuring 23 Sq.Yds., or 19.23 Sq.Mtrs, in Sy.No.131, Ward No.5, Block No.2, Near Bank Colony, situated at Sahebnagar Kalan Village, Hayathnagar,Revenue &Mandal, R.R.District, T.S and bounded by:
North : Plot No.126 Part,
South : 30' wide Road,
East : 25' wide Road,
West : Plot No.126 Part,

(BY ORDER OF THE COURT)
D.NAGESHWARI
ADVOCATE
H.No.5-5-934/1, Agamaiah Nagar Colony, Chintalkunta, L.B.Nagar, R.R.District-500074.
Cell: 98496 64378

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
బుధవారం | ఏప్రిల్ 17, 2024 | www.navatelangana.com

రాష్ట్ర ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు

- డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతరెడ్డి, తెలంగాణ కార్మిక విభాగం అధ్యక్షులు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మోతెశోభన్‌రెడ్డిలు శ్రీరామనవమి శుభాకాంక్షలు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మ బద్ధ జీవనానికి నిలువెత్తు నిర్వచనం శ్రీరాముడు మనిషి జన్మకు ఉన్న విశిష్టతను చాటిచెప్పిన పురుషోత్తముడు అన్నారు. సీతా రాములను నిత్యం స్మరిం చడమే కాదు వారి జీవనయానాన్ని ఆదర్శంగా తీసుకుని వారు నడిచిన ధర్మ మార్గంలోనే మనం నడవడానికి నడుం కట్టా లన్నారు. పుణ్య దంపతులైన సీతారాముల శుభాశీస్సులతో మనందరి మన సులు ఎప్పుడూ మంచి ఆలోచనలతో నిండాలని కోరుకుంటూ రాష్ట్ర ప్రజ లందరికి రామ నవమి శుభాకాంక్షలు తెలిపారు.

కేజ్రీవాల్ అరెస్ట్‌కు ఓయూలో నిరసన



నవతెలంగాణ-ఓయూ

ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అక్రమ అరె స్టు ను ఖండిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళా శాల ఎదుట లెఫ్ట్ విద్యార్థి సంఘాల నాయ కులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ బీజేపీ పార్టీకి ఎవరైతే వ్యతిరేకంగా మా ట్లాడుతారో వారిని ఈడి పేరుతో అక్రమ అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ఇండియా కూటమిలో ముఖ్య నేత ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు చేయడం ఇండియా కూటమి దెబ్బతీసే ప్ర యత్నం మోడీ చేస్తున్నారని, ఇలాంటి వాటికి భయపడే ప్రసక్తి లేదన్నారు. ప్రశ్నించే వారిని అక్రమంగా అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదు అని హెచ్చరించారు. ఆఫ్ నేతలు యూత్ వింగ్ నేతలు, విజయ్ మల్లంగి, మణికంఠ రెడ్డి, సత్య , గ్యార నరేష్ , చైతన్య ,వికాస్ యాదవ్, సందీప్, రెహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్పీ రోడ్డు హనుమాన్ ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు

- ఆలయ ఈవో శ్రీనివాస్ శర్మ



నవతెలంగాణ-బేగంపేట్

ఎస్పీరోడ్డు హనుమాన్ ఆలయంలో ప్రతీ సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా శ్రీరామ నవమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహి స్తామని శ్రీహనుమాన్ దేవాలయం ఈవో ఎం. శ్రీని వాస్ శర్మ అన్నారు. మంగళవారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 10:30 నిమిషా లకు సీతారామ కల్యాణం జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్న నేపథ్యంలోవారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు, చలువ పందిళ్లను ఏర్పాటు చేశామని చెప్పారు.

కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్న చటారి దశరథ్

నవతెలంగాణ-ఓయూ



ఓయూ విద్యార్థి ఉద్యమ నాయకుడు బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశ రథ్ మంగళవారం తన పుట్టి నరోజు సందర్భంగా మా జీ సీఎం కేసీఆర్‌ను వారి వ్యవ సాయక్షేత్రంలో మర్యాద పూర్వ కంగా కలిసి ఆశీస్సులు తీసు కున్నారు. కేసీఆర్ దశరథ్‌కు శాలువా కప్పి ఆశీర్వదించారు.

ఖమ్మం ఎంపీ సీటు మల్లు నందినికే ఇవ్వాలి : డి.సలీమ్



నవతెలంగాణ-ఓయూ

ఖమ్మం పార్లమెంటు ఎంపీ టికెట్ మల్లు నందినికే ఇవ్వాలని ఉస్మానియా జేఏసీ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర విద్యార్థి నాయకుడు డి.సలీమ్ కోరారు. తెలంగాణ రాష్ట్రంలో మల్లు నందిని గత 20 సంవత్సరాలు కాలంగా ఖమ్మం జిల్లా లో ప్రజలతో మమేకమై కాంగ్రెస్ పార్టీ శాసనసభ ఎన్నికల్లో క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. అమ్మ ఫౌండేషన్ ద్వారా ఖమ్మం జిల్లాలో ప్రజలకు అనేక సేవలు చేశారని, తెలంగాణ రాష్ట్ర హక్కులు సాధించుకోవడానికి ప్రజాల గొంతుకై తెలంగాణలో ప్రజా సమస్యలపై తమ గలాన్ని పార్ల మెంట్‌లో ఎత్తడానికి ఖమ్మం టికెట్ నందిని కే కేటాయించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మధు, నరేష్, వినయ్, పరశురాం, సుదర్శన్ విద్యార్థి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఓయూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం



నవతెలంగాణ-ఓయూ

ఓయూఆర్ట్స్ కళాశాలలో యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం కార్యక్ర మం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పలు కళాశాల నుంచి వచ్చిన విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలం టీర్లు పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చే సిన ఓయూ వీసీ ప్రొ.రవీందర్, ప్రత్యేక అతిథులుగా ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ రామకృష్ణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.అర్జున్‌రావు, ఐపిఎం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శశిధర్‌లు అదే విధంగా పలు కళాశాలాల ప్రోగ్రా మ్ ఆఫీసర్లు పాల్గొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలోని ఎన్ ఎస్ఎస్ విద్యార్థులు 325 యూనిట్ల రక్తాన్ని సేకరించి ఐపిఎం నారా యణగూడ వారికి రక్తదానం అందజేసినట్లు తెలిపారు. ఆర్ట్స్ , ఇంజనీరింగ్, సైన్స్ కళాశాలలో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తార డిగ్రీ కాలేజ్, సంగారెడ్డి, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ (బాలురు) గజ్వేల్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ జహీరాబాద్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ సిద్దిపేట కళాశాలలు కూడా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజ యవంతం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ నవీన్ సౌదా అభినందనలు తెలియజేశారు.

రేవంత్ మాటలు మాదిగలు నమ్మరు

- మాదిగలకు అబద్ధాలు చెప్తున్న సీఎం
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న 3ఎస్సీ రిజర్వుడ్ ఎంపీ స్థానాలు, కంటోన్మెంట్ ఎస్సీ రిజర్వుడ్ అసెంబ్లీ స్థానాల్లో ఒక్క టికెట్ కూడా మాదిగలకు కేటా యించకుండా కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహం పట్ల మాదిగ ప్రజల హృదయాలు ఆవేదనతో రగిలిపోతున్నాయని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ అన్నారు. ఈసందర్భంగా మంగళవారం బౌద్ధనగర్ (పార్సిగుట్ట)లోని ఎమ్మార్పీ ఎస్ జాతీయ కార్యాలయం లో విల ేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిన్న రేవంత్‌రెడ్డి మాట్లాడిన మా టలు పుండు ముందు కారం చల్లినట్లుగా ఉన్నాయని, జరిగిన తప్పును సరిదిద్దుకోకుండా రేవంత్ రెడ్డి ప్రజల ముం దు ముఖ్యమంత్రి స్థాయిలో అబద్ధాలు చెప్పడం సరికాద న్నారు.రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీక రణ కోసం సు ప్రీం కోర్టులో నియమిం చిన ఉద్ధం డుడైన అడ్వకే ట్ ఎవరో, ఆయన పేరు ఏమిటో బయట పెట్టాలన్నారు. ఫిబ్రవరి 6,7,8 తేదీలలో సుప్రీం కోర్టులో విచారణ జరిగితే 6న, మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో సుప్రీం కోర్టుకు వచ్చిన బృందం ప్రెస్‌మీట్ పెట్టి వివేక్ టంకా అనే న్యాయవాదిని తెలంగాణ ప్రభుత్వం తరుపున నియమి స్తున్నట్లు ప్రకటించారు. మరి ఎవరు వాదనలు వినిపించారో సిఎం చెప్పాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంకెస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు సీహెచ్ సోమశేఖర్ హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి దప్పు దప్పు మల్లికార్జున్ మాదిగ, ఎంఎస్‌పీ జాతీయ నాయ కులు నలిమెల విజయరావు మాదిగ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు భైరపోగు శివమాదిగ, రఘు మాదిగ ఎమ్మార్పీఎస్ సీనియర్ నేతలు రాజశేఖర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

నివేదితను భారీ మెజార్టీతో గెలిపించండి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపు
- బీఆర్ఎస్ నాయకుల విస్తృతస్థాయి సమావేశం



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ అభ్యర్థి నివేదితను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. మంగళవారం మల్లారెడ్డి గార్డెన్‌లో కంటో న్మెంట్ బీఆర్ఎస్ నాయకుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత, మాజీ ఎమ్మెల్యే సాయన్న 30 ఏండ్ల నుంచి కంటోన్మెంట్‌కు సేవలు అందించారని, కంటోన్మెం ట్ గడ్డ బీఆర్ ఎస్ కంచుకోట అని స్పష్టం చేశారు. కంటోన్మెంట్ సమస్యలను ప్రస్తా వించే సత్తా ఉన్న పార్టీ బీఆర్ఎస్సే నన్నారు. గులాబీ పార్టీతోనే కంటోన్మెంట్ అభివృద్ధి సాధ్యమన్నారు. కొందరు చేసే తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని తేల్చిచెప్పారు. 19న నివేదిత నామినేషన్ కార్యక్రమం ఉంటుందని..20 నుంచి అన్ని వార్డుల్లోనూ పాదయాత్రలు మొదలవుతాయన్నారు. ఎమ్మెల్యే అభ్య ర్థి నివేదితను, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిం చాలని కంటోన్మెంట్ ప్రజలకు తలసాని విజ్ఞప్తి చేశారు. అన్నివర్గాల అభివృద్ధిని కాంక్షించే బీఆర్ఎస్ ను గెలిపించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కోరారు. కంటోన్మెంట్‌లో సొంతిల్లు కూడా లేకుండా అతి సాధారణ జీవితం గడుపుతున్న సాయన్న కుటుంబానికి అందరూ అండగా నిలవాలని కోరారు. కంటోన్మె ంట్‌తో పాటు మల్కాజ్‌గిరి ఎంపీ స్థానంలోనూ గులాబీజెం డా ను రెపరెపలా డించాలని కంటోన్మెంట్ ఎన్నికల బీఆర్ఎస్ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో చివరగా ప్రసంగించిన నివేదిత కన్నీటి పర్యంతమ య్యారు. తన తండ్రి, దివంగత ఎమ్మెల్యే సాయన్న తనకు అతిపెద్ద బీఆర్ఎస్ కుటుంబాన్ని ఇచ్చి వెళ్లారని తెలిపారు.కంటో న్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, నళిని కిరణ్, పాండు యాదవ్, లోకనాథ్, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప హరి, మార్కెట్ కమి టీ మాజీ చైర్మెన్ టీఎన్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఆకుల హరి, నర్సింహ యాదవ్, వేణుగోపాల్ రెడ్డి, పలువార్డుల అధ్య క్షులు, సీనియర్ నాయ కులు, యువ నాయకులు, కార్యకర్తలు, మహిళానేతలు, ఉద్యమకారులు, సాయన్న అభిమానులు సమావేశంలో పాల్గొన్నారు

హైదరాబాద్‌లో ఎన్ఓహెచ్ఓ బ్రాంచ్ ప్రారంభం



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ఉత్సాహపూరితమైన సిల్క్-రూట్ నుంచి ప్రేరణ పొందిన నోహెూ (ఎన్ఓహెచ్ఓ) ఒక స్వర్గధామంగా నిలుస్తున్నది. తాజాగా హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45లో నోహెూ తన బ్రాం చ్‌ను మంగళవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా నో హెూ మేన ేజింగ్ డైరెక్టర్ అమన్ చైనాని మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇక్కడ భోజనం ఒక అద్భుతమైన అనుభవంగా మారుతుందన్నారు. తనదైన విభాగంలో ఒక అద్భుతమైన కళా ఖండమైన నోహెూ, దాని పత్యేకమైన ఆసియన్ రుచికరమైన వంటకాలతో అద్భుతం చేస్తుందని తెలిపారు. సిజ్లింగ్ కొరియన్ స్టోన్ బౌల్స్ నుంచి జపనీస్ టెప్పన్యాకి కళాత్మకత, సుషీ అండ్ రోబాటా నైపుణ్యం వరకు, ప్రతీ వంటకం ఒక పాకశాస్త్ర కళాఖండంగా నిలుస్తుందన్నారు. నోహెూ లో ప్రధాన ఆకర్ష ణగా లైవ్ కౌంటర్లు ఉన్నాయని చె ప్పారు. ఇంద్రియాలను ఆకర్షిం చడంతో పాటుగా తమ కండ్ల ముందు రూపుదిద్దుకుంటున్న కలినరీ మాయాజాలంలో పాల్గొనడానికి అతిథులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఆసియన్ వంటకాల యొక్క గౌరవనీయమైన పద్ధతులు, వంటకాలు పాతుకుపోయినప్పటికీ, హద్దులను అధిగమించటానికి , విభిన్న రుచులు ,నేపథ్యాలతో ప్రయోగాలు చేయడానికి నోహెూ భయపడదన్నారు.సందర్శించిన ప్రతీసారి అతిథులకు అద్భుతమైన భోజన అనుభవాన్ని అంది స్తుందన్నారు. ఈ కలినరీ ప్రయాణాన్ని పూర్తి చేయడంలో నోహెూ ఖచ్చితమైన క్యూరేటెడ్ డ్రింక్స్ మెను తోడ్ప డుతుందన్నారు. నోహెూ ప్రోగ్రెసివ్ ఏషియన్ కిచెన్‌ను హైదరాబాద్ కమ్యూనిటీకి పరిచయం చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.

చిట్యాల రాజుకు ఓయూ డాక్టరేట్



నవతెలంగాణ-ఓయూ

ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం లో డాక్టర్ ఏ.వి కృష్ణ ప్రసాద్ పర్యవేక్షణ(గైడ్ షిప్)లో "ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ నెట్వ ర్క్‌కు అనుసంధానమయ్యే స్మార్ట్ డివైసెస్ అతంటికే షన్, డేటాసె క్యూరిటీ విష యంలో ఎదురయ్యే సవాళ్ల కు మిషన్ లెర్నింగ్ సహా యంతో పరిష్కార మార్గా లు" అనేఅంశంపై తన పరిశోధన గ్రంథా న్ని సమర్పించినందుకు ఓయు పరీక్షల విభాగం చిట్యాల రాజుకు ఓయూ డాక్ట రేట్ ప్రదానం చేసింది. సూర్యాపేట జిల్లా, నేరేడుచర్ల మండలం దిర్సించర్ల గ్రామంలో దావీదు, నీలమ్మ దంపతులకు మూడో సంతా నంగా జన్మించిన రాజు డాక్టరేట్ పొందటం పట్ల పలువురు అభినం దించి ప్రశంసలు కురిపిం చారు. డాక్టర్ రాజు తన భార్య కవిత, తల్లినిలమ్మ, గైడ్ సహకారంతోనే పీహె చ్డి పూర్తి చేసినట్లు చెప్పా రు. రాజుసైపరాబాద్ సైన్స్ కళాశాలలో కం ప్యూ టర్ సైన్స్ విభాగంలో అసిస్టెం ట్ ప్రొఫెసర్ (కాం ట్రాక్ట్)గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం రాజు రాష్ట్ర సెల్ఫ్ ఫైనాన్స్ టీచ ర్స్ అసోసియే షన్ వ్యవస్థాపక అధ్యక్షులుగా ఉన్నారు. మూడు పరిశోధన పత్రాలు జాతీయ అంతర్జాతీయ జర్నల్స్ లాలో ప్రచు రితమ య్యాయి. అంబేద్కర్ ఓపెన్ యూని వర్సిటీ ఓపెన్ లెర్నింగ్ విభాగంలో కంప్యూ టర్ సైన్స్ కోర్సులకు ఆయన రచించిన పుస్తకాన్ని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వారు ఉపయోగిస్తున్నారు.

ఒక్క అభ్యర్థికి రూ.95 లక్షల పరిమితి

- పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి
- ఈ నెల 18న నోటిఫికేషన్ విడుదల
- లేబర్ అడ్డాల వద్ద ఉండే కూలీలు, కార్మికులు ఓటింగ్‌లో పాల్గొనేలా అవగాహన

జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే అభ్య ర్థులు గరిష్ఠంగా రూ.95 లక్షల వరకు ఎన్నికల్లో ఖర్చు చేయవచ్చని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమి షనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు. మంగళ వారం జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం లోని పన్వర్ హాల్‌లో మీడియా ప్రతి నిధు ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18న నోటిఫికేషన్ విడుదల చేయబో తున్నామని, నోటిఫికేషన్ రాగానే నామి నేషన్లను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. సెలవు రోజు ఆదివారం మిన హా ఈనెల 18 నుంచి 25 వరకు రోజూ ఉదయం 11.00 గంటల నుంచి మధ్యా హ్నం 3.00 గంటల వరకు నామినేష న్లను స్వీకరి స్తారని తెలిపారు. దాఖలైన నామినేషన్లను ఈ నెల 26న పరిశీలించడం (స్క్రూటినీ) జరుగుతుందని, నామినేషన్ల ఉపసం హరణకు 29 చివరి గడువు అని చెప్పారు. మే,13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు. ఒక అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్‌లు దాఖలు చేయవ చ్చని, అభ్యర్థి వెంట మరో నలుగురిని మాత్రమే లోనికి అనుమతి స్తారని తెలిపారు. అభ్యర్థులు వారిపై ఏవైనా క్రిమినల్ కేసులు ఉంటే వాటి వివరాలు తప్పనిసరిగా న్యూస్ పేపర్, న్యూస్ చానల్స్‌లలో ప్రచు రితం చేయాలన్నారు. ఫైనల్ ఓటర్ జాబితా మేరకు జిల్లాలో మొత్తం 45,70,138 మంది ఓటర్లు ఉన్నారని, అందులో 23,30,574 మంది పురుషులు, 22,39,240 మంది మ హిళలు, 324 మంది థర్డ్ జండర్ ఉన్నారని తెలిపారు. సర్వీస్ ఓటర్లు 402 మంది, ఎన్నారై ఓటర్లు 846, పిడబ్ల్యుడి ఓటర్లు 22,995, 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 36,664 మంది ఉన్నారని వివ రించారు. 18-19 సంవత్సరాల వ యస్సు గలఓటర్లు 65,595 మంది ఉన్నట్టు తెలిపారు. 23.01.2024 నుండి 15.4.2024 వరకు 3,10,979 క్లెయిమ్స్ అండ్ ఆబ్జెక్షన్ వచ్చాయని, వాటిని ఏప్రిల్ 25లోగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో 1675 లొకేషన్లలో 3986 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు

ఈ సారి ఓటింగ్ శాతం పెంచేందుకు నగర వాసులకు అవగా హన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈవీఎం డెమోన్‌స్ట్రేషన్ సెంటర్లను ఏర్పాటు చేసి ఈవీఎం, వీవీ ప్యాట్లపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా, ఎన్నికల నిర్వహణ సిబ్బందికి శిక్షణను ఇచ్చా మని తెలిపారు. జిల్లాలో పట్టుకున్న నగదుకు సంబంధించి జిల్లా గ్రీవె న్స్ కమిటీలో ఆధారాలు అందజేసిన 24 గంటల్లో విడుదల చేస్తున్నా మని, ఇప్పటివరకు మొత్తం 73 కేసులకు సంబంధించి రూ. 2 కోట్ల 39 లక్షల 92 వేల 730లను విడు దల కోసం అభ్యర్థించగా అందులో 70 కేసులలో 1.70 కోట్ల రూపాయలు విడుదల చేశామని తెలి పారు. ఓటింగ్ శాతం పెరిగేలా విస్తతంగా వివిధ స్వీప్ కార్యక్రమాలు చేస్తున్నా మన్నారు. వీడియో క్యాంపెయిన్, ఇంటింటికి స్టిక్కర్ క్యాంపెయిన్ చేస్తున్నామని తెలిపారు. ఓటర్లను చైతన్య పరి చేలా రూపొందించిన 10 బెస్ట్ వీడియోలకు అవా ర్డులు ఇవ్వనున్నట్టు తెలిపారు. రెసిడెన్షి యల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారిని ఓటర్లను చైతన్య పరచడంలో భాగస్వాములను చేస్తున్నామని, ఎన్నికల రోజున లేబర్ అడ్డాల వద్ద ఉండే కూ లీలు, కార్మికులు ఓటింగ్‌లో పాల్గొనేలా చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు. పిడబ్ల్యుడి, ఉమెన్, యూత్, మోడల్ పోలింగ్ బూత్ లను ఏర్పాటు చేస్తున్నట్టు, అదేవిధంగా అన్ని పోలింగ్ కేంద్రాల లో కనీస మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చె ప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగే లా అందరూ సహకరించాలని, పోలింగ్ ప్రక్రియలో జిల్లాలోని ప్రతీ ఓటరు పాల్గొని ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ పార్లమెంట్ స్థానానికి హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను జిల్లా కలెక్టర్ స్వీకరిస్తారని, సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో, అడిషనల్ కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి, సీఈఓ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో హైద రాబాద్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ అదనపు కలెక్టర్, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎన్నికల అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించి ఆదుకోండి

టీఎమ్ఆర్ఈఐ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ నాన్ టీచింగ్ స్టాఫ్ అసోసియేషన్



నవతెలంగాణ-బంజారాహిల్స్

మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించి తమను ఆదుకోవాలని మైనారిటీ రెసి డెన్షియల్ పాఠశాలలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ ్ఞప్తి చేశారు. మంగళవారం సో మాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో టీఎం ఆర్ఈఎస్ ఆధ్వ ర్యంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. అసోసి యేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజ్ మహమ్మద్, రేష్మ ఫర్వీన్‌లు వారి గోడును వెళ్లబోసు కు న్నారు. చాలీచాలని వేతనాలతో తమ జీవితాలు దుర్భ రంగా మారాయని కన్నీరు మున్నీరయ్యారు. రాష్ట్ర వ్యాప్త ంగా 269 మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో 4300 మంది నాన్ టీచింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. సీనియర్ అసిస్టెంట్,జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సభార్డినేట్‌తో పాటు సెక్యూరిటీ, హౌస్ కీపింగ్, కుకింగ్ స్టాఫ్ విభాగాలలో పనిచేస్తున్న తమ పట్ల తీవ్ర వివక్ష ప్రదర్శిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పర్మినెంట్ ఉద్యోగులతో సమా నంగా విధులు నిర్వహిస్తున్నా ప్రయోజనం లేకుండా పోతున్నదన్నారు. వచ్చే కొద్దిపాటి వేత నాన్ని ఏజెన్సీల ద్వారా తీసుకోవాల్సి రావడంతో మరింత నష్టపోవాల్సి వస్తుందని వాపో యారు. పెరుగుతున్న ధరలు కనుగుణంగా వేతనాలు సవరించి ఇవ్వాలని కోరారు. ఇటీవల మూడు విభాగాలకు చెందిన సిబ్బందికి పీఆర్సి చెల్లించిన ప్రభుత్వం తమను విస్మరించిందని వాపోయారు. మానవతా దక్పథంతో ప్రభుత్వమే నేరుగా చెల్లించాలని మొరపెట్టుకున్నారు. అసోసియేషన్ నాయకులు రఫీ అబ్దుల్ షఫీ సతీష్ అబ్దుల్ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఆయుర్వేద మందులు విక్రయిస్తున్న నిందితుల అరెస్ట్



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

నకిలీ ఆయుర్వేద మందులు విక్రయిస్తూ రోగులను మోసం చేస్తున్న నిందితులను అరె స్టు చేసిన ఘటన మధురానగర్ వెస్ట్‌జోన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ సందర్భంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో నకిలీ ఆయుర్వేద మందులు విక్రయిస్తూ మోసం చేస్తున్న నిందితులను అరెస్టు చేసి వారి వద్ద సేకరించిన సమా చారం ప్రకారం, ఎస్సార్ నగర్, పంజాగుట్ట ఏసీపీ ఎస్సార్ నగర్ ఏసీబీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక, నాగపూర్‌కు చెందిన నిందితులు ఒక గ్రూపుగా ఏర్పడి, దీర్ఘకాలిక రోగులను గుర్తించి వారికి ఆయుర్వేదం మందు ఉందని చెప్పి, అది వాడితే పూర్తిగా రోగాలు తగ్గుతాయని మోసం చేస్తున్నారన్నారు. వారి ఫోన్ నెంబర్ సేకరించి తర్వాత వేరే ఆయుర్వేద మెడిసిన్ షాపుల ద్వారా ఫోన్ చేయించి మాయమాటలు చెప్పి. రోగిని పరిశీలించి, మా వద్ద మంచి వనమూలికలతో మందులు తయారు చేస్తామని నమ్మబలికి మనషులను మోసం చేస్తారన్నారు. అదేవిధంగా వెస్ట్‌జోన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సుమారు 6 నకిలీ ఆయుర్వేద మెడికల్ షాపులను కూడా గుర్తించా మని, కొంతకాలం తర్వాత ఆ మెడికల్ షాపులు కూడా పూర్తిగా తీసివేస్తారన్నారు. ఇలా అనేక మందిని మాయమాటలు చెప్పి అనేకమందిని మోసం చేసినట్లు తెలిపారు. సుమారు 19 లక్షల వరకు అనేకమంది వద్ద వసూలు చేసినట్లు ఆధారాలు సేకరించి వారిపై కేసులు నమోదు చేశామన్నారు. మధురానగర్, నారాయణగూడ, బేగంపేట, ఫిలింనగర్ ,కుకట్‌ప ల్లి, గోల్కొండ, ఎస్సార్ నగర్, మారేడుపల్లి, బోరబండ, పంజాగుట్ట తదితరల పోలీస్ స్టేషన్ పరిధిలో అనేక మందిని మోసం చేసినట్లు నిర్ధా రించారు. వీరు చేసిన మోసాలపై ఇంకా లోతుగా విచారిస్తున్నామని, అసలు ఎంతమంది ఉన్నారనేది త్వరలో వివరాలు సేకరించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంజాగుట్ట ఏసీపీ మోహ న్ కుమార్, ఎస్సార్ నగర్ ఏసీపీ, పి.వెంకటరమణ ఎస్సార్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి, మధురానగర్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి 20 వరకు టెక్నో కల్చరల్ ఫెస్ట్ టెక్నోస్మానియ



- ముమ్మరంగా ఏర్పాట్లు..విద్యార్థుల బైక్ ర్యాలీ
- అలరించనున్న సాంస్కృతిక కార్యక్రమాలు

నవతెలంగాణ-ఓయూ

ఓయూ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యలో విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ నెల 18నుంచి20 వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి టెక్నో కల్చ రల్ ఫెస్ట్‌టెక్నో స్మానియ-2024 సందర్భంగా సన్నాహక కార్యక్ర మం గా విజయవంతం కోసం బైక్ ర్యాలీని కన్వీనర్ ప్రొ.ఎస్.శ్రీనునాయక్ ఆధ్వర్యలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య చింతసాయిలు ప్రారంభిం చారు. అంతకుముందు కళాశాల ఆవరణలో బ్రోచర్స్ విడుదల చేసి మాట్లాడారు. మంగళవారం రాత్రి సాయం త్రం ఇసిఐయల్ ఏ.ఎం. ఆర్.ప్లానెట్‌లో విద్యార్థులు సాయంత్రం ఫ్లాష్ మ్యాబ్ నిర్వహిం చారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.చింతసాయిలు ఈ కార్యక్రమలను ఉద్దేశించి మా ట్లాడుతూ విద్యార్థులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజ యవంతం చేయాలన్నారు. కన్వీనర్ ఆచార్య ఎస్.శ్రీనునాయక్ మాట్లా డుతూ నేటి ఉదయం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎన్.సి.సి.గేట్ నుండి టెక్నాలజీ కళాశాల వరకు 'ప్రతి నీటి చుక్కను కాపాడుదాం' అనే నినాదంతో 3కె రన్‌ను నిర్వహిస్తా మ న్నారు. టెక్నోస్మానియ 2024లో డిపార్టుమెంట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో కేటాలసిస్, డిపార్టుమెంట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఫుడ్ సిని ర్జిసం, డిపార్టుమెంట్ ఆఫ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీ ఆధ్వర్యంలో టెక్స్ క్రోమ, డిపా ర్టుమెంట్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో టెక్నో ఫార్మా హెూటల్ మేనేజ్మెంట్ ఆధ్వ ర్యంలో టెక్నో హాస్పిటాలిటీ కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరి ంచారు.దేశ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, పారిశ్రామిక వేత్తలు తమ తమ విభాగాలలో పరిశోధన పత్రాలు సమ ర్పించను న్నట్టు చెప్పారు. ఈ కార్య క్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.వి. రమేష్ కుమార్, ప్రొ.వి.వి.బసవరావు,ప్రొ. జి.ప్రభాకర్ రెడ్డి, ప్రొ.బి.రాజం, ఫ్యాకల్టీ కో ఆర్డి నేటర్స్ డా.ఏ.పరశురాములు, డా.బి. పరమేశ్వర్లు, డా.సాదంబలయ్య, కళాశాల అధ్యాపకులు ,విద్యార్థులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

తామర కాండంతో ప్రయోగాలు..

కాదేదీ కవితకు అనర్హం అన్నట్టు... కాదేదీ వ్యాపారానికి అనర్హం అని రుజువు చేసింది బిజియశాంతి... మణిపూర్‌కు చెందిన ఈ పారిశ్రామికవేత్త తామర కాండంతో ప్రయోగాలు ప్రారంభించింది. ఎంతో కృషి చేసి వాటితో బట్టలు తయారు చేస్తోంది. మణిపూర్‌లోని థాంగా గ్రామంలోని తన ఇంటికి సమీపంలో ఉన్న లోక్‌టాక్ సరస్సులో లభించే తామరపువ్వులను దీని కోసం ఉపయోగిస్తోంది. తామర కాండం పీచుతో కండువాలు, మఫ్లర్లు, స్టోల్స్‌తో పాటు నెక్ టైస్ వంటి ఉత్పత్తులను తయారు చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంటున్న ఆమె పరిచయం నేటి మానవిలో...



వృక్షశాస్త్రజ్ఞురాలైన బిజియశాంతి తామర కాండం నుండి ఫైబర్‌ని సేకరించి, సహజ రంగులు వేసిన స్టోల్స్, స్కార్ఫ్‌లు, మఫ్లర్‌లు, నెక్ టైస్ వంటి విభిన్న ఉత్పత్తులను తయారు చేస్తున్న దేశంలోనే మొదటి వ్యక్తి. అయితే రెండేండ్లు తను ఉత్పత్తులను ప్రదర్శించడానికి, విక్రయించడానికి చాలా ప్రయత్నిస్తోంది. కానీ తీసుకునేవారు లేకపోవడంతో నిరాశ చెందింది. వీటిపై ప్రజలకు అవగాహన లేకపోవడం దీనికి ప్రధాన కారణం. చివరకు తన నైపుణ్యంతో ఉత్పత్తులను ప్రజల్లోకి తీసుకెళ్ళగలిగింది.

పర్యావరణ అనుకూలమైన ఫాబ్రిక్

బిజియశాంతి మణిపూర్‌లోని బిష్ణుపూర్ జిల్లాలోని లోక్‌తక్ సరస్సుకు సమీపంలోని తంగా గ్రామంలో పెరిగింది. తన గ్రామంలో పాఠశాల విద్యను పూర్తి చేసిన తర్వాత ఆమె వృక్షశాస్త్రంలో గ్రాడ్యుయేట్ డిగ్రీ కోసం ఇంఫాల్‌కు వెళ్లింది. తర్వాత అగ్రి టూరిజం వ్యాపారాన్ని ప్రారంభించింది. కానీ అది పెద్దగా పని చేయలేదు. లోక్‌తక్ సరస్సులో సమృద్ధిగా పెరిగిన తామర పువ్వులు చూసి ఆమె ఎప్పుడూ మురిసిపోతుండేది. వాటిని చూస్తున్న ఆమె మనసులోకి ఓ విచిత్రమైన ఆలోచన ప్రవేశించినట్టు ఆమె గుర్తుచేసుకుంది. కమలాన్ని వివిధ ఉత్పత్తులను తయారు చేయడానికి ఎందుకు ప్రయత్నించకూడదు అని తీవ్రంగా ఆలోచించింది. తామర పువ్వు, దాని లక్షణాలను అర్థం చేసుకోవడానికి పత్రికలతో పాటు పరిశోధనా అధ్యయనాలను పరిశీలించింది.



తామరలో ఔషధ విలువలు

పువ్వును ఉపయోగించినప్పుడు సాధారణంగా కాండం వృధా అవుతుందని ఆమె అర్థం చేసుకుంది. దీన్ని బేస్‌గా ఉపయోగించి ఆమె పర్యావరణ అనుకూల బట్టల గురించి మరింత అధ్యయనం చేసింది. ఫైబర్‌ను తయారు చేయడానికి తామర కాండంతో ప్రయోగాలు చేయాలని నిర్ణయించుకుంది. ఈ ఆలోచన 2017లో ఆమె మదిలో వేళ్లూనుకుంది. తామర కాండం నుండి పీచును తీయడానికి రెండేండ్లు శ్రమించింది. మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (MSME) మంత్రిత్వ శాఖ నిర్వహించిన వ్యవస్థాపక శిక్షణ కార్యక్రమంలో కూడా చేరింది. 'తామర మొక్కలో చాలా ఔషధ విలువలు ఉన్నాయని నా పరిశోధనలో తెలుసుకున్నాను. తామర రేకుల నుండి టీ తయారు చేయవచ్చు. అంతేకాదు దీని కొమ్మ అత్యంత పర్యావరణ అనుకూలమైన ఫైబర్‌లలో ఒకటి. ఇది సహజంగా మృదువైన ఫాబ్రిక్, దాదాపు ముడతలు లేనిది' అని ఆమె పంచుకుంది.





మహిళా సమిష్టి శక్తి

బిజియశాంతి తెల్లవారుజామున సరస్సుకు వెళ్ళి, కాండాలను సేకరించి, ఫైబర్‌లను మృదువుగా చేయడానికి వాటిని ఒక రోజు నీటిలో నానబెడుతుంది. చిన్న కత్తితో తంతువులను తీసి కాండాలను కత్తిరిస్తుంది. అరచేతికి ఒక ప్లాంక్ ఉపయోగించి ఫైబర్ చుడతారు. ఈ ఫైబర్ వివిధ ఉత్పత్తులను నేయడానికి ఉపయోగిస్తారు. 'నేను 2019లో సనాజింగ్ సనా తంబల్ అనే సమిష్టిని ప్రారంభించాను. స్థానికంగా ఉన్న 10 మంది మహిళలతో కలిసి ఫైబర్‌ల నుండి దారాన్ని తీయడంలో సహాయం చేసాను. వారి ఇళ్లల్లోనే దీన్ని ఎలా చేయాలో వారికి నేర్పించాను. ఇది వారి కుటుంబాలను పోషించడానికి అవసరమైన ఆదాయాన్ని కూడా ఇస్తుంది. మా ప్రాంతంలోని చేనేత కార్మికులతో కూడా కలిసి పనిచేశాను. వారు వివిధ ఉత్పత్తులను రూపొందించడానికి లోటస్ స్టెమ్ ఫైబర్‌లతో పనిచేయడం ప్రారంభించారు' అని బిజియశాంతి జతచేస్తుంది.

దీని ప్రక్రియే కష్టం

సమిష్టి సమూహంలో ఇప్పుడు 30 మంది మహిళలు ఉన్నారు. ఇద్దరు నేత కార్మికులు తంగాలోని యూనిట్‌లో పూర్తి సమయం పని చేస్తున్నారు. ఉత్పత్తులు సనాజింగ్ సనా తంబల్ వెబ్‌సైట్‌తో పాటు దాని ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా విక్రయించబడ తాయి. అవసరాలకు అనుగుణంగా కూడా అనుకూలీకరించబడతాయి. మహిళలు చేసే పని, గంటల ప్రకారం నెలకు రూ. 7,000–12,000 మధ్య సంపాదిస్తారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాపారాన్ని నిలబెట్టుకోవడానికి నెలకు మూడు నుండి ఐదు ఆర్డర్‌లు సరిపోతాయని ఆమె అంటుంది. పెద్ద ఆర్డర్‌ల కోసం ఆమె మొదటి నుండి ప్రయత్నిస్తూనే ఉంది. ఆమె తన వ్యాపారానికి అవసరమైన టెక్నాలజీ, మార్గదర్శకత్వం కోసం నార్త్ ఈస్ట్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఫండ్, అస్సాం అగ్రికల్చరల్ యూనివర్శిటీ నుండి మద్దతు పొందింది. ఇటీవల ఆమె టెక్సాస్ నుండి భారీ ఆర్డర్‌ను తిరస్కరించవలసి వచ్చింది. ఎందుకంటే అది యూనిట్ డిమాండ్‌కు అనుగుణంగా లేదు. ఆమె ప్రధాన సవాలు ప్రక్రియ కోసం పట్టే సమయం.

నిధుల కోసం చూస్తున్నాను

'ఈ ఉత్పత్తుల ధర చాలా ఖరీదైనది. ఒక స్కార్ఫ్ ధర రూ. 18,000 ఉంటుంది. ఒక మీటర్ ఫాబ్రిక్ రూ. 27,000 నుండి మొదలవుతుంది. అలాగే తామర కాండం సేకరించడం, ఫైబర్ తీయడం, నేయడానికి సమయం పడుతుంది. ఒక్క స్కార్ఫ్ తయారు చేయడానికి రెండు నెలలు పడుతుంది. అలాగే కాండం ముందే సేకరించి నిల్వ చేయలేము. వాటిని తాజాగా ఉపయోగించాలి. నేను నా వ్యాపారాన్ని స్కేల్ చేయాలని ఆశిస్తున్నాను. దీనికి అవసరమైన నిధుల కోసం చూస్తున్నాను. ఎక్కువ మంది మహిళలకు ఉపాధి కల్పించాలని, లోటస్ స్టెమ్ ఫైబర్‌తో మరిన్ని ఉత్పత్తులను తయారు చేయాలని, పెద్ద మార్కెట్‌లలోకి ప్రవేశించాలని కోరుకుంటున్నాను" అని ఆమె చెప్పింది.

పంటి నొప్పిని తగ్గించే చిట్కాలు..

చాలా మందిని వేధించే సమస్య పంటి నొప్పి. దంతాలు పుచ్చిపోవడం, ఇన్ఫెక్షన్, కొత్తగా దంతాలు రావడం, దంతాల్లో పగుళ్ల రావడం, చిగుళ్ల వ్యాధులు తదితర కారణాల వల్ల పంటి నొప్పి వస్తుంది. ఒక్కసారి పంటి నొప్పి వచ్చిందంటే ఒక పట్టాన తగ్గదు. దీంతో బాధ భరించలేక చాలా మంది డాక్టర్‌ను ఆశ్రయిస్తుంటారు. కానీ తీరిక లేకపోవడం వల్ల హాస్పిటల్‌కు వెళ్లడం కుదరకపోయిన వారు.. ఈ కింది చిట్కాలు పాటించడం వల్ల పంటి నొప్పి నుంచి ఉపశమనం పొందొచ్చు.

- లవంగాలతో పంటి నొప్పి నుంచి రిలీఫ్ పొందొచ్చు. లవంగాల్లో ఉండే యుగేనల్ అనే రసాయన పదార్థం తేలికపాటి మత్తును కలిగిస్తుంది. నొప్పి వచ్చే దంతం దగ్గర లవంగాన్ని ఉంచి కొద్దికొద్దిగా నమలడం వల్ల అందులోని నూనె విడుదలై పంటి నొప్పి తగ్గుముఖం పడుతుంది. మార్కెట్లో లభించే లవంగ నూనెను నొప్పి వచ్చే చోట రాసినా ఫలితం ఉంటుంది. లవంగం నూనెను నేరుగా రాయకుండా.. దూదిపై రెండు చుక్కలు వేసి నొప్పి వచ్చే దంతాలపై ఉంచాలి.
- వేడి నీటిలో ఉప్పు వేసి కరిగాక పుక్కించాలి. ఇలా చేయడం వల్ల సహజమైన యాంటి సెప్టిక్‌లా పని చేస్తుంది. కనీసం 30 సెకన్లపాటు ఉప్పు నీటిని పుక్కిలించి ఉమ్మేయడం వల్ల దంతాల చుట్టూ పేరుకుపోయిన వ్యర్థాలు బయటకు వెళ్తాయి. ఇన్ఫెక్షన్ పెరగకుండా కూడా చూసుకోవచ్చు. రోజూలో వీలైనన్ని సార్లు ఇలా పుక్కిలించడం వల్ల సూక్ష్మజీవులు నశించి నొప్పి తగ్గుముఖం పడుతుంది.
- ఐస్ క్యూబ్‌లను ప్లాస్టిక్ బ్యాగ్‌లో వేసి పలుచటి గుడ్డతో చుట్టాలి. నొప్పి పెట్టే పంటిపై ఈ బ్యాగ్‌తో నెమ్మదిగా ఒత్తడం వల్ల ఫలితం ఉంటుంది. వాపు కారణంగా వచ్చిన నొప్పి తగ్గడంలో ఈ ట్రిక్ ఎంతగానో ఉపకరిస్తుంది.

రాజకీయ క్షేత్రంలో రాముడు

(మొదటిపేజీ తరువాయి)

అనేకం దక్షిణ అయోధ్య భద్రాచలంతో ముడిపడివున్నా ఇక్కడి రాముడు నిర్లక్ష్యానికి గురవడం వెనుక రాజకీయం తప్ప మరో కారణం లేదనే అభిప్రాయం పలువురిలో ఉంది. అయోధ్య ఉన్న ఉత్తరప్రదేశ్‌లో 80 లోక్‌సభ స్థానాలు ఉండటంతోనే అయోధ్య రాముని మీద భక్తి ప్రదర్శిస్తున్నారనే విమర్శ బీజేపీపై ఉంది.

హెరిటేజ్ హోదా లేదు.. రైలూ రాదు..

భద్రాద్రికి కూడా పౌరాణిక ప్రాధాన్యత చాలానే ఉందని భక్తులు నమ్ముతున్నారు. అయినా భద్రాద్రి విషయంలో కేంద్రం నిర్లక్ష్యం వహిస్తూనే ఉంది. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా వెంకయ్యనాయుడు హయాంలో ప్రాశస్త్యం కలిగిన స్థలాలకు హెరిటేజ్ సిటీ హోదా ఇచ్చారు. కానీ ఎంతో విశిష్టత కలిగిన వారసత్వ ప్రాంతాల జాబితాలో భద్రాచలానికి చోటు దక్కలేదు. రూ.లక్ష కోట్లతో బుల్లెట్ రైళ్లు, వందే భారత్ రైళ్లు, దేశంలోని పలు నగరాల నుంచి అయోధ్యకు రైళ్ల ఏర్పాటు చేసిన సర్కారు నిజంగా రామునిపై భక్తి ఉంటే ఇంతకాలంగా భద్రాచాలనికి రైలుమార్గం ఎందుకు ఏర్పాటు చేయలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. భద్రాచలానికి కేవలం 5 కి.మీ దూరంలోని పాండురంగాపురం వరకు రైల్వే లైన్ ఉన్నా కనీసం రూ.50 కోట్లు ఖర్చు పెట్టి రైల్వేలైన్ నిర్మించడంలో కేంద్రం నిర్లక్ష్యం ఉందనే విమర్శలున్నాయి.

భద్రాద్రి పరిరక్షణ మరిచి నిర్వీర్యం..!

భద్రాచలం పరిరక్షణ మరిచిన కేంద్ర ప్రభుత్వం చివరకు దాని నిర్వీర్యంలో భాగస్వామవుతోంది. రామాలయం తెలంగాణలో ఉండగా సుమారు వెయ్యి ఎకరాల రామాలయ భూములను, పోలవరం ముంపులో లేనప్పటికీ ఐదు పంచాయతీలను ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చారు. గుండాల, పురుషోత్తపట్నం, పిచ్చుకలపాడు, కన్నాయిగూడెం, ఎటపాక పంచాయతీలను ఆర్డినెన్స్ ద్వారా ఏపీలో కలిపారు. రాముడు తెలంగాణలో.. రామాలయ భూములు ఆంధ్రాలో ఉండటం వల్ల కనీసం చెత్త డంపింగ్‌కు కూడా స్థలం లేని దుస్థితి. అర్థచంద్రాకృతిలో రెండుగా ఉన్న భద్రాచలంలో ఓవైపు గోదావరి, మరోవైపు ఆంధ్రప్రదేశ్ భూములున్నాయి. ఫలితంగా భద్రాచలంలో డంపింగ్‌యార్డు సైతం ఏర్పాటు చేసుకోవడానికి స్థలం లేదు. దీనివల్ల భద్రాచలం పట్టణాభివృద్ధి శాశ్వతంగా భూస్థాపితం అయింది. ఈ నేపథ్యంలో రామభక్తులకు నిలువ నీడలేకుండా చేసింది మోడీ ప్రభుత్వం కాదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్థలం లేని కారణంగా కొత్తగూడెం జిల్లా కేంద్రాన్ని భద్రాచలంలో కాకుండా పాల్వంచలో ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నాటి బీఆర్ఎస్ పాలకులది సైతం అదే తీరు..

గత బీఆర్ఎస్ పాలకులు సైతం భద్రాచలం విషయంలో నిర్లక్ష్యాన్నే సాగించారు. హైదరాబాద్ సమీపంలో ఉన్న యాదాద్రి లక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని పునర్నిర్మించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. రాముడు కొలువుదీరిన భద్రాచలంపై ఏమాత్రం శ్రద్ధ పెట్టలేదు. తానీషా ప్రభువు కాలం నుంచి ఆనవాయితీగా వస్తున్న ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాల సమర్పణ విషయంలోనూ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు చిన్నచూపే చూశారు. కేవలం ఒక్కసారి మాత్రమే పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు కేసీఆర్ సమర్పించడం గమనార్హం. రూ.వంద కోట్లు అని ఒకసారి, రూ.వెయ్యి కోట్లు అని మరోసారి హామీ ఇచ్చిన కేసీఆర్ భద్రాచలం అభివృద్ధికి ఒక్క పైసా కేటాయించిన దాఖలాలు లేవు. అమిత్‌షా, మోడీ ఎన్నో సార్లు రాష్ట్రానికి వచ్చారు. ఒక్కసారైనా భద్రాచలం వచ్చారా? అనే ప్రశ్నలు స్థానిక రామభక్తులు లేవనెత్తుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో బుధవారం నిర్వహించే శ్రీ సీతారాముల కళ్యాణానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు ఇప్పటికే విచ్చేశారు.

భద్రాచలం రాజకీయంగా ఉపయోగపడదనే..

– మిడియం బాబూరావు, మాజీ ఎంపీ, ఆదివాసీ నాయకులు

భద్రాచలం రాజకీయంగా ఉపయోగపడదనే బీజేపీ నిర్లక్ష్యం చేస్తోంది. అయోధ్య ఉన్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో మొత్తం 80 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. కేంద్రం భద్రాచలానికి పర్యాటక క్షేత్రంగా లేదా హెరిటేజ్ పట్టణంగా నిధులు ఇవ్వవచ్చు. రావణుడు ఏలిన శ్రీలంకలో రామాయణ సర్క్యూట్ పెట్టి పర్యాటకులను ఆకర్షిస్తుంటే భద్రాచలాన్ని ఎందుకు టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయకూడదో ఆలోచించాలి. కేంద్రానికి ఆదివాసీలు, ఆదివాసీ సంస్కృతులు అక్కర్లేదు. వాళ్లు నిజంగా రామభక్తులు కాదు.. రాజకీయం కోసమే రామున్ని వాడుకుంటున్నారు. వేల కోట్లు వెచ్చించి అయోధ్య రామాలయాన్ని నిర్మించిన కేంద్రం రూ.వంద కోట్లు పెట్టి భద్రాచలాన్ని అభివృద్ధి చేయలేదా..?

పతంజలికి వ్యవస్థ దాసోహం

(మొదటిపేజీ తరువాయి)

విశ్లేషకులు అంటున్నారు. అయితే, పతంజలి ఇలా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన విధానంలో వ్యవస్థ దాసోహమైం దని నిపుణులు చెప్తున్నారు. కేంద్రంలోని మోడీ సర్కారు, ఇటు ఉత్తరాఖండ్‌లోని బీజేపీ ప్రభుత్వాలు బాబా రాందేవ్‌ను నియంత్రించలేదని అంటు న్నారు. అలాగే, ఒక వర్గం మీడియా, ఉన్నతాధికారులు సైతం పతంజలి విషయంలో ఉదాసీనంగా వ్యవహరించారని చెప్తున్నారు.

'ది హిందూ', 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' వంటి కొన్ని ఆంగ్ల భాషా వార్తాపత్రికలు ఇప్పుడు పతంజలికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు చర్యకు మద్దతుగా సంపాదకీయాలను ప్రచురించాయి. చట్టాన్ని ఉల్లంఘిస్తూ వచ్చిన ప్రకటనలను ప్రచురించటంలో కొన్ని పత్రికలు పోషించిన పాత్రకు సంబంధించి వివరించిన ఈ సంపాదకీయలను అంగీకరించాలని విశ్లేషకులు అంటున్నారు. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ (అభ్యంతరకరమైన ప్రకటన) చట్టం, 1954 ప్రకారం.. ఆ చట్టంలో పేర్కొన్న షరతులకు చికిత్స చేయడానికి ఉద్దేశించిన డ్రగ్స్ కోసం తప్పుదోవ పట్టించే ప్రకటనలను ప్రచురించటానికి పతంజలి మాత్రమే కాదు.. ప్రెస్ కూడా బాధ్యత వహిస్తుంది. కాబట్టి, ప్రకటనలను ప్రచురించిన, ప్రసారం చేసిన అన్ని వార్తాపత్రికలు, మీడియా సంస్థలు చట్టాన్ని ఉల్లంఘించినందుకు పతంజలి వలె బాధ్యత వహిస్తాయని విశ్లేషకులు అంటున్నారు.

పతంజలి "డ్రగ్స్" తయారీకి లైసెన్స్‌ని జారీ చేసిన ఉత్తరాఖండ్ డ్రగ్ కంట్రోలర్ పాత్రనూ నిపుణులు, విశ్లేషకులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. పతంజలి చాలా ప్రకటనలు బీజేపీ పాలిత పలు రాష్ట్రాల్లోని అనేక ఇతర వార్తాపత్రికలలో ప్రచురించబడ్డాయి. వీటిని ప్రచురించినప్పుడు డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ (అభ్యంతరకరమైన ప్రకటన) చట్టం కింద చర్యలు తీసుకునే అధికార పరిధి ఈ రాష్ట్రాల్లోని డ్రగ్ కంట్రోలర్‌లకు ఉంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలూ తీసుకోని విషయాన్ని విశ్లేషకులు, నిపుణులు గుర్తు చేస్తున్నారు.

పతంజలి పాపంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆయుష్ మంత్రిత్వ శాఖలకు చెందిన బ్యూరోక్రసీ ఉన్నదని ఆరోపిస్తున్నారు. ఆయుష్ మంత్రిత్వ శాఖను ప్రత్యేకంగా మోడీ ప్రభుత్వం తన మొదటి టర్మ్‌లో సృష్టించిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఇతర ఔషధాల వంటి కఠినమైన డబుల్ బ్లైండ్ క్లినికల్ ట్రయల్స్ తర్వాత భద్రత, సమర్థతపై డేటాను రూపొందించటానికి ఆయుష్ పరిశ్రమకు అవసరమయ్యే రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించటంలో ఈ రెండు శాఖలకు చెందిన బ్యూరోక్రసీ విఫలమైందని నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు.

2010లో, ప్రభుత్వం ఆయుష్ పరిశ్రమపై విధించిన రూల్ 158బీని ప్రవేశపెట్టింది. ఈ రూల్ ప్రకారం.. ఆయుష్ విభాగం వారు ప్రవేశపెడుతున్న కొత్త ఔషధాల భద్రత, ప్రభావానికి సంబంధించిన రుజువులను ప్రదర్శించాల్సిన అవసరం ఉంటుంది. అయితే అటువంటి ఆధారాలను రూపొందించే విధానంపై స్పష్టత రాకపోవటం గమనార్హం. కాగా, ప్రభుత్వం 2018లో ఆయుష్ మంత్రిత్వ శాఖ రూల్ 158బీ ప్రకారం పరిశ్రమ ఎలాంటి క్లినికల్ ట్రయల్స్ నిర్వహించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. దీనికి బదులుగా.. ఆయుష్ పరిశ్రమ పైలట్ అధ్యయనాలు నిర్వహిస్తే సరిపోతుందని సంబంధిత మంత్రిత్వ శాఖ నిర్ధారించింది. అయితే, ఈ రోజు వరకు కూడా పైలట్ అధ్యయనాలు అంటే మంత్రిత్వ శాఖ నుంచి సమాచారం లేదని నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. ఇలాంటివి పతంజలి వంటి సంస్థలకు బలాన్ని అందించాయని చెప్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, మీడియా, బ్యూరోక్రసీ నుంచి ఆశించిన స్పందన లేకపోవటం, విఫలమైన వ్యవస్థల పూర్తి వైఫల్యం కారణంగానే పతంజలి ఈ రోజు వరకు అభివృద్ధి చెందిందని విశ్లేషకులు, మేధావులు అంటున్నారు. పతంజలి ద్వారా స్పాన్సర్ చేయబడిన ప్రకటనలు ఆయుష్ పరిశ్రమ ద్వారా కూడా ప్రచురించబడతాయనీ, 2022లో ప్రచురితమైన ప్రకటనలు ఇంగ్లీషు భాషా వార్తాపత్రికలలో ప్రచురించబడిన కారణంగా అవి ప్రజల దృష్టిని ఎక్కువగా ఆకర్షించాయని గుర్తు చేస్తున్నారు. అడ్డదారుల్లో ప్రకటనల ద్వారా ప్రజల నమ్మకాన్ని సొమ్ము చేసుకున్న బాబా రాందేవ్‌పై సుప్రీంకోర్టు ఇప్పటికే తీవ్ర ఆగ్రహంతో ఉన్నది.

సుప్రీం మళ్లీ మొట్టికాయలు

(మొదటిపేజీ తరువాయి)

సరైంది కాదు. మేము చేసిన తప్పును భవిష్యత్తులో కూడా మళ్లీ జగరకుండా గుర్తు పెట్టుకుంటాం" అని బాబా రాందేవ్ కోర్టుకు విన్నవించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. "చట్టం అందరికీ ఒకేలా ఉంటుంది. మీరు ఏమి చేసినా.. అది మీ బాధ్యత మాత్రమే. మా ఆదేశాలను అనుసరించి క్షమాపణలు చెప్పారు. నయం చేయలేని వ్యాధుల గురించి ప్రచారం చేయలేరని మీకు తెలియదా?' అని ప్రశ్నించింది. దానికి రాందేవ్ స్పందిస్తూ.. " మేము అనేక పరీక్షలు చేశాం" అని కోర్టుకు తెలిపారు.

"మీది చాలా బాధ్యత రాహిత్యమైన ప్రవర్తన. మీ క్షమాపణలు ఆమోదించాలా? వద్దా? అనే అంశంపై మేము ఆలోచిస్తాం. మీరు పదేపదే మా ఆదేశాలు ఉల్లంఘించారు" అని జస్టిస్ హిమా కోహ్లి ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మీ క్షమాపక్షణలు హృదయం నుంచి రావటం లేదనీ అని మరో న్యామమూర్తి జస్టిస్ ఎ. అమానుల్లా అన్నారు. కాగా, ఈ కేసు తదుపరి విచారణను సుప్రీంకోర్టు ధర్మాసనం ఈనెల 23కు వాయిదా వేసింది.

గల్ఫ్ కార్మికులకు ప్రత్యేక బోర్డు

(మొదటిపేజీ తరువాయి)

నేతృత్వంలో ప్రజాభవన్‌లో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు తెలిపారు. కార్మికులు తమ సమస్యలను నేరుగా ఫిర్యాదు చేసేందుకు వీలుగా టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రైతు బీమా లాగా గల్ఫ్ కార్మికులకు ప్రమాద బీమా ఏర్పాటు చేసి వారిని ఆదుకుంటామని పేర్కొన్నారు. ఫిలిప్పీన్స్‌తో పాటు మన దేశంలో కేరళ అనుసరిస్తున్న వలస కార్మిక విధానాలను అధ్యయనం చేస్తున్నామనీ, త్వరలో మంచి పాలసీ తీసుకొస్తామని ప్రకటించారు. గల్ఫ్‌లో మోసపోయిన బాధితులకు న్యాయపరమై సాయం అందించడంతో పాటు ఆయా దేశాలతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఒక విధానాన్ని తయారు చేస్తామనీ, ఎన్నికల కోడ్ ముగిశాక కార్మిక సంఘాలతో చర్చించి వారి అభిప్రాయాలు, సూచనలను తీసుకుని ముందుకెళతామని పేర్కొన్నారు. గల్ఫ్ ఏజెంట్లు విధిగా రాష్ట్ర ప్రభుత్వం వద్ద నమోదు చేసుకునేలా చర్యలు చేపడుతామని తెలిపారు. బతుకుదెరువు కోసం వలస వెళ్లే కార్మికులు దేశం కాని దేశంలో ఇబ్బందులు పడకుండా అక్కడి పరిస్థితులపై అవగాహన కల్పించేందుకు వారం రోజుల పాటు శిక్షణ అందించనున్నట్టు ప్రకటించారు. ఉత్తర తెలంగాణ నుంచి లక్షలాది మంది కార్మికులు పొట్టకూటి కోసం సౌదీ, ఒమన్, మస్కట్ తదితర దేశాలకు వలస పోతున్నారనీ, వారి సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17లోపు వారి సమస్యలకు ఓ పరిష్కారం కనుగొంటామని వెల్లడించారు. పార్లమెంట్‌లో గల్ఫ్ కార్మికుల గొంతు వినిపించేందుకు వీలుగా నిజామాబాద్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్‌ను గెలిపించాలని వారికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి టి. జీవన్ రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, గల్ఫ్ ఎన్ఆర్ఐ కార్మిక సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.



చమురు మంట..!

(మొదటిపేజీ తరువాయి)

చేరింది. ఇరాన్– ఇజ్రాయిల్ మధ్య నెలకొన్న ఆందోళనతో భారత్‌లో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ఇతరత్రా ఇంధనాల ధరలు పెరగొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. దేశ ఇంధన అవసరాలు దాదాపు 80 శాతం దిగుమతుల ద్వారానే సమకూర్చుకుంటున్న విషయం తెలిసిందే.

ప్రస్తుతం ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య పెరుగుతున్న ఆందోళనలు గ్లోబల్ మార్కెట్‌లో చమురు ధరల పెరుగుదలకు కారణం కానుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశీయంగా ఇంధన ధరలు ఎగిసిపడనున్నాయని హెచ్చరిస్తున్నారు. ఇజ్రాయిల్‌పై ఇరాన్ ప్రతీకార దాడులు చేసింది. దీనికి ఇజ్రాయిల్ స్పందించే తీరును బట్టి గ్లోబల్ మార్కెట్లు నడుస్తాయని అంటున్నారు. యుద్ధ మేఘాలతో రెండేళ్లలో ఎప్పుడూ లేనంతగా ముడి చమురు ధరలు పెరిగాయి. హోర్ముజ్ జలసంధి ద్వారా జరిగే రవాణాకు అంతరాయం ఏర్పడితే గ్లోబల్ మార్కెట్‌లో చమురు ధరలు మరింత ఎగిసిపడొచ్చని అంచనా వేస్తున్నారు. ఒమన్, ఇరాన్ మధ్య ఉన్న ఈ జలసంధి ద్వారానే 20 శాతం ప్రపంచ ముడి చమురు సరఫరా అవుతుంది. ఇప్పటికే ఇజ్రాయిల్‌తో సంబంధాలున్న ఓ వాణిజ్య నౌకను ఈ జలసంధిలో ఇరాన్ అడ్డుకున్న విషయం తెలిసిందే. ఒపెక్ కూటమి సభ్యదేశాలైన సౌదీ అరేబియా, ఇరాన్, యుఎఇ, కువైట్ ,ఇరాక్‌ల నుంచి ఈ జలసంధి ద్వారానే పెద్ద ఎత్తున చమురు రవాణా జరుగుతుంది. మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి అధిక చమురును దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత్ టాప్‌లో ఉంది. ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే బ్యారెల్ ముడి చమురు ధర 100 డాలర్లకు చేరొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో గత కొన్ని నెలలుగా మోడీ సర్కార్ చమురు ధరల పెంపును నిలిపివేసిందనే బహిరంగ విమర్శలున్నాయి. ప్రస్తుత లోకసభ ఎన్నికల్లో మళ్లీ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెరుగడం ఖాయమేనని నిపుణులు భావిస్తున్నారు.

రూపాయి విలవిల..

ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో భారత రూపాయి విలువ వెలవెలబోతోంది. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణానికి తోడు డాలర్ విలువ పెరగడంతో రూపాయి రికార్డ్ పతనాన్ని చవి చూసింది. మంగళవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ 8 పైసల మేర పతనమై రూ.83.53కు క్షీణించింది. ఇంతక్రితం సెషన్‌లో 83.45 వద్ద ముగిసింది. డాలర్ విలువ ఆరు నెలల గరిష్ట స్థాయికి చేరింది. ఆసియన్ కరెన్సీల విలువ పడిపోయింది. ఇరాన్– ఇజ్రాయెల్ మధ్య ఆందోళనలు మరింత పెరిగితే చమురు ధరలు పెరగడం, రూపాయి విలువ మరింత ఒత్తిడికి గురి కావచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

దగ్ధమయ్యాయా..తగలబెట్టారా..!

(మొదటిపేజీ తరువాయి)

చేసినట్టు సీనియర్ డీఎఫ్ఎస్ అధికారి ఒకరు తెలిపారు. ఈ ఘటనలో జిరాక్స్ మెషిన్, కొన్ని కంప్యూటర్లు, పత్రాలు అగ్నికి ఆహుతైనట్టు వెల్లడించారు. ప్రమాద సమయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా భవనంలో లేరని, పలువురు సీనియర్ అధికారులు ఉన్నట్టు సమాచారం. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదని తెలిపారు. అధికారంలో ఉన్న బీజేపీ పెద్దలే..అగ్గికి ఆజ్యం పోసి ఉండవచ్చని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

రాజ్యాంగాన్ని మార్చే కుట్ర

- మోడీ.. సంపన్నులకు ఓ 'సాధనం'..: రాహుల్

కోజికోడ్: దేశంలోని కొంతమంది సంపన్న వ్యాపారవేత్తలకు ప్రధాని మోడీ ఓ సాధనంగా మారారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. వారి బ్యాంకు రుణాలు మాఫీ చేశారంటూ ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా కోజికోడ్‌లోని కొడియత్తూర్‌లో కాంగ్రెస్ ఏర్పాటుచేసిన బహిరంగ ర్యాలీలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "దేశంలోని అత్యంత సంపన్న పారిశ్రామికవేత్తలకు ప్రధాని మోడీ సాధనంగా మారారు. వారి రుణాలను మాఫీ చేయించారు. ఇప్పటి వరకు 20–25 మందికి దాదాపు రూ.16 లక్షల కోట్లు ఇచ్చారు. భారత్‌లో రైతు సమస్యలపై ఆయన అసలు మాట్లాడరు. నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అంశాలను ప్రస్తావించరు. భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు కేంద్రంలోని బీజేపీ, ఆర్ఎస్ఎస్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయన్నారు.

ఐపీఎల్ 2024 పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	వి	ఓ	పా
1 రాజస్థాన్	07	06	01	12
2 కోల్‌కత	06	04	02	08
3 చెన్నై	06	04	02	08
4 హైదరాబాద్	06	04	02	08
5 లక్నో	06	03	03	06
6 గుజరాత్	06	03	03	06
7 పంజాబ్	06	02	04	04
8 ముంబయి	06	02	04	04
9 ఢిల్లీ	06	02	04	04
10 బెంగళూర్	07	01	06	02

మ్యా : మ్యాచులు, వి : విజయాలు, ఓ : ఓటములు, పా : పాయింట్లు



ఒలింపిక్ జ్యోతి వెలిగింది


ప్రాచీన ఒలింపియలో 2024 పారిస్ ఒలింపిక్స్ జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గ్రీకు నటి మేరీ మినా

- జ్యోతి ప్రజ్వలన చేసిన గ్రీకు నటి మేరీ మినా
- 11 రోజుల పాటు గ్రీసులో ఒలింపిక్ టార్చ్ ర్యాలీ

పారిస్ ఒలింపిక్స్‌కు 100 రోజుల కౌంట్‌డౌన్

ఏథెన్స్ (గ్రీసు)

2024 పారిస్ ఒలింపిక్స్ క్రతువు మొదలైంది. మంగళవారం ప్రాచీన ఒలింపియ వేదికగా సంప్రదాయబద్ధంగా ఒలింపిక్ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం అధికారికంగా జరిగింది. గ్రీకు నటి మేరీ మినా ప్రధాన పురోహితుల పాత్ర పోషిస్తూ బ్యాకప్ జ్యోతిని ఉపయోగిస్తూ ఒలింపిక్ జ్యోతి ప్రజ్వలన చేసింది. సాధారణంగా ఒలింపిక్ జ్యోతిని పారాబాలోక్ మిర్రర్ సాయంతో సూర్యకాంతితో వెలిగిస్తారు. కానీ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమ సమయంలో ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉండటంతో పారాబోలిక్ మిర్రర్ సాయంతో జ్యోతిని వెలిగించటం సాధ్యపడలేదు. దీంతో ప్రత్యామ్నాయ జ్యోతిని ఉపయోగించి ఒలింపిక్ టార్చ్‌ను వెలిగించారు. జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంతో పారిస్ ఒలింపిక్స్ టార్చ్ రిలేమొదలైంది. 2024 ఒలింపిక్స్ ఆతిథ్య నగరం పారిస్‌కు చేరటంతో ఒలింపిక్ టార్చ్ రిలే ముగియనుంది. 1900, 1924 ఒలింపిక్స్‌కు సైతం ఆతిథ్యం వహించిన పారిస్ నగరం.. ముచ్చటగా మూడోసారి విశ్వక్రీడలకు వేదిక కానుంది. యూరోప్‌లో యుద్ధ వాతావరణం కొనసాగుతున్న తరుణంలో ఒలింపిక్ క్రీడలు మళ్లీ ఆహ్లాదకర వాతావరణం తీసుకొచ్చేందుకు వారధిగా పని చేయాలని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) భావించింది. ప్రాచీన గ్రీసు దేశంలో ఒలింపిక్ క్రీడలు జరిగే సమయంలో ఎటువంటి యుద్ధాలు, వైరుధ్యాలకు చోటు ఉండేది కాదు. ఇదే సంప్రదాయం కొనసాగింపుగా.. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని నిలిపివేయాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యూల్ మాక్రోన్ పిలుపునిచ్చాడు. యుద్ధం నేపథ్యంలో రష్యా, బెలారస్ క్రీడాకారులను ఆ దేశ అథ్లెట్లుగా కాకుండా.. తటస్థ క్రీడాకారులుగా పోటీపడాలని ఐఓసీ నిర్ణయించటం పట్ల రష్యా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.

11 రోజుల పాటు : ప్రాచీన ఒలింపియలో మొదలైన ఒలింపిక్ జ్యోతి రిలే.. 11 రోజుల పాటు గ్రీసు దేశంలో కొనసాగుతుంది. ఈ 11 రోజులు గ్రీసులో పండుగ వాతావరణం నెలకొనే ఉంటుంది. ప్రతి రోజు ఒలింపిక్ క్రీడల స్ఫూర్తిని చాటేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 26న ఏథెన్స్ ఒలింపిక్స్ స్టేడియంలో (1896 ఆధునిక ఒలింపిక్ క్రీడల వేదిక) 2024 పారిస్ ఒలింపిక్స్ నిర్వాహకులకు అందజేస్తారు. ఫ్రాన్స్‌లో ఒలింపిక్ రిలే 68 రోజుల పాటు సాగనుంది. జులై 26న పారిస్ ఒలింపిక్స్ వేదికపై ఒలింపిక్ జ్యోతి ప్రజ్వలనతో ఒలింపిక్ రిలే ముగయనుంది.



'యుద్ధాలు, వైరుధ్యాలతో మనం అందరం క్లిష్టమైన సమయంలో ఉన్నాం. నిత్య జీవనంలో ద్వేషం, దుందుడుకు దూకుడు, నెగెటివ్ వార్తలతో ప్రజలు విసిగిపోయారు. మనం అందరం ప్రజలందరిని ఏకం చేసేది, ఐక్యంగా నిలిపి ఓ విశ్వాసం అందించే దాని కోసం ఆశగా ఎదురుచూస్తున్నాం. ఈ రోజు వెలిగించిన ఒలింపిక్ జ్యోతి.. నమ్మకం, విశ్వాసానికి ప్రతీక'

- థామస్ బాచ్,అధ్యక్షుడు
అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)

అగ్రస్థానంలోనే గుకేశ్

ఫిడె క్యాండిడేట్స్ చెస్ 2024

టోరంటో (యుఎస్‌ఏ) : ప్రతిష్టాత్మక ఫిడె క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ డి. గుకేశ్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. పది రౌండ్ల మ్యాచుల అనంతరం 6.0 పాయింట్లతో టాప్ పొజిషన్‌లో నిలిచాడు. డిఫెండింగ్ చాంపియన్ ఐయాన్ (రష్యా) సైతం 6.0 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. పదో రౌండ్‌లో గుకేశ్, ఐయాన్ మ్యాచ్ 40 ఎత్తుల్లో డ్రాగా ముగియగా.. భారత గ్రాండ్‌మాస్టర్లు ఆర్. ప్రజ్ఞానంద, విదిత్ గుజరాతీలు తమ మ్యాచ్‌ను 39 ఎత్తుల్లో డ్రా చేసుకున్నారు. నిజత్‌పై నకమురు 58 ఎత్తుల్లో విజయం సాధించగా.. అలిరెజాపై ఫాబియానో 47 ఎత్తుల్లో గెలుపొందాడు. ఆర్. ప్రజ్ఞానంద (5.5) మూడో స్థానంలో కొనసాగుతుండగా.. విదిత్ గుజరాతీ (5.0) ఆరో స్థానంలో నిలిచాడు. మహిళల విభాగంలో ఆర్. వైశాలి వరుస నాలుగు ఓటములకు చెక్ పెట్టింది. పదో రౌండ్లో సాలిమోవ (బల్గేరియా)పై 88 ఎత్తుల్లో విజయం సాధించింది. కోనేరు హంపీ 72 ఎత్తుల్లో టాన్ (చైనా)తో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. కోనేరు హంపీ (4.5) ఐదో స్థానంలో, ఆర్. వైశాలి (3.5) ఎనిమిదో స్థానాల్లో నిలిచారు.



224 ఊదేశారు



- కోల్‌కతపై రాజస్థాన్ గెలుపు
- ఛేదనలో బట్లర్ అజేయ సెంచరీ
- సునీల్ నరైన్ శతకం వృథా
- కోల్‌కత 223/6, రాజస్థాన్ 224/8

నవతెలంగాణ-కోల్‌కత

రాజస్థాన్ రాయల్స్‌కు ఎదురులేదు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక లక్ష్యాన్ని ఆ జట్టు అలవోకగా ఛేదించింది. ఈడెన్‌గార్డెన్స్‌లో కోల్‌కత నైట్‌రైడర్స్‌ను చిత్తు చేసి 2 వికెట్ల తేడాతో గెలుపొందింది. 234 పరుగుల రికార్డు ఛేదనలో ఓపెనర్ జోశ్ బట్లర్ (107 నాటౌట్, 60 బంతుల్లో 9 ఫోర్లు, 6 సిక్స్‌లు) అజేయ సెంచరీతో చెలరేగాడు. రియాన్ పరాగ్ (34), రోవ్‌మాన్ పావెల్ (26) రాణించారు. యశస్వి జైస్వాల్ (19), సంజు శాంసన్ (12) సహా ధ్రువ్ జురెల్ (2), అశ్విన్ (8), హెట్‌మయర్ (0) వైఫల్యంతో రాయల్స్ ఓ దశలో 121/6తో ఓటమి కోరల్లో చిక్కుకుంది. కానీ జోశ్ బట్లర్ ఆఖరు వరకు క్రీజులో నిలిచి రాయల్స్‌కు సూపర్ విక్టరీ అందించాడు. అంతకుముందు, సునీల్ నరైన్ (109, 56 బంతుల్లో 13 ఫోర్లు, 6 సిక్స్‌లు) శతక విన్యాసంతో తొలుత బ్యాటింగ్ చేసిన కోల్‌కత నైట్‌రైడర్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 223 పరుగుల భారీ స్కోరు సాధించింది. రాజస్థాన్ రాయల్స్‌కు ఏడు మ్యాచుల్లో ఇది ఆరో విజయం కాగా.. కోల్‌కత నైట్‌రైడర్స్‌కు ఆరు మ్యాచుల్లో ఇది రెండో పరాజయం.

నరైన్ మోత : టాస్ నెగ్గిన రాజస్థాన్ రాయల్స్ ఈడెన్‌గార్డెన్స్‌లో తొలుత బౌలింగ్ ఎంచుకుంది. కోల్‌కత నైట్‌రైడర్స్‌కు ఓపెనర్లు ఆశించిన ఆరంభం ఇవ్వలేదు. ఫామ్‌లో ఉన్న ఫిల్ సాల్ట్ (10) నిరాశపరిచాడు. కానీ పించ్ హిట్టర్ సునీల్ నరైన్ (109) తగ్గలేదు. 13 ఫోర్లు, 6 సిక్సర్లతో విశ్వరూపం చూపించాడు. ఐదు ఫోర్లు, మూడు సిక్సర్లతో 29 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన సునీల్ నరైన్.. కెరీర్ తొలి టీ20 సెంచరీని 49 బంతుల్లో 11 ఫోర్లు, ఆరు సిక్సర్లతో అందుకున్నాడు. యువ ఆటగాడు రఘువంశీ (30) ఐదు ఫోర్లతో అలరించాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (11), ఆండ్రీ రసెల్ (13) నిరాశపరిచారు. కానీ డెత్ ఓవర్లలో రింకూ సింగ్ (20 నాటౌట్) అదరగొట్టాడు. రెండు సిక్సర్లు, ఓ ఫోర్‌తో మెరిసి కోల్‌కత నైట్‌రైడర్స్‌కు అదిరే ముగింపు అందించాడు. కోల్‌కత నైట్‌రైడర్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 223 పరుగులు చేసింది. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్ (1/31), అవేశ్ ఖాన్ (2/35) రాణించారు.

ఐపీఎల్‌లో నేడు
గుజరాత్ X ఢిల్లీ
వేదిక : అహ్మదాబాద్ , రా॥ 7.30
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..

శ్రీజ, మనిక శుభారంభం


ఐటీటీఎఫ్ ప్రపంచకప్ 2024



మకావు (చైనా) : ఐటీటీఎఫ్ టేబుల్ టెన్నిస్ ప్రపంచకప్‌లో తెలుగు తేజం ఆకుల శ్రీజ, భారత స్టార్ ప్యాడ్లర్ మనిక బత్రా శుభారంభం చేశారు. మహిళల గ్రూప్ దశ మ్యాచుల్లో తొలి గేమ్‌లోనే విజయం సాధించి ఆకట్టుకున్నారు. వరల్డ్ నం.39 ఆకుల శ్రీజ 4-0తో పొలాండ్ అమ్మాయిపై ఘన విజయం సాధించింది. 11-9, 11-6, 11-5, 11-5తో వరుస సెట్లలో గెలుపొందింది. వరల్డ్ నం.37 మనిక బత్రా 3-1తో గెలుపొందింది. రోమానియా ప్యాడ్లర్‌కు తొలి సెట్ 9-11తో కోల్పోయిన మనిక తర్వాతి సెట్లలో వరుసగా 11-8, 11-6, 11-8తో ఆకట్టుకుంది. గ్రూప్ దశ తర్వాతి మ్యాచ్‌లో వరల్డ్ నం.2 వాంగ్ (చైనా)తో మనిక తలపడనుంది. ఆకుల శ్రీజ తర్వాతి మ్యాచ్‌లో వరల్డ్ నం.4 చెన్ మెంగ్ (చైనా)ను ఢీకొట్టనుంది. ప్రపంచకప్ గ్రూప్ దశలో మహిళలు, పురుషుల విభాగాల్లో మొత్తం 16 గ్రూపులు ఉంటాయి. ప్రతి గ్రూప్ నుంచి అగ్రస్థానంలో నిలిచిన ప్యాడ్లర్ నాకౌట్ దశకు అర్హత సాధిస్తారు.

నవచిత్రం

పాటల సందడిలో ప్రతినిధి 2


నారా రోహిత్

నారా రోహిత్ హీరోగా జర్నలిస్ట్ మూర్తి దేవగుప్తపు దర్శకుడుగా పరిచయం అవుతున్న తెరకెక్కిస్తున్న చిత్రం 'ప్రతినిధి 2'. ఈ నెల 25న థియేటర్లలో విడుదల కానుంది. వానరా ఎంటర్టైన్మెంట్స్, రానా ఆర్ట్స్ పతాకాలపై కుమార్ రజా బత్తుల, ఆంజనేయులు శ్రీ తోట, సురేంద్రనాథ్ బొల్లినేని నిర్మిస్తున్నారు.
ఈ చిత్రం నుండి మొదటి సింగిల్- గల్లా యెత్తిని విడుదల చేయడంతో చిత్ర యూనిట్ మ్యూజిక్ ప్రమోషన్లను ప్రారంభించింది. ఈ మాస్ నంబర్‌ను మహతి స్వర సాగర్ స్కోర్ చేశారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం సమాజంలో మంచి చెడుల గురించి ఆలోచింపజేసేలా ఉంది.
రామ్ మిరియాల వాయిస్ మంత్రముగ్ధులను చేసింది. భాను మాస్టర్ కొరియోగ్రఫీలో నారా రోహిత్ ఉత్సాహంగా కనిపిస్తూ డాన్స్ మూవ్స్ కూడా చాలా బాగా చేశారు. 'గల్లా ఎత్తి..' పాట సినిమా ప్రమోషన్స్‌కి సరైన ప్రారంభాన్ని ఇచ్చింది అని చిత్ర యూనిట్ తెలిపింది.
'ప్రతినిధి 2' అనేది ప్రతినిధి సిరీస్ నుండి రెండవ ఫ్రాంచైజీ. నిజాయితీ గల న్యూస్ రిపోర్టర్ పాత్రలో నారా రోహిత్ నటించాడు. సిరీ లెల్లా కథానాయికగా నటిస్తుండగా దినేష్ తేజ్, సప్తగిరి, జిషు సేన్గుప్తా, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వర సాగర్, ఎడిటర్: రవితేజ గిరిజాల, డిఓపి : నాని చమిడిశెట్టి.

థ్రిల్ చేసే భవనమ్



సూపర్ గుడ్ ఫిలిమ్స్ మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తోంది.
సప్తగిరి, ధనరాజ్, షకలక శంకర్, అజయ్, మాళవిక సతీషన్, స్నేహ ఉల్లాల్ ప్రధాన పాత్రలలో బాలాచారి కూరెళ్ల దర్శకత్వంలో రూపొందిన సస్పెన్స్ థ్రిల్లర్ 'భవనమ్'.
సూపర్ గుడ్ ఫిల్మ్స్ సమర్పణలో ఆర్ బి చౌదరి, వాకాడ అంజన్ కుమార్, వీరేంద్ర సీర్వి ఈ చిత్రాన్ని నిర్మించారు. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ను, ఇందులోని జానపద పాట 'యాదమ్మ..' సాంగ్‌ను మంగళవారం ప్రసాద్ ల్యాబ్‌లో విడుదల చేసి, విలేకరులకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆర్.బి. చౌదరి మాట్లాడుతూ,'మా బ్యానర్‌లో ఇది 95వ సినిమా. మలయాళంలో 96వ సినిమా చేస్తున్నాం. అలాగే 97, 98 సినిమాలు కూడా షూటింగ్ జరుపుకుంటున్నాయి. త్వరలో 100 సినిమాలకు చేరుకోబోతున్నాం. దర్శకుడు ఈ సినిమాను చక్కగా తీశాడు. ఆల్ రెడీ సాంగ్స్ వెరీ గుడ్. సంగీత దర్శకుడు చరణ్ గొప్ప టాలెంట్ పర్సన్' అని అన్నారు. 'చరణ్ అర్జున్ సంగీతం ఈ సినిమా చాలా ప్లస్ అవుతుంది. విఎస్ ఆర్. బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్, కెమెరా పనితనంతో సినిమా మరింత బాగా వచ్చింది' అని దర్శకుడు చెప్పారు.

పాటల చిత్రీకరణలో పోలీస్ వారి హెచ్చరిక



నల్లపూసలు ఫేం బాబ్జీ దర్శకత్వంలో తూలికా తనిష్క్ క్రియేషన్స్ పతాకంపై బెల్లి జనార్థన్ తొలి ప్రయత్నంగా నిర్మిస్తున్న చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'. ఈ చిత్రం శరవేగంగా టాకీపార్ట్‌ను పూర్తి చేసుకుని, ప్రస్తుతం పాటల చిత్రీకరణలో ఉంది.
ఈ సందర్భంగా దర్శకుడు బాబ్జీ మాట్లాడుతూ, ' అరకులోయ, కాఫీ వనం, ఆపిల్ రిసార్ట్స్, వైజాగ్ యారాడా బీచ్, నకిరేకల్ లాండ్స్, యస్ స్టూడియో తదితర లొకేషన్స్‌లో పాటలను చిత్రీకరించాం. గత రెండు దశాబ్దాలుగా రెండు తెలుగు రాష్ట్రాలలోని గాయనీ గాయకులతో, ఐదు లక్షల ప్రైవేట్ సాంగ్స్‌ను స్వరపరచి సంచలనం సృష్టించిన సంగీత దర్శకుడు గజ్వేల్ వేణును ఈ సినిమా ద్వారా వెండితెరకు పరిచయం చేస్తున్నాం. మంచి కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం' అని దర్శకుడు బాబ్జీ తెలిపారు. 'రెండు రోజులలో పాటల చిత్రీకరణ పూర్తి అవుతుంది. ఆ వెంటనే నల్గొండలో క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించడంతో సినిమా షూటింగ్ మొత్తం పూర్తి అవుతుంది. ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది' అని నిర్మాత బెల్లి జనార్థన్ అన్నారు. అఖిల్ సన్నీ, అజయ్ ఘోష్, రవి కాలే, షియాజీ షిండే, శుభలేఖ సుధాకర్, కాశీ విశ్వనాథ్, సంజయ్ నాయర్, జబర్దస్త్ వినోద్, జబర్దస్త్ పవన్, హిమజ, జయ వాహిని, శంకరాభరణం తులసి, మేఘనా ఖుషి, రుచిత తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా : నళినీ కాంత్, ఎడిటర్ : శివ శర్వాణి, నిర్మాణ నిర్వహణ : ఎన్. వై. సుబ్బరాయుడు.

కన్నప్పలో అక్షయ్‌కుమార్


మోహన్‌బాబు, అక్షయ్ కుమార్, మంచు విష్ణు

విష్ణు మంచు నిర్మిస్తున్న 'భక్త కన్నప్ప' చిత్ర బృందంలోకి బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్ జాయిన్ అయ్యారు. అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్‌లపై మోహన్ బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, మహాభారత్ సిరీస్ ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు.
మంచు విష్ణు ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. హై టెక్నికల్ స్టాండర్డ్స్‌తో ఈ సినిమా రాబోతోంది. ఇప్పటికే న్యూజిలాండ్‌లోని అందమైన ప్రదేశాల్లో రెండు భారీ షెడ్యూల్స్‌ను కంప్లీట్ చేశారు.ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. ఇప్పటికే ఈ చిత్రంలో మోహన్ లాల్, ప్రభాస్, శరత్ కుమార్, బ్రహ్మానందం తదితరులు ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. ఇక తాజాగా ఈ మూవీ సినిమా సెట్‌లోకి బాలీవుడ్ సూపర్ స్టార్ అక్షయ్ కుమార్ జాయిన్ అయ్యారు. అక్షయ్ కుమార్‌కు మోహన్ బాబు, విష్ణు మంచు గ్రాండ్‌గా స్వాగతాన్ని పలికారు. ప్రస్తుతం అక్షయ్ కుమార్ మీద సీన్లను చిత్రీకరించనున్నారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం అన్ని భారతీయ భాషల్లోనూ విడుదల కానుంది.

నవ్వించే పారిజాత పర్వం



చైతన్య రావు, సునీల్, శ్రద్ధా దాస్, మాళవిక సతీశన్ ప్రధాన పాత్రల్లో వనమాలి క్రియేషన్స్ బ్యానర్‌పై సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో మహీధర్ రెడ్డి, దేవేష్ నిర్మించిన హిలేరియస్ క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ 'పారిజాత పర్వం'. 'కిడ్నాప్ ఈజ్ ఎన్ ఆర్ట్' అనేది ట్యాగ్ లైన్. ఈ సినిమా ఈనెల 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ అంగరంగ వైభవంగా ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించింది.'పారిజాత పర్వం ప్రీ కిడ్నాప్ ఈవెంట్' పేరుతో వెరైటీగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిర్మాత, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ఈ చిత్ర బిగ్ టికెట్‌ను లాంచ్ చేశారు. సహ నిర్మాత అనంత్ సాయి మాట్లాడుతూ, 'ఒక పది పదిహేను నిమిషాలు తప్ప సినిమా మొత్తం నవ్వుతూనే ఉంటారు. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది' అని చెప్పారు. 'చాలా ప్యాషనేట్‌గా ఈ సినిమా చేశాం. డైరెక్టర్ సంతోష్ ప్రాణం పెట్టి చేశారు. మేం నిర్మాతలుగా కాకుండా ఒక ఆడియన్‌గా ఈ సినిమా చూశాం. యాంకర్ సుమని కిడ్నాప్ చేశాక ఇంకా కాన్ఫిడెన్స్ పెరిగింది' అని నిర్మాతలు మహీధర్ రెడ్డి, దేవేష్ చెప్పారు. డైరెక్టర్ సంతోష్ కంభంపాటి మాట్లాడుతూ, 'ఇది కన్ఫ్యూజ్ కిడ్నాప్ డ్రామా. ప్రేక్షకుల తప్పకుండా ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు.

పక్కా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్

హీరో విశాల్ తాజాగా 'రత్నం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. జీ స్టూడియోస్‌తో పాటు స్టోన్ బెంచ్ ఫిల్మ్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. డైరెక్టర్ హరి దర్శకత్వంలో కార్తికేయన్ సంతానం అన్ కాంప్రమైజ్డ్‌గా రూపొందిస్తున్నారు. విశాల్, దర్శకుడు హరి కాంబినేషన్‌కి మంచి క్రేజ్ ఉంది. దీంతో వీరిద్దరి కాంబోలో ఈ సినిమా వస్తుండటంతో మంచి హైప్ ఏర్పడింది. ఈ మూవీని శ్రీ సిరి సాయి సినిమాస్ బ్యానర్ మీద తెలుగులో సీహెచ్ సతీష్ కుమార్, కే రాజ్ కుమార్ సంయుక్తంగా ఈనెల 26న రిలీజ్ చేస్తున్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2014/59462.

వైఎస్ అవినాష్‌రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌పై ముగిసిన వాదనలు

- తీర్పును వాయిదా వేసిన హైకోర్టు

నవతెలంగాణ-హైదరాబాద్

ఉమ్మడి ఏపీలో మంత్రిగా చేసిన వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడైన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి గతంలో ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలనే పిటిషన్‌పై తీర్పును తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది. ఇరుపక్షాల వాదనలు పూర్తవ్వడంతో తీర్పును రిజర్వులో పెడుతున్నట్టు జస్టిస్ కె.లక్ష్మణ్ ప్రకటించారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి గతంలో ఇచ్చిన ముందస్తు బెయిల్ రద్దు చేయాలంటూ వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరి పిటిషనర్ దాఖలు చేశారు. అవినాష్‌రెడ్డికి బెయిల్ మంజూరు చేసినప్పటి నుంచి సాక్షులను ప్రభావితం చేస్తున్నారని ఆయన లాయర్ వాదన. సాక్షులను ప్రభావితం చేస్తున్నందున అవినాష్‌రెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలని సీబీఐ, బెయిల్‌పై అవినాష్‌రెడ్డి ఉండేందుకు అర్హత లేదని వివేకా కుమార్తె సునీత లాయర్లు వాదించారు. పిటిషనర్ల అభియోగాలు వాస్తవం కాదనీ, పిటిషన్ కొట్టేయాలని అవినాష్ లాయర్ వాదనల తర్వాత హైకోర్టు తీర్పును వాయిదా వేసింది.

పలు నియోజకవర్గాలకు బీఆర్ఎస్ సమన్వయకర్తల నియామకం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంటు ఎన్నికల సందర్భంగా పలు ఎంపీ స్థానాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు బీఆర్ఎస్ సమన్వయకర్తలను నియమించింది. ఈ మేరకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమన్వయకర్తల పేర్లను ప్రకటించారు. కరీంనగర్, వరంగల్, మెదక్, జహీరాబాద్, పెద్దపల్లి, భువనగిరి, నల్లగొండ, నాగర్ కర్నూల్, నిజామాబాద్, మహబూబ్ నగర్ పార్లమెంటు స్థానాల పరిధిలోని శాసనసభ నియోజకవర్గాల సమన్వయకర్తలుగా వారు వ్యవహరించన్నారు.

మోడీతో సీఎం రేవంత్ చీకటి ఒప్పందం -బీఆర్ఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఓటుకు నోటు కేసులో బెయిల్ రద్దు కాకుండా ప్రధాని మోడీతో సీఎం రేవంత్ రెడ్డి చీకటి ఒప్పందం చేసుకున్నారని బీఆర్ఎస్ ఆరోపించింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ మాట్లాడుతూ రేవంత్‌ది అమ్ముడుపోయే నేపథ్యమని విమర్శించారు. బీజేపీతో కుమ్మక్కైన రేవంత్ లోక్‌సభకు కాంగ్రెస్ తరపున బలహీనమైన అభ్యర్థులను నిలబెట్టారని తెలిపారు. 80 కోట్ల మందికి ఉచిత రేషన్ ఇస్తామంటూ చెప్పిన ప్రధాని మోడీ దేశం వెనుకబడిన సంగతిని పరోక్షంగా ఒప్పుకున్నారని తెలిపారు. ఆగస్టు 15న రుణమాఫీ చేస్తామంటున్న సీఎం రేవంత్ రెడ్డికి అప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అడ్డురాదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పని అయిపోయిందంటున్న ముఖ్యమంత్రి ప్రతి రోజు కేసీఆర్ గురించి ఎందుకు మాట్లాడుతున్నారో చెప్పాలన్నారు. కడియం శ్రీహరికి బీఆర్ఎస్ ఏం తక్కువ చేయకపోయినా ... కాంగ్రెస్ లో చేరారని విమర్శించారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో... ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవాలి

- మాజీ మంత్రి పొన్నాల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవాలని బీఆర్ఎస్ కోరింది. ఈ మేరకు ఆ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ అధికార పార్టీ ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసేందుకు ఎత్తుగడలు వేస్తోందనీ, సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగత కక్షసాధింపు ధోరణిని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. .రాజ్ నారాయణ్ కేసులో సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన తీర్పు కనుగుణంగా ఈసీ ఈ కేసులో జోక్యం చేసుకోవాలని కోరినట్టు తెలిపారు. ఒక సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని కేసీఆర్, కేటీఆర్‌పై కాంగ్రెస్ నేతలు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డికి తొత్తులుగా వ్యవహరిస్తున్న పోలీస్ అధికారులను తక్షణమే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

గవర్నర్ శ్రీరామనవమి శుభాకాంక్షలు

నవతెలంగాణ-హైదరాబాద్

పవిత్రమైన శ్రీరామ నవమి సందర్భంగా ప్రజలకు రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రగాఢ భక్తితో దేశవ్యాప్తంగా పండుగ నిర్వహించారని గుర్తు చేశారు. ప్రేమ, సామరస్యానికి ప్రతీక శ్రీరామనవమి నిలవాలని అభిప్రాయపడ్డారు. శ్రీరాముని ఆదర్శమైన జీవితం నుంచి స్ఫూర్తిని పొందాలని సూచించారు. ఈమేరకు మంగళవారం రాజ్‌భవన్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసింది.

అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు

- రైల్వే అదనపు జనరల్ మేనేజర్ ధనుంజయులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


వేసవి కాలం దష్ట్యా అగ్ని ప్రమాదల నివారణకు ముందస్తు జాగ్రతలు పాటించాలని దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ ఆర్ ధనుంజయులు ఒక ప్రకటనలో ఆదేశించారు. రైల్వే కార్యకలాపాల నిర్వహణలో భద్రత, వేసవి కాలం దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రతలపై వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతో ఆయన మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైళ్లు, స్టేషన్లు, వర్క్‌షాప్‌లు, కార్యాలయ భవనాలపై ఎప్పటికప్పుడు అగ్నిమాపక భద్రతకు సంబంధించిన ఆడిట్‌ను నిర్వహించాలని అధికారులకు సూచించారు. అన్ని రైల్వే సంస్థల్లో స్మోక్ డిటెక్టర్లు, ఫైర్ అలారం సిస్టమ్ వంటి ఫైర్ సేఫ్టీ పరికరాల పనితీరు, వాటి నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అన్ని రైల్వే పరిసర ప్రాంతాల్లో వాటర్ హైడ్రెంట్స్, ఇతర అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు.

అతివకు ప్రాతినిధ్యమేది?

లోక్‌సభ సీట్ల కేటాయింపులో మహిళలకు అన్యాయం

- గుజరాత్‌లో మొత్తం 2.39 కోట్ల మంది ఓటర్లు వారే
- అయినా పట్టించుకోని ప్రధాన పార్టీలు
- ఈ సారి బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి బరిలో నలుగురు చొప్పనే
- తప్పుబడుతున్న మేధావులు, మహిళావాదులు, సామాజిక కార్యకర్తలు





అహ్మదాబాద్ : దేశంలోని ప్రతి రాజకీయ పార్టీ మహిళల ఓట్లపై ప్రధానంగా దృష్టి పెడుతుంది. ఇందు కోసం మహిళా సాధికారత, వారికి 33 శాతం రిజర్వేషన్లు, హక్కులువంటి అంశాలపై చుట్టూ రాజకీయాలు నడుపుతుంది. కానీ, నిజ జీవితంలో మాత్రం అవేమీ కార్యరూపం దాల్చటం లేవు. ఇందుకు రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా గుజరాత్‌లోని ప్రధాన పార్టీలు బీజేపీ, కాంగ్రెస్‌లు మహిళలకు కేటాయించిన అతి తక్కువ సీట్లే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. ఈ రెండు పార్టీలు ఈ సారి నలుగురు చొప్పున మహిళలను లోక్‌సభ బరిలో నిలిపాయి.

ముఖ్యంగా, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించటం, అందుకు పార్లమెంటులో చట్టం చేయటం.. అన్నీ తమ కారణంగానే అని చెప్పుకునే బీజేపీ.. సాక్షాత్తూ ప్రధాని మోడీ సొంత రాష్ట్రంలోనే వారికి (మహిళలకు) సీట్లు కేటాయించటంలో విముఖతను చూపుతుండటం గమనార్హం. ఈ సారి బీజేపీ నలుగురు, కాంగ్రెస్ నలుగురు మహిళలను తమ పార్టీల నుంచి లోక్‌సభ ఎంపీ అభ్యర్థులుగా పోటీలో ఉంచాయి. గుజరాత్‌లో దాదాపు 2.39 కోట్ల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మొత్తం నమోదైన ఓటర్లలో 50 శాతం మంది వారే. అయినప్పటికీ చెప్పుకోదగిన సంఖ్యలో కూడా ప్రధాన పార్టీలు మహిళలకు లోక్‌సభ సీట్లను కేటాయించకపోవటాన్ని మేధావులు, స్త్రీ అభ్యుదయవాదులు తప్పుబడుతున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో గుజరాత్‌లోని మొత్తం 26 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ నుంచి ఆరుగురు మహిళా ఎంపీలు గెలిచారు. అయితే ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ నలుగురికి మాత్రమే పరిమితం కావటాన్ని మహిళావాదులు వేలెత్తి చూపుతున్నారు. గుజరాత్‌లో మహిళా ఎంపీలు, అభ్యర్థుల ప్రాతినిధ్యం క్రమంగా క్షీణిస్తున్నది. 26 స్థానాలకు గానూ ప్రస్తుతం బీజేపీ నామినేట్ చేసిన నలుగురు మహిళలలో జామ్‌నగర్ స్థానానికి పూనమ్ మేడమ్, సబర్ కాంతా స్థానానికి శోభనా బరయ్య, భావ్‌నగర్ స్థానానికి నీము బంభానియా, బనాస్ కాంతా స్థానానికి రేఖా బెన్ చౌదరి ఉన్నారు. ముఖ్యంగా, ఉత్తర గుజరాత్‌లోని బనస్కాంత స్థానానికి బీజేపీ మహిళా అభ్యర్థిపై కాంగ్రెస్ మహిళ అభ్యర్థి పోటీ చేయనున్నారు. గుజరాత్‌లో బీజేపీ, కాంగ్రెస్ రెండూ ఒకరిపై ఒకరు మహిళా అభ్యర్థులను నిలబెట్టిన ఏకైక సీటు ఇదే కావటం గమనార్హం.

ఇక కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన నలుగురు మహిళా అభ్యర్థుల్లో జెనీ బెన్ ఠాకోర్ బనస్కాంత స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. అలాగే, కేంద్ర హెూంమంత్రి అమిత్ షా పోటీ చేస్తున్న గాంధీనగర్ స్థానం నుంచి సోనాల్ పటేల్‌ను కాంగ్రెస్ పోటీకి దింపింది. మిగతా రెండు స్థానాలైన అమ్రేలిలో జెని తుమ్మర్, దాహోద్‌లో ప్రభా తవియాడ్‌లు ఉన్నారు.

గుజరాత్‌లో అహ్మదాబాద్ వెస్ట్, గాంధీనగర్, పోర్ బందర్, పటాన్, పంచమహల్, ఖేడా, బరూచ్, వల్సాద్, నవ్‌సారి స్థానాల్లో ఇప్పటివరకు ఏ పార్టీ నుంచి కూడా మహిళా అభ్యర్థి ఎన్నిక కాకపోవటం గమనార్హం. రాజకీయ పార్టీలకు గెలుపు, అధికారం తప్పితే.. మహిళలకు సరైన ప్రాతినిధ్యం కల్పించాలన్న ఆసక్తి ఉండదని మేధావులు, విశ్లేషకులు అంటున్నారు. మహిళపై మరొక మహిళను నిలబెట్టటం, ఓడిపోయే స్థానాల్లోనూ మహిళనే బరిలో ఉంచి.. కంటి తుడుపు చర్యగా సీట్లను కేటాయిస్తున్నారని చెప్తున్నారు.

దానం కేసులో స్పీకర్‌కు నోటీసుల జారీకి హైకోర్టు నిరాకరణ

నవతెలంగాణ-హైదరాబాద్

బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ ఆపార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా కాంగ్రెస్ పార్టీలో చేరినందున ఆయనపై అనర్హత వేటు వేయాలనే పిటిషన్‌లో స్పీకర్‌కు నోటీసులు జారీ చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. దానం నాగేందర్‌తోపాటు న్యాయ శాఖ కార్యదర్శి, స్పీకర్ కార్యాలయానికి, కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులిచ్చింది నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని గత మార్చి 14న ఇచ్చిన ఫిర్యాదుపై స్పీకర్ చర్య తీసుకోలేదంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాన్ని జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారించారు. ప్రతివాదులకు నోటీసులిచ్చిన హైకోర్టు స్పీకర్‌కు ఇచ్చేందుకు నిరాకరించింది. తొలుత పిటిషనర్ తరపున సీనియర్ అడ్వొకేట్ గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ, దానంపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలన్నారు. స్పీకర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు లేవనీ, తాము పోస్టు ద్వారా చేసిన ఫిర్యాదుపై స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశాలివ్వాలని కోరారు. తమ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని దానంకు స్పీకర్ నోటీసు ఇచ్చేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఫిర్యాదు చేసేందుకు స్పీకర్‌ను కలిసేందుకు ఎమ్మెల్యేలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదన్నారు.అనర్హత వేటు వేయాలని ఫిర్యాదు చేసే వారిని అనుమతించరాదని సెక్రటరీకి స్పీకర్ ఆదేశించారన్నారు. మరో దారిలేకపోవడంతో రిజిస్టర్ పోస్టులో ఫిర్యాదు చేశారని చెప్పారు. బీఆర్ఎస్ ఇచ్చిన బి-ఫాంపై పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారని, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్ పార్టీలో చేరారని వివరించారు. ఇది పార్టీ ఫిరాయింపుల చట్టం కింద వేటు వేయాల్సిన విషయమన్నారు. ఎమ్మెల్యే దానంపై అనర్హత వేటు వేసేందుకు స్పీకర్‌కు నిర్దిష్ట గడువు ఉందనీ, ఈ మేరకు ఇతర కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాలను గమనంలోకి తీసుకుని దానం నాగేందర్‌కే కాకుండా స్పీకర్‌కు కూడా నోటీసులు జారీ చేయవచ్చునని చెప్పారు. దీనిపై అడ్వొకేట్ జనరల్ ఎ సుదర్శన్‌రెడ్డి ప్రతివాదన చేస్తూ, స్పీకర్ కార్యాలయానికి నోటీసులు ఇస్తున్నప్పుడు స్పీకర్‌కు అవసరం లేదన్నారు. స్పీకర్‌కు నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. స్పీకర్ స్థానానికి గౌరవం ఇవ్వాలన్నారు. అనర్హత వేటు వేయాలని స్పీకర్‌పై ఒత్తిడి తీసుకురావడానికి వీల్లేదన్నారు. గత ప్రభుత్వంలో కూడా 2019లో పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వాళ్లపై ఫిర్యాదు చేస్తే 2023 వరకు పరిష్కరించలేదని గుర్తు చేశారు. వాదనల తర్వాత ప్రతివాదులకు నోటీసులు ఇచ్చిన హైకోర్టు విచారణను ఈ నెల 25కి వాయిదా వేసింది.

రైతులను మభ్యపెట్టే ఎత్తుగడ : ఎంపీ డాక్టర్ లక్ష్మణ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఆగస్టు 15 లోపు రైతు రుణమాఫీ ప్రకటన చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రైతులను, ప్రజలను మభ్యపెట్టడానికి వేసిన ఎత్తుగడ అని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సోనియా గాంధీ జన్మదినమైన డిసెంబర్ 9న ఏక కాలంలో రుణ మాఫీ చేస్తామని చెప్పారనీ, వంద రోజుల తర్వాత కూడా చేయలేదని విమర్శించారు. వరి పంటకు మద్దతు ధర తో పాటు ఇస్తామన్న రూ. 500 బోనస్ ఏమైందని ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ పేరుతో హామీలు అమలు చేయలేకపోతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తప్పించుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద హామీల అమలుకు నిధులు లేవని తెలియదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు అవినీతిపరులని అనేక సార్లు విమర్శించిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు ఆ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌లో చేరగానే అవినీతి తొలిగిపోతుందా? అని ప్రశ్నించారు. రాజకీయ ఉనికి కోల్పోయిన బీఆర్ఎస్‌ను ఏదో ఒక రూపంలో కాంగ్రెస్ పార్టీ తెరపైకి తెస్తోందని విమర్శించారు. 60 మందికిపైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని కిసాన్‌సెల్ అధ్యక్షులు కోదండరెడ్డి చెప్పారన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డినేమో ఒక్క రైతు కూడా చనిపోలేదని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. టీవీ సీరియల్ మాదిరిగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని నడిపిస్తున్నారని విమర్శించారు. ఓవైసీని గెలిపించేందుకే ఇప్పటిదాకా హైదరాబాద్‌లో కాంగ్రెస్ తన అభ్యర్థిని ప్రకటించలేదన్నారు.

బీజేపీ అభ్యర్థులపై కేసుల పిటిషన్‌పై విచారణ మూసివేత

నవతెలంగాణ-హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయబోయే బీజేపీ అభ్యర్థులపై రాష్ట్రంలోని వివిధ పీఎస్‌ల్లో నమోదైన కేసుల వివరాల జాబితా డీజీపీ నుంచి అందిందని ఆ పార్టీ హైకోర్టుకు తెలిపింది. మార్చి 7,14 తేదీల్లో డీజీపీకి వినతిపత్రాలు అందజేసినప్పటికీ బీజేపీ తరపున పోటీ చేయనున్న అభ్యర్థులపై ఉన్న కేసుల వివరాలు ఇవ్వలేదంటూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు, ఉదయం జరిగిన విచారణ సమయంలో పిటిషనర్ కోరిన మేరకు ఆ పార్టీ అభ్యర్థులపై ఉన్న కేసుల వివరాలు ఇవ్వాలని న్యాయమూర్తి పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు, తిరిగి మధ్యాహ్నం పిటిషనర్ న్యాయవాది వచ్చి డీజీపీ నుంచి కేసుల వివరాల జాబితా అందిందని చెప్పడంతో పిటిషన్‌పై విచారణ మూసివేస్తున్నట్టు ప్రకటించారు.

లాఅండ్‌ఆర్డర్ సమస్య లేకుండా శోభాయాత్ర

శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉండే మార్గంలోనే శోభాయాత్ర నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్‌కు అభ్యంతరం లేకపోతే పోలీసులు నిర్ణయంచిన మార్గంలో శోభాయాత్ర నిర్వహించుకోవాలని పిటిషనర్‌కు చెప్పింది, శోభాయత్రకు టప్పాచబుత్ర పోలీస్ స్టేషన్ పరధిలోని మార్గాల్లో నిర్వహించేందుకు పోలీసులు అనుమతి ఇవ్వడం లేదంటూ కేసరి హనుమాన్ యువ సంఘటన్ అధ్యక్షులు అడ్డాల కార్తీక్ లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టి పైవిధంగా ఉత్తర్వులు జారీ చేశారు. పిటిషనర్ మార్గాల్లో శోభాయాత్రకు అనుమతిస్తే శాంతిభద్రతలకు విఘాతానికి ఆస్కారం ఉంటుందని ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. వాదనల తర్వాత లాఅండ్‌ఆర్డర్‌కు విఘాతం లేని మార్గంలో అనుమతి ఇవ్వాలని ఆదేశించిన హైకోర్టు పిటిషన్‌పై విచారణ మూసేసింది.

ప్రయాణీకుల సౌకర్యం కోసం ప్రత్యేక రైళ్లు

- దక్షిణ మధ్య రైల్వే

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రయాణీకుల సౌకర్యార్థం వేసవి కాలంలో ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రాంతం నుంచి ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు ప్రయాణించే ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా దానాపూర్ వైపు రోజువారీగా నడిచే సికింద్రాబాద్ – దానాపూర్ ఎక్స్‌ప్రెస్ మాదిరిగా వారానికోసారి నడిచే అన్‌రిజర్వ్‌డ్ వేసవి ప్రత్యేక రైళ్లను నడపాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. రాష్ట్రం నుంచి భారీ సంఖ్యలో ప్రజలు ఇటార్సి , ప్రయాగ్‌రాజ్ , దీనదయాళ్ ఉపాధ్యాయ్, దానాపూర్ స్టేషన్ల వంటి ముఖ్యమైన నగరాల వైపు ఎక్కువగా ప్రయాణిస్తున్నారని రైల్వే అధికారులు తెలిపారు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో స్థిరపడిన కార్మికులు సెలవులు, వేసవి కాలంలో కూడా తమ సొంత పట్టణాలకు తరుచుగా వెళుతుంటారని తెలిపారు. ప్రతి రోజూ సికింద్రాబాద్ నుంచి దానాపూర్ వరకు వెళ్ళే రెగ్యులర్ దానాపూర్ ప్రత్యేక రైలు ఉదయం 09:25 కు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ వేసవి కాలంలో ప్రయాణీకుల అదనపు ప్రయాణ అవసరాలను తీర్చడానికి, సాధారణ రోజువారీ నడిచే రెగ్యులర్ రైలు కంటే ముందుగా ఒక ప్రత్యేక క్లోన్ రైలును నడపాలని వారు తెలిపారు.

పీఆర్సీ ఛైర్మెన్‌ను కలిసిన ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర పే-రివిజన్ కమిషన్ ఛైర్మెన్ శివశంకర్‌ను రాష్ట్ర పోలీసు విభాగం పర్సనల్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా పేరివిజన్‌కు సంబంధించి పోలీసు శాఖ తరపున తమ ప్రతిపాదనలను ఐజీ అందజేశారు. పోలీసు శాఖలోని కానిస్టేబుళ్ల మొదలుకొని నాన్‌క్యాడర్ ఎస్పీల వరకు సవరించాల్సిన వేతనాల గురించి ఈ ప్రతిపాదనలో ఛైర్మెన్‌కు వివరించారని తెలిసింది.

చంద్రబాబు బెయిల్ షరతులు ఉల్లంఘించొద్దు

- అధికారులను బెదిరిస్తున్న లోకేష్ రెడ్ బుక్ అంశాన్ని జాబితా చేయండి : సుప్రీంకోర్టు ధర్మాసనం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు షరతులను ఉల్లంఘించడానికి వీలులేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కేసులో చంద్రబాబుకు ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిట్టల్ ధర్మాసనం విచారించింది. ఏపీ ప్రభుత్వ తరపు సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ వాదనలు వినిపిస్తూ చంద్రబాబుకు వ్యతిరేకంగా చార్జిషీట్ దాఖలైనట్టు ధర్మాసనానికి తెలిపారు. అధికారంలోకి వచ్చాక దర్యాప్తు అధికారుల సంగతి చూస్తామని చంద్రబాబు తనయుడు లోకేష్ బెదిరిస్తున్నారని, ఈ అంశంపై ఐఏ దాఖలు చేశామని ధర్మాసనానికి రంజిత్ కుమార్ తెలిపారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెడ్ బుక్‌లో ఉన్న అధికారులను సస్పెండ్ చేయడం లేదా చర్యలు తీసుకుంటామని లోకేష్ ప్రసంగాలు చేస్తున్నారని ధర్మాసనానికి రంజిత్ కుమార్ తెలిపారు. చంద్రబాబు బెయిల్ షరతులు ఉల్లంఘిస్తున్నారని, ఉల్లంఘించడానికి లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. కాగా ఆయన బెయిల్ షరతులు ఉల్లంఘించడం లేదని చంద్రబాబు తరపు న్యాయవాది సిద్ధార్థ లుత్రా ధర్మాసనానికి తెలిపారు. లోకేష్ మాట్లాడితే బెయిల్ షరతుల ఉల్లంఘన ఎలా అవుతుందని అడిగారు. లోకేష్ అధికారులను బెదిరిస్తున్నారన్న రెడ్‌బుక్ అంశంపై అప్లికేషన్ జాబితా చేయాలని రిజిస్ట్రార్‌కి సుప్రీంకోర్టు సూచించింది. తదుపరి విచారణను మే 7కి వాయిదా వేసింది.

అరుణాచల్‌ప్రదేశ్‌లో నాలుగు పోలింగ్ బూత్‌లకు

- వాయుమార్గం ద్వారా సిబ్బంది తరలింపు

ఇటానగర్ : అరుణాచల్‌ప్రదేశ్‌లో దూరంగా ఉన్న నాలుగు పోలింగ్ బూత్‌లకు వాయుమార్గం ద్వారా 40 మంది ఎన్నికల సిబ్బంది, పోలీసులను అధికారులు తరలించారు. లోకసభ ఎన్నికల తొలిదశలో భాగంగా ఈ నెల 19న ఈ నాలుగు పోలింగ్ బూత్‌ల్లో ఎన్నికలు జరగనున్నాయి. దాది జిల్లాలో చైనా సరిహద్దుల్లో ఉన్న ఈ బూత్‌లకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఈవీఎంలు), ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్స్ (వీవీపీఏటీలు)తో పాటు సిబ్బందిని సోమవారం వాయువార్గంలో తరలించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ప్రత్యేక డ్యూటీ (ఓఎస్‌డీ) అధికారి టోకో బాబు మంగళవారం మీడియాకు తెలిపారు. 'స్కైఓన్ ఎయిర్‌వేస్‌కు చెందిన ఎంఐ-172 చాపర్ ద్వారా సిబ్బందిని రెండు దఫాలుగా తరలించాం' అని చెప్పారు. రోడ్డు మార్గం సక్రమంగా లేని మరికొన్ని పోలింగ్ స్టేషన్లకు కూడా ఎన్నికల సిబ్బందిని వాయుమార్గంలో తరలించే అవకాశం ఉందని చెప్పారు. సోమవారం వాయుమార్గం ద్వారా వెళ్లిన సిబ్బంది బృందాలు ముందుగా జిల్లా హెడ్‌క్వార్టర్స్ తాలి వద్దకు చేరుకుంటాయని, తరువాత ఈ నెల 17న బయలుదేరి కాలినడకన ఆయా పోలింగ్ స్టేషన్లకు వెళతాయని చెప్పారు.

కాగా, అరుణాచల్‌ప్రదేశ్‌లో మొత్తం 2,226 పోలింగ్ బూత్‌లు ఉండగా, వీటిలో 228 బూత్‌లకు కేవలం కాలినడకన మాత్రమే చేరుకోగలం. మళ్లీ వీటిల్లో 61 పోలింగ్ బూత్‌లకు రెండు రోజుల పాటు నడవాల్సి ఉంటుంది. మరో ఏడు బూత్‌లకు చేరుకోవడానికి మూడు రోజుల పాటు నడవాల్సి ఉంటుంది. అరుణాచల్ ప్రదేశ్‌లో రెండు లోక్‌సభ స్థానాలు, 60 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. తొలిదశలో రెండు లోక్‌సభ స్థానాలు, 50 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మిగిలిన 10 అసెంబ్లీ స్థానాల్లో బిజెపి ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికయింది.

మహిళలు.. యువ ఓటర్లే కీలకం

'ఛత్తీస్' లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థుల భవిష్యత్తు వారి చేతుల్లోనే

- గతేడాది అసెంబ్లీ ఎన్నిక ఓటింగ్ ప్రక్రియలో చురుగ్గా పాల్గొన్న మహిళలు
- ఆ రెండు వర్గాలపై ప్రధాన పార్టీల దృష్టి



రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లో రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థుల భవితవ్యం అక్కడి మహిళలు, యువ ఓటర్ల మీదనే ఉన్నది. ఇందుకు గతేడాది రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ సరళిని చూస్తే పూర్తి చిత్రం అవగతమవుతున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటర్లుగా పురుషుల కంటే ఎక్కువ సంఖ్యలో మహిళలు చురుగ్గా పాల్గొన్నారని వారు గుర్తు చేస్తున్నారు. రాష్ట్రంలో కొత్త ఓటర్ల సంఖ్య కూడా పెరిగిందనీ, దీంతో రాబోయే ఎన్నికల్లో మహిళలతో పాటు యువత కూడా నిర్ణయాత్మక శక్తిగా మారనున్నదని విశ్లేషకులు అంటున్నారు. రాష్ట్రంలోని ఓటర్లలో పదకొండు లోక్‌సభ నియోజకవర్గాల్లో మహిళలు, యువత ఓట్లు అధికంగా ఉన్నాయని గణాంకాలను వారు ఉటంకిస్తున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా, మొత్తం 2.05 కోట్ల మంది ఓటర్లలో 52.88 లక్షల మంది (ఇది మొత్తం 23 శాతం) 18-29 ఏండ్ల మధ్య వయస్కులే కావటం గమనార్హం. 18-49 ఏండ్లలోపు వారు మొత్తం యాభై శాతానికి మించి ఉన్నారు. రాష్ట్రంలో గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారాన్ని చేజిక్కించుకున్నది. కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నది.

ఇప్పుడు ఈ రెండు ప్రధాన పార్టీలు ఆ రెండు వర్గాల మీదనే ప్రధానంగా ఫోకస్ చేస్తుండటం గమనార్హం.పోలింగ్‌కు ముందు ఓటర్లను ఒప్పించేందుకు ఇటీవల విడుదల చేసిన మ్యానిఫెస్టోల్లో మహిళలు, యువత కోసం తమ హామీలను ప్రకటించేటప్పుడు రెండు పార్టీలు కీలకంగా దృష్టిని సారించాయి.దేశంలోని పదో అతిపెద్ద రాష్ట్రంగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో 2.05 కోట్ల మంది ఓటర్లలో మహిళా ఓటర్లు 1.03 కోట్ల మంది కాగా పురుషులు 1.01 కోట్ల మంది ఉన్నారు. దేశంలో ధరల పెరుగుదల, మహిళలకు భద్రత కరువు కావటం, వారిపై బీజేపీ నాయకుల దుర్భాషలు వంటి అంశాలు మోడీ సర్కారుకు ప్రతికూలాంశాలుగా మారి, కాషాయపార్టీకి ఛత్తీస్‌గఢ్‌లో మహిళా ఓటింగ్ శాతం తగ్గే అవకాశాలు మెండుగా ఉన్నాయని విశ్లేషకులు చెప్తున్నారు.

మహిళల రాజకీయ భాగస్వామ్యంలో ఛత్తీస్‌గఢ్ పర్వాలేదని గణాంకాలు చెప్తున్నాయి. రాష్ట్ర అసెంబ్లీలో ప్రస్తుతం అత్యధిక మహిళా ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇది మొత్తం శాసనసభ్యులలో 21.11 శాతం. 90 మంది సభ్యుల సభలో 19 మంది శాసనసభ్యులు మహిళలే ఉన్నారు. అయితే, ఈ సంఖ్య ఇంకా పెరగాల్సిన అవసరమున్నదనీ, ప్రధాన రాజకీయ పార్టీలు అటువైపుగా కృషి చేయాలని మేధావులు, సామాజికవేత్తలు అంటున్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థులకు 18న బి ఫారాలు

- ఖర్చులకు రూ.95లక్షల చెక్కు
- అందించనున్న అధినేత కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయనున్న బీఆర్ఎస్ అభ్యర్థులకు, పార్టీ అధినేత కేసీఆర్ ఈనెల 18న బి ఫారమ్‌లను అందజేయనున్నట్టు మంగళవారం ఆ పార్టీ ప్రకటించింది. అదే సందర్భంలో ఎన్నికల ఖర్చుల నిమిత్తం నియమావళిని అనుసరించి రూ.95 లక్షల చెక్కును అభ్యర్థులకు అందించనున్నట్టు తెలిపింది. ఆ రోజు జరిగే సమీక్షా సమావేశంలో ఎన్నికల ప్రచారం, తదితర వ్యూహాలకు సంబంధించి అధినేత సమగ్రంగా చర్చించనున్నట్టు పేర్కొంది.

ఈ సమావేశంలో... ఎంపీ అభ్యర్థులతో పాటు పార్టీ శాసన సభ్యులు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, జెడ్పీ ఛైర్మెన్లు, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యులు, పార్టీ ముఖ్యులు పాల్గొంటారని తెలిపింది.

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానాలను నమ్మి మోసపోయామని చింతిస్తున్న తెలంగాణ ప్రజలు.. కేసీఆర్ నాయకత్వాన్ని తిరిగి కోరుకుంటున్నారని తెలిపింది. ఇప్పటికే జరిపిన బహిరంగ సభలకు ప్రజా స్పందన వెల్లువెత్తుతున్న నేపథ్యంలో.. తెలంగాణ ప్రజలకు మరింత చేరువకావాలని అధినేత కేసీఆర్ నిర్ణయించారని బీఆర్ఎస్ పేర్కొంది. కాంగ్రెస్ తెచ్చిన కరువుకు అల్లాడుతున్న రాష్ట్ర రైతాంగం వద్దకు వెళ్లి వారి కష్ట సుఖాలను తెలుసుకోవడానికీ, వారికి భరోసానివ్వడానికి రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రలు నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించారనీ, రూట్ మ్యాప్‌పై చర్చించి తుది నిర్ణయం ప్రకటిస్తాయని తెలిపింది.